బ్రహ్మాస్త్ర స్వరూపిణీ! దేవి కళ్యాణి!

శ్రీ బగళాముఖీ మహావిద్య

రచయిత :

భాషాప్రవీణ, విద్యాప్రవీణ

డాక్టర్. తూములూరు శ్రీదక్షిణామూర్తిశాస్త్రి

ఎమ్.ఏ., పిహెచ్.డి.

పొన్నూరు, 944 194 2157

శ్రీ లలితాంబ జగన్మాత. జీవులందఱికి తల్లి ఉన్నట్లే ఈ సృష్టి మొత్తానికి ఒక తల్లి ఉంది. ఆవిడే ఈశ్రీమాత. మనకు కనబడుతున్న ఈ సృష్టిఅంతా ఒక బ్రహ్మచేత నిర్మింపబడినది. దీన్ని బ్రహ్మాండమని అంటారు. ఇటువంటి బ్రహ్మాండాలు అనేకం ఉన్నాయట.(ఆధునిక శాస్త్రవేత్తలు పరిశోధించిన కొద్దీ విశ్వరహస్యాలు ఎన్నో బయట పడుతున్నాయి.) అన్నింటికి ఆమెయే మూలము. అందుకే ఆ అమ్మను అనేక కోటి బ్రహ్మాండ జనని అని కీర్తించారు. ఆ తల్లి తేజమే వివిధ రూపాలతో విశ్వమంతా వ్యాపించింది. 'వ్యాపినీ, వివిధాకారా'

ఆమె విరాడ్రూపమే ఈ విశ్వము. కంటికి కనిపించే ఆకాశము మొదలైన ఈ పంచభూతములు ఆమె దేహం. వాటిని నియంత్రించేది కూడా ఆమెయే. అందుకే ఆ జగజ్జనని "పంచభూతేశీ" అన్నారు. 'విశ్వరూప' యైన అమ్మకు సూర్యచంద్రులు చెవుల కమ్మలు (దిద్దులు), నక్షత్ర కాంతిని మించిన దివ్యకాంతి కలది ఆమె ముక్కుపుడక. ఆమె కన్నులు తెరిస్తే సృష్టి. కన్నులు మూస్తే ప్రళయం ఏర్పడుతుంది. ఆమెకు చావు పుట్టుకలు లేవు. వృద్ధి క్షయములు కలుగవు. కదిలే దానిలో కదిలేదిగా, కదలని దానిలో కదలనిదిగా ఉండి లోకయాత్రను సాగిస్తుంది.

రాక్షసుల బాధలు పడలేక తమను రక్షించమని దేవ,ఋషి, గణములు ఆమెను శరణు వేడాయి. ఆమె వైభవము వేనోళ్ళ సంస్తుతించాయి. అప్పుడామె దేవకార్యము నిర్వహించడానికి చిదగ్ని కుండమున ఉద్భవించి, భండాసురుడు మొదలైన రాక్షసులను సపరివారంగా సంహరించి, లోకములకు మేలుచేసింది. దురాచారములను రూపుమాపింది. ధర్మార్థ కామమోక్షములనే పురుషార్థములను ప్రసాదిస్తూ, దయతో భక్తుల కోరికలను దీర్చే 'ఆ కామాక్షి'ని కొలిచే వారిని, లక్ష్మీ సరస్వతులు కూడా అనుగ్రహిస్తారు. సచామర రమావాణీ సవ్యదక్షిణ సేవితా. అణిమాది అష్టసిద్ధులు అమ్మసేవలో పునీతములయ్యాయి. ఆ అమ్మదయ ఉంటే అన్నీ ఉన్నట్లే.

శ్రీ లలితా దివ్య సహస్రనామములు మాలా మంత్రమై సకల విద్యల సారమును వివరిస్తున్నాయి. స్వతంత్రమైన తంత్రమగు ఈ సహస్రనామ స్తోత్రము, ఆ దేవి మంత్రస్వరూపమై ఉపాసకులకు శాంతిసౌఖ్యములను చేకూరుస్తుంది. శ్రీచక్రం ఆమె నివసించే స్థానం. ఆ యంత్రం ఉన్నచోట సిరిసంపదలు వర్ధిల్లుతాయి. వశిన్యాది వాగ్దేవతలు ఆ లలితాదేవి స్వరూప స్వభావాలను వివరిస్తూ చెప్పిన ఈ స్తోత్రాన్ని సమస్త దేవతలు కొలువుదీరిన నిండు సభలో అమ్మ సమక్షంలో చదివి వినిపించారు. అమ్మ సంతోషించి, లోకాలకు తన ప్రసాదంగా దానిని అందించిందని బ్రహ్మాండ పురాణంలో వర్ణింపబడింది. ఆ సేతు హిమాచలముగల శక్తి పీఠము లన్నింటిలో ఈ సహస్రనామములతోనే పూజాదికములు నిర్వహిస్తారు.

అమ్మ దయను కోరుకునే వారంతా, ఈ స్తోత్రరాజమును పఠించి తమ అభీష్టములను పొందగలరు. ఆ శ్రీదేవి నామపారాయణమాత్రముచేతనే ప్రీతురాలగుచు శుభములను ప్రసాదిస్తుంది.

శివుడు లేని శక్తి లేదు, శక్తిలేని శివుడు లేడు. వారిది అర్ధనారీశ్వరతత్త్వము. వాగర్థముల వలె కలిసిఉండి వారు, సకల జగములకు తల్లిదండ్రులై ప్రకాశించుచున్నారు. వాగర్థ సంపదకు ఈ శివశక్తులను ప్రార్థించి, కాళిదాసు కృతకృత్యుడై కృతికర్తయు, మహా కవిగా ప్రసిద్ధిచెందాడు.

"జన్మ మృత్యుజరాతప్తజన విశ్రాంతదాయిని" అయిన లలితాంబ తనను తలచిన వారికి పునరావృత్తి రహిత శాశ్వత బ్రహ్మలోకనివాసమును కల్పిస్తుంది. శ్రీ లలితాదేవి శక్తులే, దశమహావిద్యలు. అందులో బగళాముఖీ అమ్మవారిది విశిష్ట స్థానం.

దేవి ఆవిర్భావము

శ్రీమత్ త్రిపుర సుందరి అంశలుగా అవతరించిన దశవిధ మహా విద్యలలో బగళాముఖీ అమ్మవారు 8వదిగా పేర్కొనబడుతోంది. ఉత్తర భారతంలో ఈ దేవి ఆరాధన అధికంగా కనబడుతుంది. కృతయుగంలో ఒకప్పుడు కుంభవృష్టి కురిసి ప్రకృతి బీభత్సాన్ని సృష్టించింది. విశ్వరక్షకుడైన విష్ణువు, సౌరాష్ట్ర దేశంలో హరిద్రా సరోవర తీరంలో ఎడతెరిపిలేని ఆ వర్షపాతాన్ని నిలిపి ప్రకృతిని ప్రజలను కాపాడేందుకు శక్తిని అనుగ్రహింప వలసిందిగా త్రిపుర సుందరిని ప్రార్థించాడు. ఆ ప్రార్థనను మన్నించిన అమ్మవారు, తన అంశగా బగళాముఖిని సృష్టించి, ఆ ప్రకృతి వైపరిత్యాన్ని అరికట్టమని ఆదేశించింది. అందుకు తగిన శక్తి సామర్థ్యాలనిచ్చి తన ప్రతికృతిగా నిలిపింది.

ఆ సందర్భంగా స్తంభన శక్తియైన బగళాముఖీ అమ్మవారు, పీతవర్ణగా దర్శనం ఇచ్చింది. పచ్చని కమలం చేతిలో ధరించి, హరిద్రా సరోవరం నుండి ఆవిర్భవించి, దేవీ ఆదేశాన్ని పాటించి, కల్యాణియై లోక వ్యవహారాన్ని చక్కదిద్దింది. ఉత్తరభారతదేశంలో ఈతల్లిని **'పీతాంబరి'** అని కూడా పిలుస్తారు. ఆమె ధరించే ఆభరణాలు కూడా **'పసుపుపచ్చని'**వే అవటం విశేషం. ఈమెకు తోడుగా, పరమశివుడు(మృత్యుంజయుడు), భైరవుడుగా దర్శనమిస్తాడు.

ఈశాన్య భారతదేశంలో అస్సాం రాష్ట్రంలో గౌహతికి దగ్గరగా **'కామాఖ్యా'** అన్న దేవీ క్షేత్రం ఉంది. ఆ ఆలయంలోనే కొద్ది దూరంలో **'బగళాముఖీ'** అమ్మవారు కూడా కొలువుదీరి ఉంది. తమిళనాడులో ప్రాపంకులమ్ గ్రామంలో, తిరునల్వేలికి దగ్గఱలోను, కంచికి సమీపంలోను ఉత్తర కర్ణాటకలో సోమలాపుర అన్న చోట్ల 'బగళాముఖీ' అమ్మవారి దేవాలయాలు ఉన్నాయి. అక్కడ ఒక మహాయోగిచే నిర్మింపబడిన సిద్ధపీఠము ఉంది. వారిచే సంకలనము చేయబడిన పారాయణ గ్రంథం ఇప్పటికీ ప్రచారంలో ఉంది.

బగళాముఖీ అమ్మవారి మంత్రం :

"ఓం హ్లీం బగళాముఖీ సర్వదుష్టానాం వాచం ముఖం పదం స్తంభయ, జిహ్వాంకీలయ, బుద్ధిం వినాశయ హ్లీం ఓం స్వాహా"

ఈ మంత్రాన్ని సాధకులు గురుముఖతః నేర్చుకొని, పచ్చని వస్త్రములు ధరించి, పచ్చని పూసలతో చేసిన జపమాలతో జపం చేసేవారిని అమ్మవారు శీఘ్రంగా అనుగ్రహిస్తుంది. లోకంలో కొందఱు బోధగురువులుకాగా, మఱి కొందఱు బాధగురువులుగా ఉన్నారు. సాధకులకు సద్గురువు లభించటం అదృష్టం. పూర్వ జన్మసుకృతం. 'గురు' శబ్దంలో, 'గు' అంటే (చీకటి), అజ్ఞానమని, 'రు' అంటే దాన్ని నిరోధించేవాడని అర్థం చెప్పారు. శిష్యుల హృదయతాపాన్ని పొగొట్టే సద్గురువు, త్రిమూర్తి స్వరూపుడని సంభావించారు. గుర్తు చెప్పేవాడు 'గురు'వన్నారు. ఆ గురువు, ఆత్మజ్ఞానాన్ని కలిగిస్తాడు. పరమాత్మయందు భక్తి భావాన్ని పెంపొందిస్తాడు. సంసారమునందు భ్రాంతిమూలకమైన అజ్ఞానాన్ని తొలగిస్తాడు. నిత్యమై, నిఖిలమై ప్రకాశించే పరబ్రహ్మముయొక్క సచ్చిదానంద స్వరూపాన్ని దర్శింపజేస్తాడు.

తల్లిదండ్రులు జన్మనిస్తారు. గురువు జ్ఞాన జన్మనిస్తాడు. అమ్మయే 'శ్రీగురువు' రూపంలో తత్త్వమును బోధిస్తుంది. అందుకే అమ్మ 'గురు మండల రూపిణి'గా పేర్కొనబడింది. 'బగళాముఖీ' అమ్మవారు, ముఖ్యంగా స్తంభన శక్తిగా కీర్తింపబడుతోంది యుద్ధంలో, విజయాన్ని పొందడానికి రాజులు ఈమెను ఆరాధించేవారు. సభలలో వాదప్రతివాదములు జరిగే సమయంలో దేవీ ఉపాసకులు, ప్రతివాది, వాక్ స్తంభనం చేసి విజయాన్ని సాధించేవారు. 'పరమంత్ర విభేదిని'గా ఆమె కీర్తింపబడుతోంది.

ఆంధ్రదేశంలో 19వ శతాబ్దంలో తిరుపతి వేంకట కవులు, జంటగా అవధానములు చేస్తూ ఆశుకవితా ప్రదర్శనలు ఇస్తూ ఆంధ్ర సరస్వతికి సేవ

చేశారు. నానారాజ సందర్శనము చేసి సన్మానముల నెన్నింటినో పొందారు. గజారోహణ, గండపెండేరములను సాధించారు. ఎందరో శిష్యులను తయారుచేశారు. కవిసమ్రాట్ శ్రీవిశ్వనాథ సత్యనారాయణగారు, శ్రీఅవ్వారి సుబ్రహ్మణ్య శాస్త్రిగారు, శ్రీకాటూరి వెంకటేశ్వరరావుగారు, శ్రీపింగళి లక్ష్మీకాంతం గారు మొ॥ ఉద్దండ పండితులు వారి శిష్యులై, పేరు ప్రతిష్ఠలు సంపాదించుకొని గొప్ప, గొప్ప గ్రంథాలు వ్రాశారు. ఆ రోజుల్లో 'చెళ్ళపిళ్ళ వెంకన గురువంచు చెప్పుకొనగా నది గొప్ప తెలుంగునాడు నన్' అనే ప్రసిద్ధి ఏర్పడింది. వారి శిష్యులమని చెప్పుకొన్న వారికి సమాజంలో ఆదరణ, అభిమానము లభించేవి.

ఒకప్పుడు, ఆ తిరుపతి వేంకట కవులకు, కాశినాథుడు అనే శాస్త్ర పండితునకు పాండిత్య ప్రదర్శనలో వివాదమేర్పడింది. సభలో చర్చకు ఇద్దఱూ సిద్ధమయ్యారు. సభ ఏర్పాటు చేశారు. కవులు పండితులు ఎందఱో ఆసభకు వచ్చారు. చర్చ ప్రారంభమయ్యింది.

'కోఽయంవాదిः' మాతో చర్చకు వచ్చిన ఈ పండితులవారి పేరేమిటని అడిగారు, తిరుపతి వేంకట కవులు. 'కాశినాథः' కాశినాథుడని సమాధానం చెప్పారు వారు. 'కథం కాశినాథः' కాశినాథుడన్న పేరు శాస్త్రరీత్యా ఎలా సాధువని ప్రశ్నించారు తిరుపతి వేంకట కవులు. నిజానికి ఆ పదము 'కాశీనాథు'డని ఉండాలి. ఆ పండితుడు తనకు పరిచయమున్న శాస్త్రాలనన్నింటిని గుర్తు చేసుకొంటూ అందుకు తగిన ప్రమాణమేమీ దొరకక, మౌనం వహించారు. చర్చా సమయం గడచిపోయింది. సభ నిర్వహించిన పెద్దలు, తిరుపతి వేంకట కవులు విజేతలని ప్రకటించారు. సభ ముగిసింది. సభ దిగివచ్చిన కాశినాథులతో వారి స్నేహితులు – "యథా కాళిదాసः, తథా కాశినాథः" అని, వ్యవహార సిద్ధమైన విషయాన్ని చెప్పకపోయారా? అని ప్రశ్నించారు. సమయానికి అసంగతి, బుద్ధికి తోచనందుకు ఆయన నొచ్చుకున్నారు. ఆవిధంగా **దేవీ ఉపాసకులైన** తిరుపతి వేంకట కవులు విజయం సాధించారు.

"అతః శత్రుస్తంభన కామోవా బగళాముఖీ ముపాసీత" అన్న గణపతిముని శాస్త్ర వాక్యాన్ని అనుసరించి 'బగళాముఖీ' అమ్మవారు బాహ్య శత్రువులనే కాదు అంతశ్శత్రువులను జయించి, పరబ్రహ్మ దర్శనము చేసే ప్రయత్నంలో సాధకులకు ఎంతగానో ఉపకరిస్తుంది. దుష్టశిక్షణము,శిష్టరక్షణము చేయడంలో ఆ తల్లి కడు సమర్థురాలు. పురాణ వాఙ్మయము ననుసరించి మదనుడనే రాక్షసుడు విజృంభించి, లోకోపద్రవములను సృష్టించి, దేవతలను, మునులను, సాధుజనులను బాధిస్తూఉంటే అమ్మవారు అతనిని సంహరించి, లోక కల్యాణమును కల్గించింది. 'కల్యాణి'గా కీర్తింపబడింది. శుభములను కూర్చునది అని అర్థము.

లోకంలో అన్ని వేగాల్లోనూ మనోవేగం చాలా అధికమైనది. ఈ చల్లని తల్లి, భక్తుల మనోవేగాన్ని నియంత్రించి, భ్రమలను తొలగించి భయములను పోగొట్టి యథార్థమైన స్వస్వరూపాన్ని దర్శింపచేసి, ఆశ్రితులను కాపాడుతుంది. భక్తుల నమ్మకాన్ని వమ్ముచేయకుండా అమ్మవారు, కోరిన వారికి ఆరోగ్యాన్ని, సంతానాన్ని, బిడ్డల వివాహాన్ని, ఉద్యోగాన్ని ఇప్పించి ధన, ధాన్యాదికమును సమకూర్చి పెడుతుంది. పోతన భాగవత పురాణంలో, రుక్మిణి కూడా, అమ్మవారి అనుగ్రహంతో కృష్ణుని భర్తగా పొందిందని ఉంది.

నమ్మితి నా మనంబున సనాతనులైన ఉమా మహేశులన్
మిమ్ము పురాణ దంపతుల; మేలు ఘటింపగదమ్మ మేటి పె
ద్దమ్మ ! దయాంబురాశివి గదమ్మ ! హరింబతి సేయుమమ్మ ! నిన్
నమ్మిన వారి కెన్నడును నాశము లేదు గదమ్మ శాంకరీ !

ఆలయ ప్రాధాన్యత :

దేవతలు కొలువుదీరిన ప్రదేశము గుడి. మనదేశంలో ఎన్నో గుడులు ఉన్నాయి. గుడిని, ఆలయమని, ఆయతనమని పిలుస్తారు. విశ్వమంతా నిండి వెలుగొందుతున్న ఆ దివ్యశక్తిని, అర్చించటం సామాన్యులకు సాధ్యం కాదు.

అందువల్ల పవిత్రమైన ఒక ప్రదేశంలో, ఒక ప్రత్యేకమైన రీతిలో ఆగమశాస్త్ర పద్ధతిలో నిర్మింపబడి, జప, పురశ్చరణల ద్వారా మంత్రశక్తిని, యంత్రంలో చేర్చి, ఆయంత్రమును, దేవతా విగ్రహమును ప్రతిష్ట చేసిన చోటునే గుడిగా పేర్కొంటారు. అందులో గర్భగుడిలో దేవుడు లేక దేవత ఉంటారు. ఇంకా, ముఖమండపమని, కల్యాణమండపమని, సభా మండపమని, కట్టించి ఆయా ప్రయోజనముల కొఱకు ఉపయోగిస్తారు.

నది, అంతటా ప్రవహిస్తున్నా, నీరు త్రాగటానికి, స్నానం చెయ్యటానికి ఒక రేవును ఏర్పాటు చేసుకొన్నట్లే, విశ్వచైతన్యాన్ని ఆరాధించటానికి, అనుగ్రహం పొందటానికి ఒక దేవాలయాన్ని ఉత్తమ స్థానంగా ఎంచుకొంటాం.

పూర్వం ఆలయాలు, జ్ఞాన విజ్ఞానములను బోధించే స్థావరములుగా ప్రసిద్ధికెక్కాయి. శ్రుతి, శాస్త్ర, పురాణాంశములు ప్రస్తావింపబడి, మనోవికాసాన్ని కలిగించేవి. ప్రాణికి, గుండె ఎంత ప్రాధాన్యమో, ఊరికి గుడి అంత ముఖ్యమని పెద్దలు భావించారు. గుండె, చెడురక్తాన్ని శుభ్రపరచి, మంచి రక్తాన్నినింపి, శరీరాన్ని ఆరోగ్యవంతంగా నిలిపినట్లు, గుడి, భక్తులయొక్క దురాలోచనలను అరికట్టి, భయములను నివారించి, దుఃఖ పరంపరను తొలగించి, శాంతిని, ప్రసాదిస్తుంది. ఆత్మస్థైర్యాన్ని కలిగిస్తుంది. భీడియంతో మనసు విప్పి ఇతరులతో చెప్పుకోలేని విషయాలను, వేదనలను అక్కడి దైవానికి నివేదిస్తాం. అభిలాషలను విన్న విస్తాం. ఆర్తి తొలగినవారు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలను ప్రకటించు కొంటారు. సమాజంలోని ప్రజలందఱు ఒకచోట సమావేశమై పురాణ ప్రవచనముల ద్వారా మంచి, చెడులను తెలుసుకొనేందుకు క్రమశిక్షణతో, ఐక్యమత్యంగా మెలగటానికి గుడులు సంస్కార కేంద్రములుగా ఉండేవి. ఆలయంలో ధూపదీప నైవేద్యములకు, వ్యవస్థ పరిరక్షణకు ఎందరో ఆస్తులిచ్చారు. ఆత్మబలిదానం చేసిన భక్తుల చరిత్రలు సంస్మరణీయాలు. ఇట్టి ఆలయాలు ప్రకృతి వైపరీత్యాల వలన కొన్ని, విదేశీ దండయాత్రలలో కొన్ని, దుర్జనుల

దుష్కృతులతో కొన్ని విధ్వంసమై పూర్వవైభవాన్ని కోల్పోయాయి. అందులో కొన్నింటిని సమర్థులైన కొందఱు పునరుద్ధరించారు. (సోమనాథ దేవాలయము) సువిశాలమైన మన భారతదేశంలో యాత్రాస్థలములుగా ప్రసిద్ధికెక్కిన, నదులు, దేవాలయాలు (తీర్థ, క్షేత్రములు) దేశసమగ్రతకు, సమైక్యతకు, దోహదంచేస్తూ, దేశభక్తిని పెంపొందిం చేవిగా ఉన్నాయి. విదేశాలలో కూడా ఈ ఆలయ సంస్కృతి ఇప్పుడిప్పుడే వృద్ధి పొందుతోంది. అందుకు తగిన కృషి జరుగుతోంది.

ఒకప్పుడు ధనదపురముగా ప్రసిద్ధికెక్కిన నేటి చందోలు గ్రామంలో, బండ్లమ్మవారుగా, పూజలందుకొంటున్న బగళాముఖీదేవి ఆశ్రయమిచ్చి, అదుకొనటంలో భక్తుల పాలిటి కల్పవృక్షంగా, కోరికలు తీర్చే కామధేనువుగా, చింతలు తీర్చే చింతామణిగా, అభివృదిపథంలో కలిగే ఆటంకములు తొలగించే విఘ్నవినాశినిగా, చదువులనిచ్చే సరస్వతిగా, సంపదలు చేకూర్చే లక్ష్మిగా, విజయాన్ని సమకూర్చే ఆదిశక్తిగా కీర్తింపబడుతోంది. రోగములను నశింపజేసి, ఆరోగ్యాన్ని సమకూర్చే దివ్యౌషధిగా పేరెన్నికగన్నది. ఈ ప్రాంత ప్రజలు ఏపాటి కష్టం కలిగినా అమ్మకు చెప్పుకోవటం జరుగుతుంది. అమ్మ అనుగ్రహంతో వారిని ఆ దుఃఖాలనుండి గట్టెక్కించి అక్కున చేర్చుకోవటం గమనించగలం. ఆదరించటంలో అమ్మను మించిన దైవం వేరొకరులేరు. "ఆపదికిం కరణీయం" ఆపదవచ్చినప్పుడు ఏంచెయ్యాలి. "స్మరణీయం చరణయుగళమంబాయాఃా" ఆజగన్మాత పదములను స్మరించి, శరణువేడాలి. ఏ సిద్ధపురుషుని సంకల్ప బలమో, ఏమహనీయుని తపఃఫలమో, బగళాముఖీ అమ్మవారు ఇక్కడ వెలిసింది.

అనుభవాలు :

'చందోలు శాస్త్రిగారు'గా ప్రసిద్ధులైన బ్ర.వే. తాడేపల్లి రాఘవ నారాయణ శాస్త్రిగారు, గొప్ప తపస్సంపన్నులు. వారి తండ్రిగారు శ్రీరామకథామృత గ్రంథకర్తలు శ్రీ వేంకటప్పయ్యశాస్త్రిగారు ఏర్పాటు చేసిన "శంకర సంస్కృత పాఠశాల"ను, నిర్వహిస్తూ, విద్యార్థులకు అన్న వస్త్రములిచ్చి ఉచితముగా

చదువుచెప్పిన జ్ఞానదాతలు. అధీతి, బోధలతో సుసంపన్నమైనవారి విద్యను, ఆచరణ ప్రచారములతో సార్థకము చేసుకొన్న గొప్ప మనీషులు, నిరీహులు, నిత్యతృప్తులు, నిత్యానుష్ఠానపరులు నిత్యాగ్నిహోత్రులు, నిరతాన్నదాత.

ఆప్రాంత ప్రజలేకాక, దూరదేశముల నుండి కూడ వచ్చిన జిజ్ఞాసువులకు వారి, వారి అర్హత ననుసరించి మంత్ర తంత్రము, లుపదేశించి, సంస్కారమును కలిగించి, ధర్మమార్గమును ప్రబోధించిన సద్గురువులు, పండితోత్తములు. పీఠాధిపతులైన యతిపుంగవులు కూడా వారి ధర్మాచరణ పద్ధతిని గమనించి, ఆదరముతో, స్వయముగా ఆశీర్వదించిన సందర్భములు ఎన్నో ఉన్నాయి. ఆర్తులై, రోగగ్రస్థులై, ఆసక్తితో, ఆశ్రయించినవారికి విభూతి, తీర్థప్రసాదములిచ్చి, సమస్యా పరిష్కారములు సూచించి, వేదనలకు విముక్తి కల్పించి ఆదరించేవారు.

నిరహంకారులు, నిత్యతృప్తు,లనఘుల్, నిర్వ్యాజ కారుణ్యసా
గరు, లాచారపరాయణుల్, సకల లోకస్తుత్యు లారాఘవో
త్తర నారాయణులార్ష ధర్మనిరతుల్ తాడేపలీద్యాన్వయా
భరణుల్ మాగురుదేవులర్థిజనకల్పా! రాజరాజేశ్వరీ!

అని, వారి శిష్యులు పారవశ్యంతో కీర్తించుకొని, వారివాక్కుకు పవిత్రను ఘటించుకొన్నారు. బ్రహ్మవేత్తలైన శాస్త్రిగారు, తాము ఎవరినీ, ఏమీ అడిగేవారుకాదు. కామ, క్రోధములకు లోభ, మోహములనకు, మద, మాత్సర్యములకు, లోనుగాక, తపోధనులై వారు పవిత్రమైన జీవయాత్ర సాగించారు. యతిపుంగవులు కంచి పెద్దస్వాములు సహితం వారి నడవడిని, కొనియాడి, ఆదరించారు. అభిమానించారు.

'ఇది' నాకిమ్మని యెన్నడెవ్వరిని 'కానీ' కోరఁడాతండు, లే
వెద,క్రోధప్రతి, లోభమోహములు, లేనేలేదు పాండిత్యసం
పదకున్గర్వము, మత్సరంబొకట, పోల్పన్లేడొకండా శుభా
స్పద నిర్వ్యాజ దయానురాగ ఖనికిన్ బ్రహ్మాత్మవిజ్ఞానికిన్.

నతులన్, రాఘవ పూర్వుడైన గురునిన్ నారాయణున్‌గొల్తు, సం
తతమాచార పరాయణుం డగుచు సద్ధర్మంబు బాటించుచున్
యతులున్ సమ్మతి నాదరింప జగదాద్యున్ శ్రీమహాదేవి, ను
న్నతి సేవించి, తరించినట్టి బుధమందారున్ మహోదారునిన్

(విష్ణువినిత శతకము)

ఒకప్పుడు, బ్ర.వే. తాడేపల్లి రాఘుననారాయణశాస్త్రిగారు, ఖాజీపాలెంలో పురాణంచెప్పి, పొద్దుపోయి చీకటిపడ్డ తర్వాత ఇంటికి (చందోలు) వస్తుంటే దారిలో దొంగలు కొందఱు వారిని వెంబడించారు. వారి చెవులుకు, చేతులకు ఉన్న బంగారు ఆభరణాలు అపహరించాలని వారి సంకల్పం. శాస్త్రిగారు మనస్సులో అమ్మను తలచుకొని, మంత్రజపం చేస్తూ, ముందు నడుస్తున్నారు. వెనుక దొంగలు ఎంత ప్రయత్నించినా వారిని చేరుకోలేకపోతున్నారు. జన సంచారంలేదు, చిమ్మచీకటి శాస్త్రిగారు ముందు, దొంగలు వెనుక, ఎందుకో వారు, "ఆగు, సొమ్ములక్కడపెట్టు" అని అనలేకపోతున్నారు. ఏక్షణానికేమి జరుగుతుందో తెలియని పరిస్థితిలో, అమ్మ నామస్మరణం చేస్తూనే శాస్త్రిగారు ఆగకుండా ముందుకు నడుస్తున్నారు. ఊరి పొలిమేరలకు రాగానే శాస్త్రిగారు, నిదానించి, ఎవరుమీరు ఎందుకు వెంబడిస్తున్నారని అడిగారు. ఏదో తెలియని అయోమయ స్థితిలో వారంత దూరం వచ్చారేకాని, పనిపూర్తి చేసుకోలేక పోయారు. చివరకు నోరు పెగల్చుకొని, "మేము దొంగలం, మీదగ్గఱ ఉన్న సొమ్ము కాజేయాలని వచ్చాం. మేమెంత వేగంగా నడిచినా, మిమ్మల్ని చేరుకోలేక పోయాం. ఏదో శక్తి మమ్మల్ని అడ్డుకుంటోంది. మీవిషయంలో పొరపాటు చేశాం. జరిగిందానికి క్షమించండి'అని ప్రాధేయపడ్డారు.

సజ్జనులను సందర్శించి, వారిని అనుసరిస్తే దుర్జనులు కూడా మంచి బుద్ధికలవారగుతారని పెద్దలు చెప్పినట్లు వారు, తమ తప్పుతెలుసుకొని, శాస్త్రిగారి మాటవిని, చోరవృత్తికి స్వస్తిచెప్పి, అప్పటి నుండి కష్టపడి జీవించడం

నేర్చుకొన్నారు. అప్పుడప్పుడూ వచ్చి శాస్త్రిగారికి నమస్కరించి వెళ్ళేవారు. ఈ సంగతి తెలిసి ఇంట్లోవాళ్ళు, శిష్యులు బాధపడుతుంటే అంతా 'అమ్మదయ' ప్రమాదం లేకుండా బయటపడ్డాం. స్తంభన విద్యాధిదేవత బగళాముఖి అమ్మవారు మనకు రక్షా కవచంగా ఉంటుందని అమ్మను స్మరించుకొని నమస్కరించారట. శ్రీ దత్తాత్రేయుని శిష్యుడైన కార్తవీర్యార్జునుడు కూడా, ఈ చోరస్తంభన విద్య ద్వారా రాజ్యపరిపాలన చేసి, లోకంలో మిక్కిలి కీర్తి గడించాడు. నాచిన్నతనంలో ఇంటికి గడియో, తాళమో వేసి, పెద్దవారు మూడుసార్లు **కార్యవీర్యార్జున** నామం పఠించేవారు. అది వారి విశ్వాసము.

మంత్రే తీర్థే, ద్విజే, దైవే, దైవజ్ఞే భేషజే, గురౌ, !
యాదృశీభావనాయత్ర, సిద్ధిర్భవతి తాదృశీ !!

విశ్వాసమే భగవంతుడు. గురునియందు, మంత్రమునందు, ఔషధ మిచ్చిన వైద్యునియందు, మనకెట్టి భావన ఉంటుందో అట్టి ఫలితం మనకు లభిస్తుందనటంలో సందేహంలేదు. ఇదే ఉత్తమ సంప్రదాయము.

బ్ర.వే. రాఘవనారాయణ శాస్త్రిగారికి చందోలులోగల బగళాముఖీ (బండ్లమ్మ) అమ్మవారంటే మిక్కిలి భక్తిప్రపత్తులున్నాయి. ఎవరైనా "కష్టంలో ఉన్నాం, ఏదో విధంగా కాపాడండి" అని అడిగితే, నే,నేమైనా దేవుణ్ణా! ఉళ్లో ఉన్న 'బండ్లమ్మకు చెప్పుకోండి, భక్తితో మ్రొక్కుకోండి'అని చెప్పేవారు. వారలా చేసి, కష్టాలనుండి గట్టెక్కిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

అప్పుల బాధనుండి బయటపడేసిన దేవతగా కూడ ప్రసిద్ధి :

ఒకాయన (పేరు చెప్పనులెండి) గుంటూరు నుండి వచ్చాడు. అయన మంచితనానికిపోయి, మధ్యవర్తిగా ఉండి స్నేహితుడిచేత వేరొకరికి పెద్ద మొత్తం ధనం అప్పుగా ఇప్పించాడు. అప్పటికది బాగానే ఉంది. కాలం గడిచింది, కథమారింది. తీసుకొనేటప్పుడు అందఱు కుబేరులలాగే మాట్లాడుతారు. మీరు

ఎప్పుడడిగితే అప్పుడే ఇస్తామంటారు. నిజంగా ఇవ్వవలసి వచ్చేటప్పటికి ఇదిగో, అదిగో అని దాటవేస్తారు. కాలయానప చేస్తారు. ఇచ్చిన వాడికి భయం. అసలు ఇస్తాడో? ఇవ్వడో? దిగులు కూడ. ఎన్నాళ్ళు ఊరుకుంటాడు. ఇచ్చినవాడు నోరుతెఱచి అడిగాడు. పుచ్చుకొన్నవాడు వ్యాపారంలో పెట్టాను. ఇప్పుడు నాదగ్గర డబ్బులేదు. వచ్చినప్పుడిస్తాలే అని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు. దాంతో ధనం, ఇచ్చినవాడు మధ్యవర్తిమీద పడ్డాడు. నాకు ఇప్పుడే డబ్బుకావాలి. వాడివ్వకపోతే, నువ్వే ఇవ్వాలని వత్తిడి చేశాడు. తీసుకొన్న వాడు బాధ్యతా రహితంగా ప్రవర్తించటం చూసి, ఎటూ పాలుపోక, ఏమీచేయలేక ఎవరికీ సర్దిచెప్పలేక చందోలు శాస్త్రిగారి దగ్గఱకు వచ్చి లబోదిబో అని నెత్తీ, నోరు బాదుకొన్నాడు. వారు ఆయనను బండ్లమ్మ (బగళాముఖీ) అమ్మవారి దగ్గఱ మొఱపెట్టుకోమని పంపించారు. వారి సూచనను పాటించాడు మధ్యవర్తిగా ఉన్న పెద్దమనిషి, 'వాంఛితార్థప్రదాయిని' అయిన అమ్మ కరుణించింది. అద్భుతం ఏంజరిగిందో తెలియదు. అచిరకాలంలోనే ఆ సమస్య పరిష్కారమయ్యింది. ఆయన ఆనందానికి అవధులు లేవు. అమ్మకు అసాధ్యమైన దేదీ లేదు. న్యాయస్థానంలో వారికి విజయాన్ని ప్రసాదించే తల్లిగా ప్రసిద్ధి. న్యాయవాద వృత్తిలో ఉన్నవారికి బాగా ఉపకరిస్తుందీ విద్య. 'వాగ్వాదినీ' అని వ్యాసులవారు బ్రహ్మాండపురాణంలో అమ్మను కీర్తించారు.

సర్వవ్యాధి ప్రశమనీ - సమస్త భక్త సుఖదా :-

బ్ర.వే. తాడేపల్లి రాఘవనారాయణశాస్త్రిగారికి శ్రీ చెరువు సత్యనారాయణ శాస్త్రిగారనే మనుమడు ఉన్నాడు. ఒంగోలులో సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. అతని కుమారుడు ఉరగాభరణ శ్రీనివాస్. అతనికి చిన్నతనంలో చందోలులో ఉండగా, ఒకసారి విపరీతమైన జ్వరం వచ్చింది. కావూరు వినయాశ్రమం డాక్టర్‌గారు, రాంభట్లపాలెం డాక్టర్‌గారు చూసి, చికిత్స

చేస్తున్నారు. ఎన్నాళ్ళకి జ్వరం తగ్గలేదు. ఆహారం పోవటంలేదు. ఒక స్థితిలో పిల్లవాడు, పిచ్చి, పిచ్చిగ మాట్లాడం మొదలు పెట్టాడు. చూసినవాళ్ళు సంధి పుట్టిందని అన్నారు. ఇంట్లో వాళ్ళంతా భయపడ్డారు. చుట్టుప్రక్కల వాళ్ళంతా బండ్లమ్మకు మ్రొక్కుకోండని సూచించారు. ఆ సలహా మేరకు ఆ స్థితి అమ్మకు నివేదించుకొని, పిల్లవాడికి కుంకుమ, తిలకం దిద్ది, నిమ్మకాయతెచ్చి మంచంమీద పెట్టుకొని 'అమ్మ' అనుగ్రహం కోసం ఎదురు చూస్తున్నారు. మూడు రోజులలో కుర్రవాడు లేచి కూర్చుని, పథ్యం తీసుకొన్నాడు. నీరసం తగ్గి క్రమంగా కోలుకొన్నాడు. శాస్త్రిగారు జట్కా పిలిపించి, పిల్లవాణ్ణి తీసుకొని, బండ్లమ్మతల్లి గుడికివెళ్ళి కొబ్బరికాయ నివేదనపెట్టి మ్రొక్కు చెల్లించుకొని ప్రార్థనా పూర్వక నమస్కారములతో కృతజ్ఞతలు ఘటించారు. అప్పట్లో పూజారిగా ఉన్నవారు పండ్రెడ్డి గారు ఎంతో భక్తిశ్రద్ధలతో పూజచేసి, ప్రసాదం ఇచ్చారు.

ఇతరులతో వైరమేర్పడినప్పుడు బగళాముఖీ అమ్మవారిని ఉపాసించినవారికి విజయం సిద్ధిస్తుంది. అభిప్రాయ భేదములు తలెత్తినవారిమధ్య మైత్రీబంధమేర్పడుతుంది. బాలగ్రహములు చుట్టుముట్టి పీడించేవారి, కాగ్రహ పీడ శాంతిస్తుంది. దుఃస్వప్నములు(పీడకలలు) సుస్వప్నములుగా మారిపోతాయి. అంగారక దోషము తొలగిపోతుంది. వివాహసంబంధములు కుదురుతాయి. ఉద్యోగ ప్రయత్నం ఫలిస్తుంది.

మా బంధువుల అబ్బాయికి ఉద్యోగం వస్తే పసుపు కుంకుమలు చీర రెవిక తెచ్చి సమర్పించు కొంటామని మ్రొక్కుకుంటే అతనికి దుబాయిలో 3లక్షల జీతంతో ఉద్యోగం వచ్చింది. మ్రొక్కు తీర్చుకొని వారు మా ఇంటికివచ్చి చెప్పారు.

ప్రస్తుతం చందోలు శాస్త్రిగారింట్లో ఉంటూ భక్తిశ్రద్ధలతో దేవీపీఠాన్ని కాపాడుతున్న బ్ర.వే. తాడేపల్లి లక్ష్మీధర సోమయాజులుగారు, సోమిదేవమ్మ, ల॥సౌ॥ రుక్మిణమ్మగారు తమవద్దకు ఎవరే సమస్యతో వచ్చి, చెప్పుకొన్నా,

వారు ముందుగా బండ్లమ్మను దర్శించి, విన్నవించుకోండని పంపిస్తారు. వెళ్ళినవారి కోరికలు తీరుతున్నాయి. ఆయురారోగ్య భోగభాగ్యములతో భక్తులు వర్ధిల్లుతున్నారు.

జనసమ్మాన్యుని, సత్తపోధనుని, సౌజన్యంబుమూర్తీభవిం
చిన లక్ష్మీధరసోమయాజిబుధునిన్ సేవింతు; సద్ధర్మవ
ర్తను, తాడేపలివంశపావనుని, విద్యాదాత, నిష్ఠాగరి
ష్ఠుని కోటీశ్వరవర్ధనమ్మసుతు, జ్యేష్ఠున్, రుక్మిణీనాథునిన్

శ్లో॥ కర్తా, కారయితా చైవ, ప్రేరక, శ్చానుమోదకః।
సుకృతం దుష్కృతంచైవ చత్వార స్సమభాగినః॥

మంచిచెడులు రెండింటిలోను ఏదైనా ఒక పని కర్తా = చేసేవాడు, కారయితా, = చేయించేవాడు. ప్రేరకశ్చ = పోత్సహించేవాడు, అనుమోదకః = ఆమోదించేవాడు, బాగుందని అభినందించేవాడు ఈనలుగురు ఆపనిలో సమానమైన ఫలితాన్ని పొందుతారు. అందుకే పెద్దలు, మంచిని చెప్తారు. మంచి చెయ్యమని ప్రోత్సహించి, చేయిస్తారు. జరిగిన మంచినిచూసి, మనసారా అభినందిస్తారు.

ధర్మాచరణ, ధర్మరక్షణ, ధర్మకార్యములను ప్రోత్సహించటం, ధర్మాత్ములు చేసిన సత్కృతులను అభినందించటం ద్వారా కలిగే ఫలితం, మనకు వెంటనే తెలియకపోయినా, చేసిన మంచి, ఏకొంచెమైనా మనకు, మన కుటుంబానికి కవచమై నిలిచి, రక్షణ కల్పిస్తుంది. గీతా చార్యుడైన కృష్ణభగవానుడీ విషయాన్నే కంఠోక్తిగా ప్రకటించాడు.

స్వల్పమప్యస్య ధర్మస్య, త్రాయతేమహతోభయాత్। (2/40 భగవద్గీత)

ఇక చెడువిషయంలో అయితే, ఆ ఫలితం వెంటనే అనుభవానికి వస్తుంది. ఉదాహరణకు, ఎక్కడో, హత్యో, అత్యాచరామో జరిగింది. అది చేసినవాడు, చేయించినవాడు, ప్రోత్సహించినవాడు, అందుకు ఆమోదం

తెలిపినవాడు, అందఱూ బాధ్యులుగా పరిగణించి న్యాయస్థానం వారికి తగిన శిక్ష విధించటం గమనిస్తున్నాం కదా.

ఇటీవల హైదరాబాద్‌లో, అనారోగ్యంతో హాస్పటల్‌లో ఉన్నవారినిచూసి, పలుకరింప వచ్చినవారిమిత్రులు, 'బగళాముఖీ అమ్మవారికి మ్రొక్కుకోండి, ఆరోగ్యం చేకూరుతుందని' చెప్పారు. వారు ఆవిధంగాచేసి, క్షేమంగా ఇంటికితిరిగి వచ్చి ఈప్రాంతంలో అదేవి ఆలయం ఎక్కడ ఉందని నెట్‌లో వెతికితే చందోలులో ఉందని కనబడిందట. వారు వచ్చి మ్రొక్కు చెల్లించుకొని వెళ్ళారు. నాకు తెలిసినవి కొన్నే, తెలియనివి ఎన్నో. పూజారిగారినడిగితే చెప్తారు. వారు ఎవరికో అమ్మ సంతానాన్ని కూడా ఇచ్చి ఇటీవల అనుగ్రహించిందని నాతో చెప్పారు. ఆశ్రయించిన వారికి ఆతల్లి అభివృద్ధినిస్తుంది. దయగల ఆతల్లి అనుగ్రహంతో పదవిలో ఉన్నవారు పదోన్నతిని పొంది, ఉచ్చస్థానాన్ని అలంకరించిన సందర్భములు అనేకం ఉన్నాయి. దురదృష్టం వలన పదవి కోల్పోయిన వారు అమ్మను ఆశ్రయించి, తిరిగి పదస్థులైనవారిని గూర్చి విన్నాను, ప్రత్యక్షంగా చూస్తున్నాను. అమ్మ శాశ్వతమైన ఆత్మవిజ్ఞానాన్ని, ప్రాపంచిక విషయములందు వైరాగ్యాన్ని ప్రసాదించి, యోగవిద్యను కూడ అందిస్తుంది. మనస్సును, బుద్ధిని ఏకాగ్రపరచి, ఇంద్రియములను అంతర్ముఖం చేయటం యోగసిద్ధి. మనకున్న జ్ఞానేంద్రియములైదు. కర్మేంద్రియములైదు. బహిర్ముఖములై యుండి, ప్రపంచోన్ముఖంగా పరుగులుతీస్తూ, నేను నాది అనే మోహాన్ని కలిగించి, భ్రమలోపడి తిరిగేటట్లు చేస్తాయి. మళ్ళీమళ్ళీ జనన మరణములు కలిగేవిధంగా సంసారచక్రంలో బంధిస్తాయి. వాటిని అధిగమింపజేసేది యోగ విజ్ఞానము. ఇప్పుడు చేసిన సాధన, మరుసటి జన్మకు కూడ ఉపకరిస్తుంది, వృథాకాదు.

పారమార్థిక శరీరము - యోగసిద్ధి :

మన కంటికి కనబడేది, సుఖజీవనానికి ఉపయోగపడేది ఈ భౌతిక శరీరం. దీన్నే స్థూల శరీరమని కూడా అంటారు. ఇది కాక మనలో సూక్ష్మ

శరీరము, కారణ శరీరమని మఱి రెండు ఉన్నాయి. సాధకుల యోగసిద్ధికి తోడ్పడేది పారమార్థిక శరీరము. ఋషులు, మునులు, యోగులు తమ సాధనల ద్వారా ఆ దైవాన్ని దర్శించి అనుభవానికి తెచ్చుకొన్నారు. అనేక దివ్య శక్తులను పొందగలిగారు లోకోపకారం కొఱకు ఆ శక్తులను వినియోగించారు. భూగోళ, ఖగోళ, సాగర రహస్యాలను కనుగొని శాస్త్రాలుగా ప్రకటించారు. గ్రహతులను, గమనించి, జ్యోతిస్ శాస్త్రాన్ని వివరించారు. శారీరక మీమాంసా శాస్త్రాన్ని తెలియజేసి జ్ఞాన, వైరాగ్య సంపదలను పెంపొందించారు. ఆయుర్వేద విద్యను అందించారు.

మునులు, పారమార్థిక శరీరంలో 8 చక్రాలు ఉన్నట్లు దర్శించారు. ఈ విషయాలు పురాణ ప్రవచనంలో విని, శ్రీయుతులు డాక్టర్ గోవిందరాజుల సీతారామయ్యగారు(గుంటూరు) బ్ర.వే.రాఘవనారాయణ శాస్త్రిగారిని వృత్తిరీత్యా, నేను రోజూ ఎన్నో శవాలను కోయవలసివస్తుంది. అందులో ఏ ఒక్క శరీరంలోనూ మీరు చెప్పిన చక్రాలు ఏ ఒక్కటీ కనబడలేదే అని ప్రశ్నించారట. అప్పుడు శాస్రిగారు, ఇవి అన్నీ "శరీరేపారమార్థికే" అన్న సూతసంహితలోని వాక్యం ఉదహరించి, వివరించారు. వివిధ సాధనల ద్వారా అయోగ సిద్ధిని పొందినవారు, బ్ర.వే. రాఘవనారాయణశాస్త్రిగారు.

పరమార్థము యొక్క భావము, పారమార్థికము అనగా మోక్ష మార్గమునకు ఉపకరించే శరీరము, యోగ శరీరమని అర్థము. అది, జీవుల వెన్నెముకలో ఉండి, కుండలినీశక్తి సంచరించేదిగా ప్రకాశిస్తుంది. యోగసాధకులకిది అనుభవైక వేద్యమై ఉంటుంది. అందువల్ల స్థూల శరీరంలో కనబడవు. కంటికి కనబడనివన్నీ లేవని నిర్ణయింపలేముకదా. గాలి ఉంది అది స్పర్శ ద్వారానే తెలుస్తుంది. కంటితో చూడలేము. గాలిలేకపోతే మన ప్రాణానికే భంగమేర్పడుతుంది. మనస్సు కనబడదు - పరుగులుతీస్తుంది, పట్టిపీడుస్తుంది.

'అమ్మవారు', స్వయంగా యోగిని, యోగానందయై ఆమె సాధకులైన భక్తులకు'(యోగదా)' యోగానుభవాన్ని ఇస్తుంది. అమ్మచే అనుగ్రహింపబడిన వారెందఱో మహానుభావులు, అందఱికి వందనములు. వారికి వివిధ కళలలో ప్రావీణ్యం సిద్ధిస్తుంది. వారు జగద్విఖ్యాతులవుతారు. వారు గీసిన గీత, బొమ్మ అవుతుంది. చెప్పిన మాటలు కవిత్వమౌతాయి. ఆలాపన సంగీతమై అలరిస్తుంది.

కుండలినీ :- యోగవిద్యలో ప్రధానమైన శక్తి, ఈ కుండలిని. తిర్యక్కుల (వెన్నెముక అడ్డంగా ఉండే) పశుపక్ష్యాదులకు ఈవిద్య అభ్యసించుటకు వీలుపడదు. వెన్ను(వీపు) నిటారుగా నిలుపగల మానవులకు మాత్రమే ఇది సాధ్యమవుతుంది.

షట్చక్రోపరి సంస్థితా :- వెన్నెముక చివరి భాగాన ఉండేది మూలాధారచక్రము, దానికి అధిపతి గణపతి. ఆయన అనుమతితో సాధకుడు ముందుకు సాగుతాడు. ఆపైన ఉండేది స్వాధిష్ఠానము, ఇది జననేంద్రియమునకు పైభాగంలో ఉంటుంది. తదుపరి మణిపూరము (నాభిస్థానము) అందుకుపైన, హృదయస్థానంలో ఉండేది అనాహతము. కంఠస్థానంలో ఉండేది, విశుద్ధచక్రము, భ్రూమధ్యంలో ఉండేది ఆజ్ఞాచక్రము. నడినెత్తిన సహస్రారము. యోగ శరీరంలో 'అమ్మ' ఇక్కడే కొలువుతీరి ఉంటుంది. ఆపైన ఉండేది గురుపాదుకలు పూర్ణదీక్షా పరులకిది అనుభవంలో ఉంటుంది.

శ్లో॥ వందే గురు పద ద్వంద్వమ్, అవాఙ్మానసగోచరమ్।
రక్త శుక్ల ప్రభామిశ్రమ్, అతర్క్యమ్, త్రిపురంమహ॥

"అష్టాచక్రా, నవద్వారా, దేవనాం, పూరయోధ్యా" అన్న శ్రుతివాక్యానికి ఈ యోగ శరీరము లక్ష్యము.

యోగులకు, అణిమ, గరిమ, మహిమ మొదలైన అష్ట సిద్ధులు (విభూతులు) కలుగుతాయి. వానిని లోకహితానికి, ధర్మరక్షణకు, ఉపయోగించి వారు దేవి అనుగ్రహానికి పాత్రులై తుదకు ముక్తులవుతారు. దుర్బుద్ధితో స్వార్థానికి,

మాత్రమే ఉపయోగించుకొనేవారు, అతల్లి ఆగ్రహానికి గురియై భ్రష్టులవుతారు. అమ్మ ఇచ్చిన శక్తులు దుర్వినియోగం చేయరాదు. బ్రహ్మాదులైన దేవతలిచ్చిన వరాలను, లోకులను పీడించటానికి ఉపయోగించిన రాక్షసులను అమ్మ విష్ణురూపంలో సంహరించటం తెలిసిన విషయమేకదా.

గీతలో, కృష్ణపరమాత్మ, అర్జునుని "యోగీభవ అర్జునా" అని కర్తవ్య నిర్వహణకు, ప్రోతహించాడు. "యోగోభవతి దుఃఖహా" యోగము మనోనిగ్రహాన్ని కలిగించి మమత్వ దోషం వలన, ఏర్పడే దుఃఖాన్ని పోగొడుతుంది. "సమత్వంయోగ ఉచ్యతే" యోగి, సుఖ, దుఃఖములకు అతీతుడై అన్నింటియందు, అందఱియందు సమదృష్టి కలవాడవుతాడు. ఈవిధంగా యోగములన కలిగే ప్రయోజనము లెన్నింటినో కృష్ణుడు వివరించాడు. అర్జునుని నిమిత్తంగా పెట్టుకొని పరమాత్మ లోకానికి హితాన్ని ఉపదేశించాడు. ఇదీ నారాయణియైన ఆ అమ్మ సంకల్పంలో భాగమే అనటం అతిశయోక్తి కాదు. హనుమంతుడు లంకచేరి అశోకవనంలో సీతను చూడగలగటం, సాధకుడు సహస్రారంలో గల చిత్కళను దర్శించటంగా వర్ణించారు. రామాయణంలో సుందరకాండమొక యోగశాస్త్రము.

మానవ శరీరంలో ఉండే 72వేల నాడులలో, వెన్నెముక యందున్న మూడునాడులు(ఇడ, పింగళ, సుషుమ్నా) చాలా ముఖ్యం. సుషుమ్ననే కుండలినీ శక్తి అంటారు. యోగ సాధకులకు ఆ శక్తి ఉద్బుద్ధమై, క్రమంగా అన్ని చక్రములను దాటి, సహస్రారానికి చేరి అమృతమును వర్షింపజేస్తుంది. సాధకులకు పరమానందాన్ని కలుగజేస్తుంది. అట్టి యోగసిద్ధుల మాట, నడవడి, చూపు సమాజానికి హితం చేకూరుస్తాయి. అమ్మ అనుగ్రహానికి పాత్రులైన ఆ మహాత్ములు లోకానికి ఆదర్శ ప్రాయులవుతారు. ఆరాధ్యులవుతారు.

బ్ర.వే. తాడేపల్లి రాఘవనారాయణశాస్త్రిగారు తపస్సుచేసి అమ్మవారిని, తన ఉగ్రస్వరూపాన్ని ఉపసంహరించుకొని, శాంతమూర్తిగా దర్శనమిమ్మని ప్రార్థించారు. అమ్మ,అనుగ్రహంతో సౌమ్యురాలై కొలువు తీరింది. అందువల్ల ఇక్కడ జంతు బలులు నిషేధింపడ్డాయి.

దేవీ వైభవం

విశ్వమంతా వ్యాపించిఉన్న చైతన్యమొక్కటే. సృష్టి స్థితి లయములకు మూల కారణ మా శక్తియే. అనంతము, అఖండము, అయిన ఆశక్తినే యోగులు, మునులు తమ ధ్యానంలో దర్శించి ఉపాసకుల, సౌకర్యం కోసం నామరూప ములతో మన ముందుంచారు – సామాన్యులకు కూడా ఆ దివ్యశక్తి అవగాహన కలిగేలాగా ప్రయత్నించారు. అటువంటి శక్తిని పురుషునిగా భావించినట్లైతే శివుడు, విష్ణువు, సూర్యుడు, గణపతి, సుబ్రహ్మణ్యుడు మొదలగు నామ రూపాలుగా వర్ణింపబడ్డారు. స్త్రీ గా గౌరవింపబడినట్లయితే ఆ జగన్మాత శ్రీమాతగా నిరూపింపబడింది. విశ్వమంతట ఆ తల్లి దివ్యశక్తుల విగ్రహాలు పెక్కు రూపములతో వివిధ ఆలయములలో సుప్రతిష్ఠితమై ఆరాధింప బడుతున్నాయి. స్త్రీకి బ్రాధాన్య మొసంగ శాక్తేయ మతము, పురుష ప్రాధ్యమున మతములు బహుళములగును, తల్లింగ భేదం బపగతమైన నఖిల సమ్మత మద్వైత మనుమతంబు శ్రీ రా.క.ఉ.భా.ఆ164ప1.తా.రా.శా.

అందులో భాగంగానే లోకంలో అష్టాదశ పీఠాలు, (18) పంచాశత్ పీఠాలుగా(50) ఆ తల్లి కొలువు తీరి భక్తుల కోరికలను తీరుస్తూ కొంగు బంగారంగా ప్రసిద్ధి చెందింది.

ప్రతి గ్రామానికి కూడా ఒక దేవత ఉండి, ఊరివారిని పిల్లాపాపలతో, పాడిపంటలతో విలసిల్లే విధంగా ఆమె కాపాడుతుండడం మనం చూస్తున్నాం. గ్రామములోని ప్రజలు విశ్వాసంతో భక్తిభావంతో మ్రొక్కులు తీర్చుకొని, జాతరలు, కొలుపులు, ఉత్సవాలు జరుపటం ఆనవాయితీగా వస్తున్న అలవాటు. ఈ పూజలు దేశమంతటా శక్తి ఆరాధనకు నిదర్శనముగా కీర్తింపబడుతున్నాయి.

ఆ తల్లినే యోగులు, దశవిధ మహావిద్యలుగా దర్శించి, కొలిచి, సిద్ధులను పొందారు. అందులో ఒక అంశం "బగళాముఖిగా" ప్రసిద్ధి కెక్కింది.

పూర్వం ధనదవోలు, ధనదపురముగా వర్ణింపబడిన చందోలు, చోళచక్రవర్తుల రాజధానిగా చరిత్ర నిరూపిస్తోంది. కుళోత్తుంగ చోళుని పరిపాలన సమయములో అమ్మవారు అపూర్వమైన వైభవాన్ని కలిగిఉందని తెలుస్తోంది. ఈ మధ్యనే వెలుగుచూపిన అమ్మవారి మేలిమి బంగారు నగల పెట్టె ఉదంతం అందుకు ప్రబల సాక్ష్యం. ఆనాటి నుండి ఎందరో రాజులు కానుకలు సమర్పించి అమ్మసేవలో తమ జీవితములను పునీతం చేసుకున్నారు. అందరికి అందుబాటులో ఉండేది అమ్మ. ఎవరు పిలిచినా 'ఓయ్' అని పలికేది అమ్మ. కాలం మారింది, చరిత్ర కనుమరుగైపోయింది 'ధనదపురము''చందవోలు' పట్టణంగా ఇప్పుడు చందోలు గ్రామంగా మిగిలిపోయింది. బగళాముఖి అమ్మవారు బండ్లమ్మవారుగా కొలువబడుతోంది. అయినా, ఆ చల్లని తల్లి భక్తులపాలిటి కొంగుబంగారమై ఆర్తులను రక్షిస్తోంది. ఆ శ్రీతులకు కోరిన వరములను ప్రసాదిస్తోంది.

అమ్మను దర్శించి, కోరికలు విన్నవించుకొని, అవి సిద్ధింపగానే మ్రొక్కులను తీర్చుకునేందుకు చుట్టుప్రక్కల గ్రామాల వారే కాకుండా, దూరప్రాంతాల నుండి కూడా భక్తులు రావటం విశేషం. వేదములను వేదాంతములను వివరించడానికి వ్యాస భగవానుడు వ్రాసిన అష్టాదశ పురాణములలో బ్రహ్మాండ పురాణమొకటి. అందులో దేవి, భండాసురుడు, శుంభనిశుంభులు, రక్తబీజుడు, మహిషాసురుడు మొదలైన దుష్టరాక్షసులను సంహరించిన విధము వర్ణింపబడింది. ఆ సమయంలో దేవతలు అమ్మను స్తుతించిన విధము ఆమె మాహాత్మ్యమును వివరించుచు, పాఠకులకు భక్తిభావమును ఇనుమడింపజేస్తోంది. మార్కండేయ పురాణములో వర్ణింపబడిన దేవీ 'సప్తశతి' (700 శ్లో॥) నిత్యపారాయణ గ్రంథముగా సకల సిద్ధులను ప్రసాదించి, కార్యసాధనకు ఉపకరిస్తోంది. దేవేంద్రాదులచేత కూడా ఆ "దేవీవైభవము" సుంస్తుతింపబడింది. ముల్లోకములకు మూలమైన ఆ ఆదిపరాశక్తినే,

భక్తులు తమ కోరికననుసరించి వివిధ రూపాలతో తలచి, కొలచి ఫలితములను పొందిన సంగతి తెలిసిందే. విద్యాభివృద్ధిని కోరుతూ అక్షరాభ్యాసంనాడు ఆ శక్తిని సరస్వతిగా ఆరాధిస్తాం. శ్వేత వర్ణము (తెలుపు) జ్ఞానానికి ప్రతీకముగా భావించి సేవిస్తాం–(సర్వశుక్లా సరస్వతీ)

॥శో॥ సరస్వతీ నమస్తుభ్యం, వరదే కామరూపిణీ।
విద్యారంభం కరిష్యామి, సిద్ధిర్భవతుమే సదా॥

సంపద సృష్టింపవలసినదిగా కోరుతూ వపడపు (ఎరుపు) వర్ణంలో ఆమెనే లక్ష్మిగా ఆరాధిస్తాం – శత్రువిజయాన్ని కోరుతూ దుర్గగా–సిద్ధికై నల్లని కాళీస్వరూపంగా పూజిస్తాం. ఎవరే రూపంతో ఏ నామంతో కొలిచినా కోరికలను తీర్చేతల్లి ఆ శ్రీమాత.

శ్లో॥ విద్యాప్రదాన సమయే
శరిదిందు శుభ్రాం,
లక్ష్మీ ప్రదాన సమయే
నవవిద్రుమాభాం,
విద్వేషివర్గ హననేచ
తమాలనీలాం,
దేవీం, త్రిలోక జననీం
శరణం ప్రపద్యే॥

ఈ విధంగా మహాకాళీ, మహాలక్ష్మీ, మహాసరస్వతీగా అర్చనలందుకొనే ఆ దివ్యశక్తిని "లలితాంబిక"గా సేవించడం బ్రహ్మాండ పురాణములో చెప్పబడింది. అన్ని పాదములు ఏనుగు పాదములో ఇమిడిపోయినట్లు, ప్రసిద్ధమైన అన్ని సహస్రనామాలు మిక్కిలి ప్రసిద్ధి చెందిన శ్రీ లలితాసహస్రనామములలో సంగతములై పోయాయి – లోకంలో ఏ క్షేత్రములో, ఏ అమ్మవారి పూజ చేసినా లలితా సహస్రనామాలతోనే అర్చన చేస్తారు.

ప్రస్తుతం చందోలు బండ్లమ్మవారి దేవాలయానికి కార్యనిర్వహణాధికారిగా ఉన్న బ్ర.వే.ఘంటసాల నరసింహమూర్తి గారు ఆలయ కమిటీ సభ్యులు, మరికొంతమంది భక్తుల సహకారంతో నవరాత్రి ఉత్సవసమయంలో 108 లలితానామాలతో కాసులపేరు చేయించి అమ్మవారికి సమర్పించాలని సంకల్పించారు. దేవిని చక్కగా అలంకరింపజేస్తున్నారు. గత వైభవాన్ని గుర్తు చేస్తున్నారు. అమ్మదయ ఉంటే అన్నీ సిద్ధిస్తాయి. ఆ నామములు అనుబంధంలో చేర్చబడ్డాయి.

పెద్దలు లలితా సహస్రనామములను, మాలామంత్రముగా అభివర్ణించారు. సర్వవిద్యల సారమునకు నిధిగా ప్రసిద్ధి చెందిన ఈ సహస్ర నామములతో దేవీ స్వరూపమైన శ్రీ చక్రమును (యంత్రము) అర్చిస్తే, అభీష్టములు నెరవేరుతాయి. శాంతిసౌఖ్యములు వర్ధిల్లుతాయి-స్వతంత్రమైన తంత్రము, మహామంత్రము అయినది, లలితాదివ్య సహస్రనామము.

చండీపారాయణ

అమ్మవారు, కాల స్వరూపిణి. క్షణక్షణము మారుతున్న కాలచక్రమును నడిపేది అమ్మే. ఇప్పుడు మనం లెక్కిస్తున్న నిమిషాలు, గంటలు మొదలైన కాలవాచకపదముల స్థానంలో పూర్వం కలా,కాష్ఠా అనే పదములు వాడేవారు. ఘడియలు, విఘడియలు, ఝాము అన్న పదములు పంచాంగములో ఇప్పటికీ చూస్తూనే ఉంటాం-ఈ విధంగా ఒక క్రమంలో కాలాన్ని నడిపించేది అమ్మే. ఈమెనే దుర్గగా కూడా కీర్తించారు. కృష్ణావతారంలో నందుని ఇంట పుట్టింది ఈ శక్తియే. ఆ నారాయణుని సోదరిగా పుట్టింది కనుక ఈమె నారాయణీ అని కూడా చెప్పబడుతోంది.

॥శ్లో॥ కలా, కాష్ఠాది రూపేణ పరిణామ ప్రదాయినీ ।
విశ్వస్యోరతౌ శక్తే నారాయణి నమో స్తుతే ॥

అని అమ్మను చండీసప్తశతిలో కీర్తించాడు వ్యాసుడు. ఆ మార్పు కష్టాలకడలి నుండి భక్తులను బయట పడేసేది. బిడ్డలను ఒడిలో చేర్చుకొని సేదతీర్చేది అమ్మే. ఈ శ్లోకాన్ని నిత్యం భక్తితో పఠిస్తే జీవితం చక్కని మార్పును పొంది, అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పెద్దలు చెప్పారు.

అమ్మవారి మహిమలను తెలియజేసేది దేవీ సప్తశతి గ్రంథం. ఇందులో 700 శ్లోకాలు ఉన్నాయి. ప్రతి శ్లోకము ఒక మంత్రమే. ఆపదల్లో ఉన్న దేవతలకు అభయాన్ని ప్రసాదించి, దుష్టరాక్షస బాధలను తొలగించిన ఆ జగజ్జనని వైభవం ఇందులో కీర్తింపబడింది. అన్ని రూపములు ఆమె విశ్వరూపమునే సూచిస్తాయి. ప్రత్యేకించి దుర్గముడనే రాక్షసుని సంహరించింది. కావున ఆ తల్లి "దుర్గ"గా కీర్తింపబడింది. ఆమె భయత్రాత, అభయప్రదాత.

దుర్గే స్మృతాహరసిభీతిమశేషజంతోః
స్వస్థై స్మృతా మతిమతీవశుభాందదాసి
దారిద్ర్యదుఃఖ భయహారిణికాత్వదన్యా
సర్వోపకార కరణాయ సదార్ద్రచిత్తా!

ఎటువంటి ఆపదలో ఉన్నా 'దుర్గా' అనే నామాన్ని భక్తితో స్మరిస్తే భయములు తొలగిపోతాయి. సమస్త శుభములు కలుగుతాయి. దారిద్ర్య దు:ఖం దూర మౌతుంది. ఎవరికి ఏది లేకపోతే అది వారికి దారిద్ర్యమౌతుంది అని వింటూవుంటాం. లోకంలో సకలచరాచర సృష్టికి తల్లియైన అమె కరుణ అందఱియందు సమానంగా ప్రవర్తిస్తుంది. 'ఆ బ్రహ్మకీటజననీ' అంటే చీమ, దోమదగ్గర నుండి బ్రహ్మదాక ఉన్న సృష్టికే ఆమె తల్లి అని అర్థం. ఎల్లరకు తల్లి కనుకనే ఆమెను కొన్ని ప్రాంతములలో, కొందరు 'ఎల్లారమ్మ' అని పిలుస్తారు. పోతన ఆంధ్ర మహాభాగవతంలో అమ్మను 'చాల పెద్దమ్మ' అనిఅంటంలో పై అర్థమే బోధపడుతుంది. కవిత్వ, పటుత్వ, మహత్వ సంపదలనుఇచ్చే ఆ తల్లి ముగ్గురమ్మల మూలపుటమ్మగా కీర్తింపబడింది. ఐంక్లీంహ్రీంశ్రీం అనే బీజాక్షరాలు అందులో ఒదిగి ఉన్నాయి.

ఉ॥ అమ్మలగన్నయమ్మ, ముగ్గురమ్మల మూలపుటమ్మ, చాలపె
ద్దమ్మ, సురారులమ్మకడుపారడిపుచ్చినయమ్మ, తన్ను లో
నమ్మిన వేల్పుటమ్మలమనమ్ముల నుండెడియమ్మ, దుర్గ, మా
యమ్మ, కృపాబ్ధినిచ్చుత మహత్వ, కవిత్వ, పటుత్వ సంపదల్

ఏకంసత్, విప్రాబహుధా విదన్తి / వదన్తి :-

ఉన్న ఒకే శక్తిని పండితులు అనేక విధాలుగా తెలుసుకొంటున్నారు. అదే విషయాన్ని ఇతరులకు తెలియజేస్తున్నారు. ఎవరేరూపములో తలచి, కొలచినా ఆ సర్వేశ్వరికే చెందుతుంది.

శ్లో॥ సర్వ స్వరూపే సర్వేశే సర్వశక్తి సమన్వితే ।
భయేభ్య:త్రాహినోదేవి, దుర్గేదేవి నమోఽస్తుతే ॥

అన్ని రూపులు, తన రూపమైన ఆ జగజ్జనని, భయములను తొలగించి భక్తులను కాపాడుతుంది. లోకంలో జీవులకు అన్నీ భయములే. ప్రాణభయం, రోగభయం, మృత్యుభయం, స్థానభయం, దారిద్ర్యభయం, శత్రుభయం, నీటిభయం, నిప్పుభయం, జంతు భయం, ప్రకృతి వైపరిత్యాలవల్ల కలిగే భయం, చోరభయం, ఈ విధమైన అన్ని భయాలనుండి కాపాడి, మన ఉనికిని, ఉసురును రక్షించేది తల్లి. ఆమెకు కృతజ్ఞతాపూర్వక నమస్కారములు.

విశ్వవ్యాప్తమైన చైతన్యాన్ని (శ్రీమాత) తల్లిగా భావించి,సేవించటంలో ఒక సౌలభ్యం ఉంది. గృహవాతావరణంలో కూడా పిల్లలకు తల్లిదగ్గరున్న చనువు తండ్రి దగ్గర ఉండదు. పిల్లలు తల్లిద్వారా తమ ఇష్టాలను, అనిష్టాలను తెలియజేస్తూ, తమ అభీష్టములను సాధించుకోవటం గమనిస్తాం. అవ్యాజ కరుణామూర్తియైన అమ్మ, వారి విశ్వాసాలను వమ్ముకానీయకుండా వారికి కావలసినవి విభునికి చెప్పి సమకూర్చి పెడుతుంది. ఇదే పద్ధతి ఆధ్యాత్మిక ప్రపంచంలో కూడా గోచరిస్తుంది. బిడ్డలకు భాషరాక, సరిగా అడుగలేకపోయినా 'భావజ్ఞ' అయినతల్లి వారి అవసరాలను గుర్తించి తీరుస్తుంది.

బీజాక్షరములతో నిష్ఠగా ఉపాసన చేయలేని భక్తులకు, వారి భావం తెలుసుకొని దోషములంటనీయక, కంటికిరెప్పలాగ తల్లి కాపాడుతుంది. శివజ్ఞానాన్ని, మంచి (ఆలోచనలను) కలిగిస్తుంది. దేవీ భాగవతంలో అందరూ చేసుకోదగిన మంత్రపూతమైన ప్రార్థన ఇలా చెప్పబడి ఉంది. "పరాత్పరియైన ఆ చైతన్య శక్తి శ్రీవిద్య, మా బుద్ధి శక్తులను వికసింప చేయవలసిది" అని దాని అర్థము.

ఓం సర్వచైతన్యరూపాం తాం
ఆద్యాం, విద్యాంచ, ధీమహి। బుద్ధింయానః ప్రచోదయాత్!

బుద్ధి వికసించిన వారు, సక్రమమైన మార్గములో ప్రవర్తిస్తారు. సమాజంలో విజ్ఞానం వెల్లివిరుస్తుంది. అప్పుడు ధర్మాచరణ సాధ్యపడుతుంది.

శరణాగతదీనార్త పరిత్రాణపరాయణే ।
సర్వసానర్తి హరే దేవి, నారాయణి నమో ఽస్తుతే॥

ఆ తల్లి ఆర్తులై తనను శరణు వేడిన వారిని కాపాడుటయే పనిగా పెట్టుకొని ప్రవర్తిస్తుంది. తన సృష్టిధర్మానికి భంగంకలిగించే దుర్జనులను దండించి, సాధువులను, సజ్జనులను రక్షిస్తుంది. శుభములకు మూలమైన ఆ మంగళ స్వరూపిణి సకలకార్యసిద్ధిని ప్రసాదిస్తుంది.

సర్వమంగళ మాంగల్యే, శివే, సర్వార్థసాధికే ।
శరణ్యే, త్ర్యయంబకే గౌరీ, నారాయణి నమోఽస్తుతే ॥

మూడులోకములకు అధీశ్వరియైన ఆమెను తలిస్తే రోగములు నశిస్తాయి. కోరికలు నెరవేరుతాయి. అమ్మ భక్తులు, తాము ఉద్ధరింపబడటయే కాదు, ఇతరులకు కూడా ఆశ్రయాన్ని, రక్షణను ఇవ్వకలుగుతారు.

లోకంలో ప్రజలు ఏదైనా చెయ్యాలంటే శక్తికావాలి. ఆ శక్తి మూడు విధాలు. (ఇచ్ఛా) (1) (సంకల్ప) శక్తి-సాధించాలనే కోరిక, 2) జ్ఞానశక్తి-ఎలాసాధించాలనే జ్ఞానం, 3) క్రియాశక్తి-సామర్థంతో కార్యనిర్వహణ చేయగల దక్షత. తనలోని ఈ సర్వశక్తులు, ప్రసాదించే తల్లి "సర్వశక్తిమయి"గా ప్రసిద్ధిచెందింది.

బగళాదీక్ష

భవానీదీక్షలాగా, బగళాదీక్ష కూడా భక్తులను శక్తిమంతులను చేస్తుంది. కార్యసాధనకు దోహదం చేస్తుంది. నియమితమైన పద్ధతితో, జీవితాన్ని గడుపుతూ, అమ్మను వేడుకొని, ఆమె అనుగ్రహాన్ని పొందటానికి చేసే ప్రయత్నమే దీక్ష. తదేకబుద్ధితో, దురలవాటులకు దూరంగా ఉండి, మంచిమార్గాన్ని అలవరచుకొంటూ ఇతరులకు ఆదర్శంగా మెలగటం ద్వారా సమాజంలో గౌరవం లభిస్తుంది. నిత్యం సుఖాభిలాషతో పరుగుతీసే చంచలమైన మనస్సును జయించి, సదాచారమును పాటించటం వల్ల, మనలోని దివ్యశక్తులు ప్రకటిత మౌతాయి. దేవియొక్క పరిపూర్ణానుగ్రహం లభిస్తుంది. అనుకొన్నది జరుగుతుంది. తామన్న మాట సమాజంలో నెగ్గుతుంది.

దీక్షా నియమాలు :-

బగళాముఖీ దీక్షను తీసుకొనేవారు పచ్చని వస్త్రాలను ధరించాలి. పచ్చటి పూసల మాలతోకాని, (పసుపుకొమ్ముతో చేసిన మాలతోకాని) జపంచెయ్యాలి. జపం చేసేందుకు ఉపయోగించే మాలను మెడలో ధరింపరాదు. పవిత్రమైన స్థలంలో భద్రపరచాలి. కావాలంటే వేరేమాల మెడలో ధరించాలి. దేవి పరిపూర్ణానుగ్రహం పొందటానికి భక్తులు కొన్ని కఠోరమైన నియమాలు పాటించాలి. ఏ దేవతైనా దీక్షానియమాలు ఒక్కటే.

1) దీక్ష ఒక మండల కాలం, అంటే (40 రోజులు) పాటించాలి. వీలుకాని వారు కనీసం
2) అర్థమండల కాలమైనా (20రోజులు) దీక్ష కొనసాగించాలి అప్పుడే సాధకులకు దీక్ష సమగ్రమవుతుంది. మనస్సులో భక్తిభావం ఏర్పడుతుంది. అమ్మ అనుగ్రహం కలుగుతుంది.
3) భక్తులు తెల్లవారు ఝామునే నిద్రలేవాలి. (4 - 5 గంటల మధ్యలో)
4) దగ్గఱలో నది ఉంటే, నదీస్నానం చెయ్యటం ఉత్తమం.

5) అవకాశంలేనప్పుడు బావిదగ్గఱో, బోరుపంపు నీటితోనో తలస్నానం చెయ్యాలి.

6) ప్రతిరోజూ రెండుపూటలా (ఉదయం, సాయంత్రం) అమ్మకు పూజచేసి నివేదన చేస్తేకాని ఆహారం స్వీకరింపరాదు. దగ్గఱలో ఆలయానికి వెళ్ళి దైవాన్ని దర్శించుకోవాలి.

7) పాదరక్షలు ధరింపరాదు.

8) బ్రహ్మచర్య వ్రతం పాటిస్తూ, నేలమీదనే నిద్రించాలి.

9) స్త్రీలందఱిని అమ్మవారి ప్రతిరూపంగా భావిస్తూ, దీక్ష కొనసాగించాలి. చెడు భావనలు మనసులోకి రానీయరాదు.

10) అమంగళకరమైన విషయాలకు దూరంగా ఉండాలి. శవాన్ని ముట్టుకోవటం, శ్మశానానికి వెళ్ళటం చేయరాదు.

11) సనాతన సంప్రదాయమైన పద్ధతిలో జీవనం గడుపుతూ, బహిష్మదోషాన్ని పరిహరించాలి. వారిని చూడటం, వారితో మాట్లాడటం, దీక్షితులకు పనికిరాదు. ఒకవేళ తెలియక అటువంటిది జరిగితే తలస్నానం చేసి, అమ్మవారి నామాల్ని స్మరించుకోవాలి.

12) దీక్షాసమయంలో తలపని చేయించుకోవటం, గడ్డం తీయించుకోవటం చేయరాదు. గోళ్ళు కత్తిరించుకోరాదు.

13) భక్తులు, దీక్షాకాలంలో నుదుట విభూతి, కుంకుమ ధరించాలి.

14) దీక్షలోఉండగా, అబద్ధాలాడటం, అతిప్రసంగం చెయ్యడం, కోపంతో చిరాకు పడటంకూడదు. (తనకోపమే తనశత్రువు).

15) భక్తులు, దీక్షలోఉండగా, ధూమపానంచెయ్యడం, మద్యం సేవించడం నేరం. అపరాధం చేసినవారికి దీక్షాఫలితాలు రావు.

16) గురువుద్వారా దీక్షతీసుకొని, ఈ నియమాలు పాటించినవారు, అమ్మవారి విశేష కృపకు పాత్రులవుతారు.

బగళాముఖీ అమ్మవారు, ఇంద్రియ నిగ్రహాన్ని, శత్రువిజయాన్ని, అభీష్టసిద్ధిని సకల సంపదలను, ఆయురారోగ్యములను ప్రసాదిస్తుంది.

చలత్కనక కుండలోల్లసితచారుగండస్థలాం
లసత్కనక చంపక ద్యుతిమ దిందుబింబానామ్ ।
గదాహతవిపక్షకాం, కలితలోల జిహ్వాంచలాం
స్మరామి బగళాముఖీం విముఖ, వాఙ్మనస్తంభినీమ్ ॥

విద్యా లక్ష్మీ స్సర్వ సౌభాగ్యమాయుః
పుత్రైః పౌత్రైః సర్వసామ్రాజ్య సిద్ధిః ।
మానం భోగో వన్య మారోగ్య సౌఖ్యం
ప్రాప్తం తత్తద్భూతలే స్మిన్నరేణ ॥

స్వయంభూ' అయిన బగళాముఖీ అమ్మవారు, ఆనాడు భక్తులకు లభించిన కందకంలో జల సమృద్ధిని గమనించి, అక్కడ ఒక జలాశయాన్ని ఏర్పరచారు. కాలక్రమములో అది పూడిపోతే భక్తులు,ఆలయ కమిటీ సభ్యులు, ధర్మకర్తలు, ప్రభుత్వ అధికారులు చాలా ప్రయత్నం చేసి, వ్యవప్రయాసలకోర్చి, పూర్వం జలాశయమున్న చోట ఇప్పుడు బావి త్రవ్వించి ఆ నీటితో నిత్యం దేవికి అభిషేకాదులు నిర్వహిస్తున్నారు. కె. మోహనరావుగారు ఇ.ఓ.గా ఉండగా బావి ప్రారంభోత్సవ సమయములో భక్తులు విశేషంగా పాల్గొని, తీర్థప్రసాదములతో పాటు, అమ్మ అనుగ్రహానికి పాత్రులయ్యారు. "త్వణ, కాష్ఠ, జలసమృద్ధి" జనజీవనానికి అవసరంగా గుర్తించారు పెద్దలు. అట్టిచోట మాత్రమే నివశించమని ఉపదేశించారు.

విశ్వమంతా అర్ధనారీశ్వరతత్వమై ఉన్నది :

శివశాక్త్యాత్మకమైన ఈ జగత్తు అమ్మసృష్టి. ఇందులో భాగంగానే ఆలయములలో పరమేశ్వరీ, పరమేశ్వరులు కలసి ఉండటం చూస్తున్నాం. అమ్మవారులేని శివుడు కాని, శివుడు లేని అమ్మవారు కానీ ఉండటం మనం ఊహించలేము. చంద్రునికి వెన్నెలకు ఉన్న నిత్య సంబంధమే వారి అనుబంధం.

శ్లో॥ నశివేన వినాదేవి, దేవ్యాచ న వినాశివ:

ఉభయోరంతరంనాస్తి, చంద్రచంద్రికయో రివ ॥

అని భాష్యంలో శంకరులు ఈ విషయం వివరించారు. గుళ్ళోని, సున్నము జేగురు అందుకు ప్రతీక

చందోలులో వెలసిన బగళాముఖీ అమ్మవారి, కుడి భుజంమీద శివలింగం తీర్చిదిద్దబడి ఉండటం విశేషం - విశేష ఫలదాయకం.

మన ఇళ్ళల్లో కూడా కేవలం శివుడి పటాలుకాని, కేవలం అమ్మవారి పటాలుకాని పెట్టుకొని పూజింపరాదు. వారు అదిదంపతులు. అవిభాజ్యులు. రుక్మిణీదేవి వివాహసమయములో ఊరివెలుపల ఉన్న శివాలయానికి వచ్చి దేవిని ప్రార్థించి, ఆమె శ్రీకృష్ణుని భర్తగా పొందిందని భాగవతం చెప్తోంది.

నమ్మితి నామంబున సనాతనులైన ఉమామహేశులన్
మిమ్ము,పురాణదంపతుల, మేలుభజింతుగదమ్మ, మేటి పె
ద్దమ్మ, దయాంబురాశివి గదమ్మ, హరింబతిసేయుమమ్మ, ని
న్నమ్మిన వారి కెన్నడును నాశములేదు గదమ్మ శాంకరీ ॥

అందువలనే వివాహ సమయంలో వధువు, ముందుగా గౌరీపూజ చేస్తుంది. శ్రీమాత, పర్వత రాజకుమార్తె పార్వతిగా పుట్టి శివానుగ్రహం కొరకు ఎండలో, వానలో, గాలిలో, నీటిలో, పంచాగ్ని మధ్యంలో ఉండి తపస్సు చేయటం వలన ఆమె మేనిఛాయ గౌరవర్ణములోనికి మారిందని, ఆమెను గౌరీ అన్నారు. ఆవిధంగా శివుని తనపతిగా చేసుకొని విశ్వమాతగా పూజలందుకొంటోంది. ఆతలి ఈశ్వరాను గ్రహానికి కఠోరమైన తపస్సే సాధనమని నిరూపించింది.

వివాహానికి ముందు వధువు గౌరీపూజ చేయటం ద్వారా తన పతికూడా అంతటివాడు కావాలనే ఆకాంక్షతో, బాటు తనకు దీర్ఘసుమంగళీత్వము, ఉభయులకు ఆయురారోగ్య భాగ్యములు కోరబడుతున్నాయి.

విశ్వచైతన్యము భగవచ్ఛక్తిగా ఆరాధింపబడుతోంది. ఆచైతన్యము జాగ్రత్ స్వప్న, సుషుప్తి అవస్థలన్నింటిలోను అనుస్యూతంగా(ఎడతెగక) నిరంతరాయంగా

ఉంటుంది. అదే అమ్మనామాలలో ఒకటియైన జాగ్రస్వప్న సుషుప్తీనాం సాక్షీభూత్యైనమః అని చెప్పబడుతోంది. సామాన్య జీవులందరికి అనుభవములో ఉన్న ఆ(ఎరుక) జ్ఞానము ఆ భగవతి (తల్లి) వైభవాన్ని నిరూపిస్తుంది. ఆ చైతన్యమున్నంతవరకు శరీరం శివం, అది తొలగిపోయిన తరువాత అది శవం. ఫలానవారు ఫలాన దేశంలో పుట్టారు ఫలాన కాలంలో జీవించారు అని లోకంలో చరిత్ర నిరూపిస్తుంది. ఆదిశక్తి అయిన ఆ జనని, విభునితో కలసి ఈ సృష్టికి ముందున్నది. అందువలనే వారు జగత్తుకే తల్లిదండ్రులయ్యారు. కాళిదాసు, వాగర్థములవలె విభజించుటకు వీలులేని ఆ పార్వతీ పరమేశ్వరులను కావ్యరచనకు ముందుగా వాగర్థసిద్ధికై నమస్కరించాడు. "జగతఃపితరౌ వందే పార్వతీ పరమేశ్వరౌ". ఈ సృష్టి ఉపసంహరించి, ఆనంద తాండవం చేస్తున్న ఆ శివునికి సాక్షిగా నిలిచినది ఆ జగన్మాతయే అని **లలితాసహస్ర నామము** తెలియజేస్తుంది. "మహేశ్వర మహాకల్ప, మహాతాండవ సాక్షిణి" సృష్టికి ముందున్నదివారు. ఆ తర్వాత ఉండేది వారు. అందువల్ల వారు చరిత్రకందని దివ్యశక్తులుగా కొలువబడుచున్నారు. లోకవ్యవహారం కొరకు ఇరువురుగా చెప్పబడుచున్నా నిజానికి వారొక్కరే. పెద్దముత్తైదువఅని శ్రీనాథుడు కాశీఖండంలో చెప్పటం, అమ్మలగన్న అమ్మ పద్యంలో "చాలపెద్దమ్మ" అనే విశేషణం, "ఆ బ్రహ్మకీటజనని"అన్న దేవి నామాన్ని నిరూపిస్తోంది. లోకంలో ఏ తల్లికైనా పది పదిహేనుమంది పిల్లలుంటారు. కానీ ఆ జగజ్జననికి బ్రహ్మ నుండి, దోమదాకగల జీవకోటి అంతా సంతానమే. అందఱియందు ఆమెకు(అమ్మకు) ప్రేమ సమానమే.

ఏకమేవా ఽద్వితీయం బ్రహ్మ :-

త్రిగుణాత్మకమైన సృష్టి, స్థితి, లయములు చేసేందుకు తల్లి త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులుగా రూపాంతరము చెంది కర్తవ్యం సమర్థవంతంగా నిర్వహిస్తుంది.

సృష్టికర్త్రీ బ్రహ్మరూపా, గోప్త్రీ, గోవిందరూపిణీ, సంహారిణీ రుద్రరూపా, అంతకంటే అతీతంగా తిరోధానము అను గ్రహము అను రెండు పనులు చేసి

పంచకృత్యపరాయణగ కీర్తింపబడుతోంది. అమ్మయే చేయగలిగినవి తిరోధానము-అనుగ్రహము-అప్పుడామె ఈశ్వరిగాను, సదాశివరూపంతోను గోచరిస్తుంది. ఇవి అన్నియు, ఆ పరబ్రహ్మ రూపాంతరములే.

ఆనంద స్వరూపిణి అమ్మ-ఆనందమే బ్రహ్మ. అందువల్ల అమ్మ, పరబ్రహ్మయే అవుతుంది.

బగళాముఖీ, అమ్మవారు శ్రీవిద్య అయిన లలితాపరాభట్టారిక యొక్క అంశరూపము. దుష్టనిగ్రహము కొరకు శ్రీమాత నుండి ఉద్భవించిన దశవిధ శక్తులు, దశమహావిద్యలుగా ప్రసిద్ధి చెందాయి. అందు బగళాముఖీ స్తంభనశక్తికి ప్రతీకగా పరిగణింపబడింది. ప్రధానంగా ఇది శత్రుస్తంభనవిద్య. శత్రువులంటే అధర్మపరులై లోకద్రోహులైన బాహ్యశత్రువులనే కాదు, అంతశ్శత్రువులను కూడా స్తంభింపచేసేది. అన్నివిఘ్నములను స్తంభింపజేస్తుంది. సభలలో ప్రతివాది వాక్కులను స్తంభింపజేసే శక్తిని ప్రసాదిస్తుంది. సాధకుడికి ప్రాణవాయుస్తంభన నిపుణతను సిద్ధింపజేసి యోగవిద్యను, ఆత్మవిద్యను అనుగ్రహించటంలో కూడా సమర్థమైఉంది. లోకంలో ప్రబలిన మసూచి రోగాన్ని తగ్గించి, బాధితులకు ఉపశమనాన్ని కలిగిస్తుంది. చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు బండ్లుకట్టుకొని వచ్చి అమ్మకు మ్రొక్కులు చెల్లించుకొని, పొంగళ్ళు నివేదిస్తారు. అందువల్ల కూడా బండ్లమ్మని పేరు వచ్చింది. పలుకలేనివారు బళ్ళమ్మని కూడా అంటారు. ఉత్తర భారతదేశంలో శ్రీబగళాముఖీ అమ్మవారు విశేషమైన ప్రచారంలో ఉంది. దక్షణాది రాష్ట్రాలలో అమ్మవారు లలితా, బాల, రాజరాజేశ్వరి, కామాక్షి, మీనాక్షి మొదలైన పేర్లతో ప్రసిద్ధమై భక్తజనుల సేవలందుకొంటోంది. వారి కోరిక లీడేరుస్తోంది.

పై శ్లో॥ వాదీమూకతి, కంకతి క్షితిపతిర్వైశ్వానరశ్శీతతి
క్రోధీశామ్యతి, దుర్జనస్సుజనతి క్షిప్రానుగఃఖంజతి।
గర్వీఖర్వతి, సర్వవిచ్చ జడతి, త్వద్యంత్రణాయంత్రితః
శ్రీనిత్యే, బగళాముఖీ! ప్రతిదినం కళ్యాణి తుభ్యంనమః ॥

బగళాముఖీ అమ్మవారి దయ ఉంటే, వాద సభలలో అడ్డగోలుగా వాదించేవారిని మూగవాణ్ణిచేస్తుంది, రాజును పేదవాణ్ణి చేస్తుంది. అగ్నిని చల్లపరుస్తుంది.క్రోధము గల వారిని శాంతపరుస్తుంది. దుర్జనులను సజ్జనులుగా చేస్తుంది. అతివేగంగల వాడిని, నిదానస్థుణ్ణి చేస్తుంది. గర్వపడేవారి గర్వాన్ని తగ్గిస్తుంది. సర్వజ్ఞుడనని విఱ్ఱవీగేవారిని జడులనుగా– (ఏమి తెలియని వానిగా) మారుస్తుంది. ఓ అమ్మా! అట్టి కళ్యాణివైన నీకు నిత్యము నమస్కరిస్తున్నాను.

పంచకృత్యపరాయణా : ఆ జగన్మాత, మహిమ, లద్భుతములు . శివశక్త్యాత్మకమైన బ్రహ్మముగాఉన్నతాను, లీలగా ఈ విశ్వమును సృజించి వినోదింప తలంచింది. సృష్టి చేయటానికి బ్రహ్మగా, పోషించి, రక్షించటానికి విష్ణువుగా సంహరించటానికి (తిరిగి తనలో లీనం చేసుకోవటానికి) రుద్రుడుగా తన శక్తినే అవతరింపజేసింది. ఈ పరిణామ క్రమాన్ని లలితా సహస్రనామాలలో "సృష్టికర్త్రీ బ్రహ్మరూపా, గోప్త్రీ, గోవింద రూపిణీ, సంహారిణీరుద్ర రూపా" అని వ్యాస మహర్షి వివరించారు. ఆ రూపంలో ఆశక్తి, ఆపని చేయటానికి తగిన సామర్థ్యాన్నిచ్చి అందుకు నియోగించింది. ఆపైతాను (ఈశ్వరి) తిరోధాన అనుగ్రహములను నిర్వహించటానికి సదాశివరూపిణియై ప్రకాశిస్తోంది. తిరోధానమంటే మాయాస్వరూపంతో మఱుగుపరచి కనులముందున్న దానిని కూడా గుర్తించలేని భ్రాంతిని కలిగించటం. ఉదాహరణకు : శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతకథలో సాధువు కుమార్తె కళావతి, నది ఒడ్డున పడవతో సహా ఉన్న భర్తను చూడలేకపోవడం, స్వామి అనుగ్రహంతో ప్రసాదం తీసుకొని వచ్చినంతనే కనబడి, ఆనందాన్నివ్వటం వంటివి గ్రహించాలి.

బ్రహ్మాదులు కూడా తమ బాధ్యతలు నిర్వర్తింపగలరే కాని ఆజగజ్జనని సమగ్ర శక్తిని తెలుసుకొనలేరు. ఈ విషయం వ్యాసుల వారు "బ్రహ్మోపేంద్ర మహేంద్రాది దేవ సంస్తుత వైభవా" "దేవర్షి గణసంఘాత స్తూయమానాత్మ వైభవా" అని వశిన్యాది వాగ్దేవతల నోట పలికించారు.

తమకు, లోకములకు కలిగిన బాధ నివారించినప్పుడు దేవతలు ఆమెను స్తుతించారు. ఆమె అండదండలు ఎప్పుడూ తమకు ఉండాలని ప్రార్థించారు. ముల్లోకములకు అఖిలేశ్వరియైన అమ్మ, వారి అభ్యర్థనను మన్నించి, అభయమిచ్చింది.

ఆ విశ్వేశ్వరి, రాక్షస బాధ లధికమైనప్పుడు, తాను నందగోపకులంలో కృష్ణునితోబాటు పుట్టి (పద్మనాభ సహోదరి) దుష్టులను సంహరిస్తానని మాట ఇచ్చింది. శాకంభరిగాను శతాక్షిగాను అవతరించి, కరువు కాటకాలను తొలగించి, లోకాలను కాపాడుతానని తెలియజేసింది. ఆ విధంగానే ఆపదలో అదుకొన్నది.

అన్ని రూపులు తనరూపమైన ఆ జగద్ధాత్రి, అడిగినవారికి కొదువలేకుండా వరాలిచ్చి ఆదరిస్తుంది. ఆ తల్లి తన సంరక్షణలో ఉన్నవారికి ఏ లోటు రానివ్వదు. చందోలులో కొలువుతీరిన "భగళాముఖీ" అమ్మవారి చరిత్ర పరమాద్భుతం. ఆమెను ఆశ్రయించినవారు, తామితరులకు కూడా ఆశ్రయమియ్యగల గొప్పవారవుతారు.

శ్లో॥ విశ్వేశ్వరి! త్వం పరిపాసివిశ్వం
విశ్వాత్మికా! ధారయ సీతి విశ్వమ్।
విశ్వేశవంద్యా! భవతీభవన్తి
విశ్వాశ్రయా యే త్వయి భక్తి నమ్రాః ॥

<u>సమానాధిక వర్షితా</u> : తీగెకు కాయ బరువు కాదు. తన బిడ్డల్ని కాపాడుకోవటంలో తల్లికి శ్రమ వుండదు. అందరిని సమానంగా చూడగలిగింది ఒక తల్లే. జగన్మాత అమ్మకు సృష్టిలో గల ప్రాణులన్నింటిని తన సంతానంగానే భరించి, పోషించగల సామర్థ్యం ఉంది. అందుకే ఆమెను "ఆ బ్రహ్మకీట జనని" అని కీర్తించారు. బ్రహ్మ దగ్గరనుండి చిన్న పురుగు దాక వున్న జీవకోటికి ఆమె జనని. రక్షకురాలు అని అర్థం ఈ విషయాన్నే పోతన తన భావగతంలో "చాల పెద్దమ్మ" అని వర్ణించాడు.

పొట్టి, పొడవు అనే కొలతలు కాని, తెలుపు, నలుపు అనే వర్ణవిభేదం కాని, కుల, మత, వర్గ విచక్షణ కాని, స్త్రీ, పురుష లింగభేదం కాని, ప్రాంత, దేశ భేదం కాని ఆమెకు లేవు. ఆ తల్లి ప్రేమకు పరిధులు లేవు. భూత, భవిష్యత్, వర్తమాన కాలములనే పరిమితులు లేవు, దేశ కాలాఽపరిచ్ఛిన్న. బిడ్డల మనస్తత్వాలలో నడవడుల్లో తేడా ఉండవచ్చు కానీ, తల్లి ప్రేమలో స్వచ్ఛతకు కొదువ లేదు. అందుకే ఆది శంకరులు కుపుత్రోజాయేత, క్వచిదపి కుమాతానభవతి" అని మాతృ స్తవం చేశారు. అందరికి అందుబాటులో ఉండి, సమయానికి ఆదుకునేది మన బండ్లమ్మ (బగాళాముఖి) ఆమెను ఎవరైనా, ఏవిధంగానైనా తలచుకొని కోరికలు కోరుకోవచ్చు. మ్రొక్కులు తీర్చుకోవచ్చు. "భద్రమూర్తి" ఆమె, మనకు భద్రములు చేకూరుస్తుంది. లోకుల ప్రవర్తనకు కారణం ఉంటుంది. భక్తనిధియైన తల్లి కరుణకు కారణం ఉండదు. "అవ్యాజ కరుణా మూర్తి" అనేమాట అమ్మకే వర్తిస్తుంది. ఆ వాత్సల్యమూర్తికి ఏమిచ్చి రుణంతీర్చుకోగలం. సదా తుష్టురాలైన ఆమెకు ఏమి కావాలి. ఆమెను భక్తితో కొలచిన వారికి ఆమె కొంగు బంగారం, భక్తిగలవారు, భక్తులంటే ఆమెకు ఇష్టం. "భక్తప్రియా భక్తి గమ్యా" భక్తి తోనే ఆమెను చేరగలుగుతాం. వేరే మార్గమే లేదు. ధనధాన్యాలకు మణిమాన్యాలకు లోబడదు. ఆమెకు అవి ఇచ్చి మనం సంతృప్తి పడటంలో తప్పులేదు. ఆడంబరాలకు అట్టహాసాలకు లొంగదు. భక్తికి మాత్రమే ఆమె వశమౌతుంది. భక్తి వశ్యా. భక్తులకు సౌభాగ్యములను ఇవ్వటంలో ఆమె చేతికి ఎముకలేదు - ఎన్నడు వెనుకాడబోదు. "భక్త సౌభాగ్యదాయినీ". అమ్మను "సర్వార్థదాత్రి" "వరదా"అని వ్యాసుడు కీర్తించటంలో తాత్పర్యం ఇదే.

<u>సర్వోపనిషదుద్ఘుష్టా :</u> వేద వేదాంతములచే స్తుతింపబడినది కావున ఆ జగన్మాతను "శ్రుతి సంస్తుతవైభవ" అని కూడా చెప్పారు. వేదములు కర్మకాండ యజ్ఞ యాగాదులను ప్రోత్సహిస్తాయి. వేదములకు చివర చెప్పబడినది వేదాంతం. వాటినే ఉపనిషత్తులని పిలుస్తారు. ప్రస్తుతం మనకు లభ్యమౌతున్న ఉపనిషత్తులు 108. అందులో (10) పదింటికి ఆదిశంకరులు (భాష్యం) వివరణ వ్రాశారు.

ఆ ఉపనిషత్తులన్నింటిలోనూ చెప్పబడినది ఆ పరాశక్తియే. పరంబ్రహ్మయే. 'ముక్తి రూపిణి' యైన అమ్మ, భక్తులకు ముక్తిదా' ముక్తిని కూడా ప్రసాదిస్తుంది. భోగ, మోక్షములను రెండింటిని ఇవ్వగల ఆ తల్లి సేవ, భక్తులకు సద్గతులను చేకూరుస్తుంది.

పంచభూతేశీ : ఆకాశాదులైన పంచభూతములకు శ్రీమాతయేతల్లి. (ఆకాశము, గాలి, నిప్పు, నీరు, నేల ఇవి పంచభూతములు) "ఆకాశాది జగత్ప్రసూ:" అని బ్రహ్మాండపురాణంలో చెప్పబడింది. ప్రకృష్టమైన (పెద్దవైన) ఈ పంచభూతములనే ప్రపంచమని వ్యవహరిస్తున్నాం.

ఆ త్రిపురాంబిక, పంచభూతములకు ఆధారమై అన్నింటిపై ఆధిపత్యాన్ని వహిస్తోంది. అంటే ఆమె ప్రకృతి స్వరూపిణిగా చెప్పబడుతోంది. ఆమె చల్లని చూపు వలన జగములు ఏ ఉపద్రవములు లేకుండ అభివృద్ధిపథంలో కొనసాగుతున్నాయి. ఆమెయే కన్నెర్రచేస్తే లోకము లతలాకుతలమౌతాయి. ఆ రహస్యాన్నే వశిన్యాది వాగ్దేవతలు "ఉన్మేష నిమిషోత్పన్నవిపన్న భువనావళి: " అన్న నామంలో వివరించారు. ఆ విషయం తెలుసుకొని భక్తులు ఆమె పాదములను శరణువేడితే, ఆ దయామయి కాలివేళ్ళగోళ్ళ కాంతులు వారి అజ్ఞానమును పోగొడ్తాయి.

నేను, నాది, నావారను అహంకార, మమకారములు మనుష్యులకు వ్యామోహమును కల్పించి, భ్రమింపజేస్తాయి. ఆ ప్రవర్తన పాపముల పాలొనరిస్తుంది. అది జన్మపరంపరకు కారణమవుతుంది. అట్టి దుర్గతి లేకుండ అమ్మవారు ఆత్మ స్వరూపాన్ని తెలియజేసి, జన్మమృత్యు జరాతప్తులైన జనులకు విశ్రాంతిని కలిగిస్తుంది. అంటే, తన సన్నిధికి చేరుస్తుంది.

పంచ యజ్ఞప్రియా: యజపూజనే అనే ధాతువు నుండి 'యజ్ఞము' అను పదము ఏర్పడింది. పూజించుట, గౌరవించుట అని అర్థము. దేవ, ఋషి, పితృ, మనుష్య (అతిథి) భూతయజ్ఞములు,పంచయజ్ఞములని ప్రసిద్ధి.

దేవయజ్ఞము : దేవతలనుద్దేశించి చేయు, జప, తప, అర్చన, హోమాదులు. వాని వలన దేవతలు సంతోషించి లోకములకు మేలు చేస్తారు.

ఋషి యజ్ఞము : తమ, తప శ్శక్తితో సాధించిన జ్ఞాన విజ్ఞానములను, ధర్మమును, లోకములకందించినవారు ఋషులు. వారి ఉపదేశములను విని, అర్థము చేసుకొని ఆచరించుట ప్రచారము చేయుట మన కర్తవ్యము.

పితృ యజ్ఞము : తండ్రి, తాత, ముత్తాత, తల్లి, నాయనమ్మ, తాతమ్మ మొదలగు వారు పితృదేవతలు వారినుద్దేశించి చేయు తర్పణ, శ్రద్ధాది విధులు, దాన ధర్మములు పితృయజ్ఞములో భాగములవుతాయి. వాని వలన పితృదేవతలు సంతోషిస్తారు. వంశము అన్ని విధముల అభివృద్ధి చెందుతుంది. సంతానభాగ్యం కలుగుతుంది.

భూత యజ్ఞము : ప్రకృతిలో మనతో బాటు జీవించు ప్రాణి సమూహమునకు చేతనైనట్లు సహకరించుట పశుపక్ష్యాదులను పోషించుట, ప్రకృతి, కాలుష్యముల బారిన పడకుండా రక్షించుట మొదలగునవి.

అతిథి యజ్ఞము : తిథిలేకుండా వచ్చేవాడు అతిథి అని చెప్తారు. అంటే ముందుగా తెలియజేయకుండానే భోజన సమయానికి ఇంటికి వచ్చే వారిని అతిథులని అంటారు. వారిని దైవంతో సమానంగా భావించి ఆదరించటం, అన్నోదకము లిచ్చి గౌరవించటం అతిథి యజ్ఞమని అంటారు. 'అభ్యాగత స్వయం విష్ణు: అన్నది పెద్దల మాట.

లోకంలో ఆ సమయానికి చాలనిపించేవి అన్నోదకములు. వాని వలన జీవులు సంతృప్తి చెందుతారు. సంతుష్టులైన వారు మనస్ఫూర్తిగా "అన్నదాతా సుఖీభవ" అని ఆశీర్వదిస్తారు. అందువలననే మన పెద్దలు అన్నసత్రములను, చలివేంద్రములను నెలకొల్పి ఈ సేవలు శాశ్వతముగా జరగాలని ఆకాంక్షించారు. దీనినే మనుష్య యజ్ఞమని కూడా అంటారు. కృతజ్ఞతాభావంతో ఈ విధులను పాటించేవారంటే అమ్మకు చాలా ఇష్టం.

ఇంతటి ఔన్నత్యానికి మూలమైన వారిని గుర్తించి, గౌరవించటం కర్తవ్యంగా భావించింది భారతీయ సంస్కృతి. ఆ సంస్కృతిని, పెద్దలాచరించిన మంచి సంప్రదాయములను మన్నించటం మన కర్తవ్యం. సంప్రదాయేశ్వరి అయిన అమ్మ, సదాచార ప్రవర్తిక కూడా కావున అట్టి వారికి అమ్మదయ అధికంగా లభిస్తుంది. అమ్మదయ ఉంటే అన్నీ ఉన్నట్లే.

పంచసంఖ్యోపచారిణి : పంచభూత సంబంధములైన పంచ (5) సంఖ్యగల ఉపచారములతో అమ్మను సేవిస్తే ఆమె సంతోషిస్తుంది. పూజా విధానంలో 64 విధానములు (చతుష్షష్టి) (16) షోడశ ఉపచారములున్నాయి. శక్తి లేక అన్నీచేయలేకపోయినా కనీసం పంచసంఖ్యోపచారములన్నా తప్పక చేయాలి. 1. పృధివీతత్వమైన గంధము 2. ఆకాశ తత్వమైన పుష్పము. 3. వాయుతత్వమైన ధూపము 4. అగ్నితత్వమైన దీపము 5. అమృత తత్వమైన నైవేద్యము.

స్వాహా : శబ్ద స్వరూపము ఆ జగన్మాతయే. దేవతల ప్రీతి కొరకు యజ్ఞములు చేస్తాం. ఏ దేవతను ఉద్దేశించి ఆహుతులను (హోమద్రవ్యములను) అగ్నిముఖంగా ఇస్తామో, ఆ దేవత మంత్రమును చెప్పి చివర స్వాహా అని ఉచ్చరించి సమర్పిస్తాం. స్వాహా శబ్దము చెప్పనిచో దేవతలు ఆహుతులను స్వీకరింపరు. ఉదా॥ ఇంద్రాయస్వాహా, సూర్యాయస్వాహా ఇందులో చెప్పబడిన స్వాహా శబ్దము ఆ భగవతీ స్వరూపమే.

స్వధా-శబ్దము, అమ్మరూపమే : వసు, రుద్ర, ఆదిత్య రూపులైన పితృదేవతలకు, స్వధా అను పదము చేర్చి తర్పణ, శ్రాద్ధాదులు చేస్తారు. అప్పుడే, వారది స్వీకరించి అనుగ్రహిస్తారు. స్తుతి సమయంలో అదేవి శబ్దగతమై యుండి ఆమోదిస్తుంది.

అదేవిధంగా దేవతలను, పితృదేవతలను అనుగ్రహించేది 'అమ్మయే' అని తెలుస్తోంది. అది వారికి అమ్మ ఇచ్చిన అవకాశము. భూలోకము, అందునా భరత భూమి, ధర్మభూమి, కర్మభూమి. ఇక్కడ చేసిన కర్మఫలములు స్వర్గాది లోకములలో జీవులకు అనుభవానికి వస్తాయి. 'స్వర్గాపవర్గద' అనే నామం అమ్మ భోగమోక్షములను రెండింటిని ఇవ్వకలిగిందని వివరిస్తోంది.

'పుణ్యాపుణ్యఫలప్రదా' అనే అమ్మనామం, చేసిన పుణ్య పాపములకు తగిన ఫలం ఇచ్చేది ఆ జగజ్జననియే అని తెలియజేస్తోంది. జగచ్చక్షువులు, కర్మసాక్షులు అయిన సూర్యచంద్రులు అమ్మ తాటంకములై (చెవికమ్మలు) ప్రపంచానికి వెలుగులనిస్తూనే, ఈలోక వ్యవహారాన్ని చూసి అమ్మకు నివేదిస్తారు. "తాటంకయుగళీభూత తపనోడుపమండలా".

సూర్యచంద్రులు, నక్షత్రములు, పంచభూతములు రాత్రింబవళ్ళు ఆమె నియమించిన రహస్య ఛాయాగ్రహణ యంత్రములు. ఆ విధంగా ఆమె చూపుల నుండి ఎవ్వరూ తప్పించుకోలేరు. అందువల్ల క్రమశిక్షణ కలిగి మెలగటం మన కర్తవ్యం.విశ్వమే ఆమె రూపమైనప్పుడు విశ్వంలోని కళలు, విద్యలు ఆమె రూపములై విరాజిల్లుతున్నాయి. అనటంలో విశేషమేముంది?'విద్యాస్సమస్తా: తవదేవి భేదా:' అని దేవతలామెను సమస్తవిద్యా స్వరూపిణిగా స్తుతించారు.

సనాతని అయిన ఆ జనని సృష్టికాలమున, సృష్టిరూపిణిగాను స్థితికాలమున లోకములను రక్షించునదిగాను అవుతోంది. ఆమెయే జీవుల కర్మానుభవమునుబట్టి సంపత్కాలమునందు లక్ష్మీదేవిగా అవతరిస్తోంది. దారిద్ర్య కాలమున జేష్ఠా దేవిగా ఇనుప గజ్జలు కట్టుకొని ఇంట్లో తాండవమాడుతుంది. భక్తులు నిత్యము గంధ, పుష్ప, ధూప,దీప, నైవేద్యములతో పూజించి దేవిని స్తోత్రము చేయటం వలన ఆ చల్లని తల్లి ధనమును,పుత్రులను, ధర్మప్రవృత్తిని ఇచ్చి మోక్షమును గూర్చు ఉత్తమ గతిని ప్రసాదిస్తుంది.

లోకవృత్తము ననుసరించి ఒకసమయంలో జేష్ఠాదేవికి, లక్ష్మీదేవికి తమలో ఎవరు బాగుంటారనే విషయాన్ని గూర్చి చర్చజరిగింది. వారిద్దరూ పెద్దమనిషిగా ఎన్నుకొని ఒక వ్యక్తిదగ్గరకు చేరి, తమ వివాదానికి కారణం వివరించి, ఆయనను తీర్పుచెప్పమని అడిగారు.

అతడు ముందుపుట్టిన జేష్ఠాదేవిని పెద్దమ్మ అని, తరువాత పుట్టిన లక్ష్మిని చిన్నమ్మ అని ఆత్మీయంగా సంబోధిస్తూ, ముందుగా వారిని కొంతదూరం

నడిచి చూపించమని కోరాడు. ఆ పెద్దమనిషి (అతడు) చెప్పిన విధముగా వీరు చేశారు. ఎవరూ నొచ్చుకోకుండా తీర్పుచెప్పడానికి ప్రయత్నిస్తూ,అతడు, పెద్దమ్మా! నీవు వెళ్తుంటే బాగుంటావమ్మా, చిన్నమ్మ వస్తుంటే బాగుంటుందని చెప్పాడు. దాంతో ఇద్దరూ సంతోషించారు. అంతే, పెద్దమ్మ వెళ్ళిపోయింది. చిన్నమ్మ వచ్చింది. ఆయన దశ, దిశ రెండు మారిపోయాయి. మాటలంటే మాటాలా? కావు అవి ముత్యాల మూటలు, రత్నాల రాశులున్నూ. అన్నీ అయిన ఆ దేవిని, భక్తులు కష్టదశ వచ్చినప్పుడు నిందించకుండా, ఓర్పుతో, జప తపములతోను పూజా స్తోత్రములతోను ప్రసన్నం చేసుకొని అభీష్టములను నెరవేర్చుకోవాలి. ఆ శక్తిని భక్తితో సేవించి తమకనుకూలంగా మార్చుకోవాలి.

శతచండీయాగ పూర్వక కుంభాభిషేక మహోత్సవములు 2019:-

ది. 29-03-2019 శుక్రవారం నుండి ది. 04-04-2019 గురువారం వఱకు చందోలు బగళాముఖీ అమ్మవారి దేవస్థానములో 'శతచండీయాగం' నిర్వహించారు. ప్రతిరోజు 9 మంది పండితులతో ఉదయం చండీపారాయణలు జరిగాయి. సాయంత్రం హోమం జరిగింది. దుర్గా సప్తశతి దేవీ వైభవాన్ని తెలియజేసే గ్రంథం. ఇందులో 700 శ్లోకాలు ఉంటాయి. ప్రతి శ్లోకము ఒక మంత్రమే. ప్రతి మంత్రానికి చివర స్వాహా పదాన్ని చేర్చి అగ్నిముఖంగా ఆ దేవికి ఆహుతులివ్వబడ్డాయి. హోమద్రవ్యాలు సమృద్ధిగా భక్తితో సమర్పింప బడ్డాయి. శ్రీయామిజాల కృష్ణశర్మగారి బృదం కార్యక్రమం నిర్వహించారు. చివరి రోజున అంటే గురువారం ఉదయం పూర్ణాహుతి కార్యక్రమం, సశాస్త్రీయంగా, సమంత్రకంగా జరిగింది. శ్రీ చక్రార్చన, నవారణ పూజ రోజుకో విద్యావిధానంగా జరిగింది. ఉత్సవంలో భాగంగా ప్రతిరోజు ఉదయం తర్పణ ప్రియుడైన శ్రీ లక్ష్మీ గణపతికి తర్పణలు చేసి, సాయంత్రం గణపతి హోమం చేశారు. నవగ్రహాలకు జపములు చేసి ఆయాద్రవ్యములతో హోమము నిర్వహించారు.

రుద్ర హోమం : అభిషేక ప్రియుడైన రుద్రునకు (శివుడు) మహాలింగార్చన జరిగింది. ప్రతిరోజు పుట్టమన్నుతో చిన్నచిన్న లింగములు చేసి శివలింగాకృతిలో పేర్చి, ఆ కైలాస శిఖరావాసుడైన మహదేవునకు మహన్యాసపూర్వకంగా ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అతిరుద్ర పారాయణం జరిగింది. పంచాయతన దేవతలను పూజించారు. శివుడు చల్లబడితే లోకములన్నీ చల్లబడతాయి. పాడిపంటలు అభివృద్ధి చెందుతాయి.

దేశ సమైక్యతను, సమగ్రతను కాంక్షించిన ఆదిశంకరులు, విష్ణువు, ఆదిత్యుడు, గణపతి అంబికాసహితమగు (సాంబ) సదాశివుని ఒకే వేదిక మీద చేర్చి, అర్చించే విధానాన్ని పంచాయతన పూజగా ఏర్పాటు చేశారు. దీప ప్రజ్వలనంతో సుబ్రహ్మణ్యారాధన కూడా జరిగి, కాలడి శంకరులు షణ్మత స్థాపనాచార్యులుగా ప్రసిద్ధి చెందారు. ఆ మహోన్నతాశయానికి ఇక్కడ రూపకల్పన చేశారు. దేశాభివృద్ధికది ఎంతగానో ఉపకరిస్తుంది. మతమంటే అభిప్రాయమని అర్థం. ఆవిధముగా అందఱిలో ఏకాభిప్రాయాన్ని సాధించిన వారు శంకరులు.

సాయంత్రం రుద్రానువాకములతోశివప్రీతికై హోమం జరిగింది. వనదుర్గా పారాయణ-హోమము జరిగింది. ప్రతినిత్యంప్రముఖుల ధార్మికోపన్యాసములతో, భక్త బృందముల భజనలు,కీర్తనలతో ఆ ప్రాంతం మారుమ్రోగింది. ఊహించనంతగా భక్తజనం కార్యక్రమములలో పాల్గొని దేవి అనుగ్రహానికి పాత్రులయ్యారు అన్నిరోజులు వచ్చినవారందఱికి అన్న ప్రసాద వితరణ విశేషంగా జరిగింది.

ఋత్విక్కులు : వనదుర్గ పారాయణ, శ్రీ చక్రార్చన, నవావరణపూజ, బ్ర.వే. ఉపద్రష్ట శ్రీరామమూర్తిగారు చేశారు. గణపతి జపం శ్రీ సరస్వతుల ప్రసాద్‌శర్మగారు,పణతుల శ్రీ మణికంఠ శర్మగారు బృందము నిర్వహించారు.

రుద్ర పారాయణ : శ్రీ దేవులపల్లి సత్యన్నారాయణ ప్రసాద్ గారి బృందము నిర్వహించారు.

ధార్మికోపన్యాసములు : శ్రీ కోట్ల లక్ష్మీనరసింహశర్మగారు, డాక్టర్, తూములూరు శ్రీ దక్షిణామూర్తి శాస్త్రిగారు.

ఇంతటి ఈ బృహత్కార్యక్రమాన్ని బ్ర.వే.ఘంటసాల నరసింహమూర్తి గారు, ఆలయ ఇ.ఓ. చాలా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. టి.టి.డి.లో పి.వి.ఆర్.కె.ప్రసాద్ గారు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేసినట్లు నరసింహ మూర్తి గారు, ఆలయ అభివృద్ధికి కృషిచేస్తున్నారు. ఈ ఉత్సవాలలో ప్రజలు అత్యంతాసక్తితో పాల్గొన్నారు. భక్తులు మిక్కిలి బాధ్యతతో, జాగరూకతతో ప్రవర్తించారు. అమ్మవారి కృపతో కార్యక్రమం దిగ్విజయంగా జరిగింది. ఆలయకమిటీ సభ్యులు ఎంతగానో సహకరించారు.

గోపూజ : సకలదేవతా సమాహారమై శ్రీమాతకు ప్రతిరూపమైన గోమాతను భక్తితో పూజించారు. గోవు సర్వదేవతా స్వరూపంగా భావించేది భారతీయ సంస్కృతి.పూర్వం ఋషాశ్రమాలలో హోమనిర్వహణకు గోవులను పోషించేవారు. గోవునుండి లభ్యమయ్యే ద్రవ్యములు పాలు, పెరుగు, నెయ్యి, గోమూత్రము, గోమయము ఈ ఐదింటిని పంచగవ్యములంటారు. శుభకార్యక్రమము లన్నింటిలోను సమంత్రకంగా సిద్ధంచేసిన ఈ పంచగవ్యప్రాశన చేస్తారు.

జన్మజన్మలనుండి మనం చేసిన పాపాలు మన చర్మాన్ని, ఎముకలను ఆశ్రయించి ఉంటాయి. ఈ పాపాలు వ్యాధులుగా బయటపడతాయి. ఈ పంచ గవ్యప్రాసన ద్వారా శారీరక, మానసిక దోషాలు, నిప్పు కట్టెలను దహించినట్లు నశించిపోయి సకల శుభములు, ఆరోగ్యము సిద్ధిస్తుంది. ఆ పంచగవ్య ప్రసాదం వచ్చిన వారందరికి అందించారు.

శ్లో॥ యత్పా గస్థిగతంపాపం, దేహేతిష్ఠతి మామకే ।
పంచగవ్య ప్రసాదేన (ప్రాసనేన),దహత్యగ్నిరి వేంనమ్॥

గోసేవచేసి దీలీపమహారాజు రఘువుఅంతటి ఉత్తమ సంతానాన్ని పొందాడు. అష్టవసువులలో ఒకడుగా ఉన్న ప్రభాసుడు వశిష్టుని గోవును దొంగిలించి, భూమిపై భీష్మునిగా పుట్టి ఆ దోషాన్ని అనుభవించాడు. ఏనాడు గోవును హింసించరాదు.

గోమాత - శ్రీమాత

ఆ।వె। అవుమేన సకల దేవతలుందురు, గోవు భుక్తి ముక్తి గూర్చు వేల్పు!
కామధేను పూజ గావింపగా, జయలక్ష్మి వారి కరతలామలకము

రుద్రులకు తల్లీ - వసువులకు కూతురు
ఆదిత్యుల చెల్లెలా - ధరణిలో దైవమా
అపురూపమైన అమ్మ గోమాతా !
నీ జన్మకు సరిరారు, వేరెవరైనా ॥అపురూప॥

జనజీవంబులో సగపాలు తనదిగా
పాడినే పంటలే ఇవ్వగా ॥అపురూప॥

పసుపు కుంకుమలతో మహాలక్ష్మివై
కరుణనే కురిపించే శ్రీమూర్తివై
జగతి పోషణకే నీ జన్మము
నిన్నుమించగలరా యీ ధరణిలో
ఏ గృహము కట్టినా, ఏక్రతువు చేసినా
నీ పాదధూళే శ్రీకరం
సిరులనే విరివిగా ఇవ్వగా ॥అపురూప॥

దిలీపుడే సంతుకై సేవించెగా
మిమ్ముకాచె కృష్ణుడే, గోపాలుడై
కష్టకాలమందె ఋషుల అండగా
విడిచిపోని, ధర్మం మీలో ఉండగా
ఈ కామధేనువే సరిలేనివరమని
సత్యాన్ని కనలేని నాడు ప్రజలు
ధరణిలో దనుజులైమిగలరా? ॥అపురూప॥

"అపురూపమైనదమ్మ ఆడజన్మ" బాణిలో పాడాలి. (ఉదయ రవి చంద్రిక)

రచన : బ్ర.వే. మూర్తి వేంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, గణపవరం, గుంటూరు జిల్లా.

గోవుపాట

గోవు పాదములు పితృ దేవతలు
గొలుసులు తులసీదళములు
కరములు భుజంగాలు
ముఖం జ్యేష్ఠ
పండ్లు పరమేశ్వరునిబోలు
కండ్లు కైకేశ్వరునిబోలు
నాలుక నారాయణమూర్తినిబోలు
కొమ్ములు గోవిందరాజులనుబోలు
గోపురము నవరత్నములనుబోలు
వెన్ను రోమములు లింగాలబోలు
పిక్కలు పిడిగంటలుబోలు
పంచకం భాగీరథీతీర్థం
పాలు అమృత ధారలు
గోమయమున శ్రీమహాలక్ష్మి ఉంది
కడుపున శ్రీ ధరణిదేవత ఉంది
బొడ్డున శ్రీకమలము ఉంది

ఇట్టి గోమాతను, నిత్యము త్రికాలములలో స్మరించే వారికి, భక్తితో సేవించే వారికి, సకలైశ్వర్యములు సిద్ధిస్తాయని, గోవు ఇంటిముందుంటే సర్వదోషములు హరింపబడతాయని, గోపోషకులకు ఎటువంటి లోటు ఉండబోదని చెప్పి పెద్దలు ఆచరించి, బోధించిన ధర్మం. అందఱికీ అది అనుసరణీయం.

ఈ ఉత్సవ సందర్భముగా గుళ్ళో అమ్మవారికి రోజుకొక ప్రత్యేక అలంకరణ చేసి భక్తితో అర్చించారు. 29.03.2019న శాకంబరీదేవిగాను, 30.03.2019 శనివారం శ్రీగజలక్ష్మీదేవిగా 31.03.2019 లక్షగాజులతో శ్రీగాజుల శ్రీ మహా

గౌరీదేవిగా, అమ్మను దర్శించుకొనే భాగ్యం కలిగింది. 01.04.2019 అమ్మవారికి లక్షమల్లెపూల పూజ చేశారు. అమ్మను శ్రీ మీనాక్షి దేవిగా అలంకరించారు. 02.04.2019న అమ్మవారికి అరటిపండ్లతో విశేషార్చన చేశారు. శ్రీ శివకామ సుందరీదేవిగా అమ్మను అలంకరించారు. 03.04.2019న బుధవారం అమ్మవారికి లక్ష కుంకుమార్చన చేశారు. అమ్మవారిని శ్రీవిష్ణుదుర్గ మహాదేవిగా అలంకరించారు. 04.04.2019న అమ్మను శ్రీ పురపాలికా మహాదేవిగా అలంకరించారు. పూజ్యులు శ్రీశ్రీశ్రీ విశ్వయోగి విశ్వంజీ మహారాజ్ వారి చేతుల మీదుగా కుంభాభిషేకం జరిగింది.

వేదమంత్రాలతో, మంగళవాయిద్యాలతో భక్తుల కరతాళ ధ్వనులతో కుంభాభిషేకం అతివైభవంగా జరిగింది. కార్యక్రమానికి వచ్చిన ప్రజలంతా సంతోషించారు. తీర్థ ప్రసాదములతో పాటు అన్నవితరణ కార్యక్రమములో పాల్గొని ఆనందించారు. కార్యకర్తల్ని అభినందించారు. ఈ బృహత్కార్యక్రమానికి ఆచార్య బ్రహ్మగా వ్యవహరించిన వారు బ్రహ్మశ్రీ కొంపెల్ల రఘునాథశాస్త్రిగారు ఉపబ్రహ్మగా ఉన్నవారు. బ్రహ్మశ్రీ చెరుకూరి రవీంద్రశర్మగారు.

<u>నిర్వహణ సామర్థ్యము:</u> తల్లిదండ్రులకు సంతోషానిచ్చే ముద్దుబిడ్డగా, అన్నదమ్ములకు, అక్కచెల్లెళ్ళకు అనుంగు సోదరిగా, భర్తకు సహధర్మచారిణియైన భార్యగా, బిడ్డలను పోషించి, కాపాడే తల్లిగా, బాధ్యత గల గృహిణిగా తన సొమ్ము వృథాకాకుండా భద్రపరచుకొనే పొదుపరిగా, లోకంలో స్త్రీలు కడుసమర్థతతో వ్యవహరిస్తారు. వారికాశక్తి అమ్మ దివ్యానుగ్రహం వల్లనే సిద్ధిస్తుంది. దేవతలామెను స్తుతిస్తూ, స్త్రీలందరూ నీ అంశకలవారని గౌరవించారు. ఈ మాటలు, లోకులు, పరాయి స్త్రీల యెడల మాతృభావనతో ప్రవర్తించవలసిన తీరును ఉపదేశించేవిగా ఉన్నాయి.

విద్యా: సమస్తాస్తవదేవి భేదా:,
స్త్రియ: సమస్తా: సకలాజగత్సు. (దేవీ మహత్యం. 11/6 ॥శ్లో॥)

శ్రీమాత శివునితోగూడి ఆయనకు సేవలందిస్తున్నప్పుడు ఆమె 'భవాని'అని పిలువబడుతుంది. (భవుని భార్య భవాని) లోక నిర్వహణ సామర్థ్యమున విష్ణువుగా వ్యవహరిస్తుంది. క్రోధమున కాళిగా, సమరములందు విజయమును పొందు దుర్గగా, ఉన్నట్లు ఆగమములు వివరించాయి.

భోగే భవానీ, పురుషేషువిష్ణు: ।
క్రోధేచకాళీ, సమరేచ దుర్గా ॥

ఇక్కడొక రహస్యం తెలియదగిఉంది. తప్పుచేసినప్పుడు తల్లి, తనబిడ్డలకు మంచిగా చెప్తుంది. మందలిస్తుంది. తండ్రిచేత చెప్పిస్తుంది. దండిస్తుంది.

జగన్మాత కూడా తన సృష్టిలో భాగమైన రాక్షసులను, బాగు చేసేందుకు మంచి మాటలతో చెప్పిచూస్తుంది. శివునిచేత చెప్పిస్తుంది. వినకపోతే చివరకు దండిస్తుంది. ఆమె ఇంత ప్రయత్నం చేసి యుద్ధంలో వాళ్ళను సంహరింప నవసరం లేదు. దురహంకారులైన రాక్షసులను సంకల్ప మాత్రంతోనూ ఒక్కహుంకారముచేతను విగతజీవులను చేయగలదు. అయితే తన చేతిలో తన ఆయుధముల స్పర్శతో యుద్ధములో మరణించిన వారికి వీర స్వర్గాది ఉత్తమ లోకప్రాప్తి కలగాలనే దయాగుణం, మాతృస్వభావం ఆమెలో వ్యక్త మౌతుంది. కుపుత్రోజాయేత, క్వచిదపి కుమాతా నభవతి అన్న ఆదిశంకరుల మాటలకు ఇక్కడ అర్థం, అన్వయం ఏర్పడింది.

<u>జపయజ్ఞం :</u> యజ్ఞముల వలన దేవతలు ప్రసన్నులై వరములను ప్రసాదిస్తారు. ద్రవ్య యజ్ఞముల కంటే జప యజ్ఞము శ్రేష్టమైంది. స్తోత్ర పారాయణలవలె జపములు, బిగ్గరగా చేయటం కంటే పెదవులు మాత్రమే కదిలిస్తూ చేసే (ఉపాంశుజపం) జపం గొప్పది. అంతకంటే మానసికంగా చేసే జపానికే ఎక్కువ ఫలితం ఉంటుంది. నిత్యం జపం చేసేవారిని దేవతలు అనుగ్రహిస్తారు. లోకంలో గౌరవం లభిస్తుంది. వారి నోటిమాట ఫలిస్తుంది.

లోకంలో అందరికి జపం చేయటానికి తగినంత తీరిక, ఓపిక ఉండకపోవచ్చు. అటువంటి వారు అమ్మను మనసులో తలచుకొని "అమ్మా ! మేము మీ బిడ్డలం. మాబాగోగులు నీవే చూడాలి. నీకు దండం పెట్టడం తప్ప మాకు ఏమీ తెలియదు. నీ పాదాలు పట్టుకొని శరణు వేడుకొంటున్నాం, చల్లగా చూడుతల్లీ ! అని ప్రార్థిస్తే చాలు" అమ్మ కరుణామయి, తప్పక ఆదరిస్తుంది. ఆపద నుండి గట్టెక్కిస్తుంది. చిన్నపిల్లలు వచ్చీరాని మాటలతో అడిగినా, ఆ భావం వచ్చేలా కనులతో చెప్పినా, చేత్తో చూపించినా అమ్మ అర్థం చేసుకొని అవసరం తీరుస్తుంది. పైపెచ్చు చిన్నపిల్లలని ముద్దుగా చూస్తుంది. ముచ్చట తీరుస్తుంది. ఆస్తికులకు దైవం యెడ భక్తి విశ్వాసలేముఖ్యం.

<u>మంత్ర మహిమ :</u> మననం చేసేవారిని రక్షించేది మంత్రం - 'మననాత్, త్రాయత ఇతి మంత్ర:' అని పెద్దలు చెప్పారు. మూలమంత్రం గరుముఖత: చెప్పించుకోవాలి. పరమార్థాన్ని బోధించేవాడు గురువు-ఆగురువే దైవం. పుస్తకం చూసి చదువుకొని జపం చేయరాదు. జపం మధ్యలో మాట్లాడటం,లేవటం చేయరాదు. జపం చేసేవారికి దుష్ట గ్రహముల నుండి రక్షణ కలుగుతుంది. శత్రుపీడ తొలగిపోతుంది. శరీరం బాగుపడుతుంది. సంతానము, సంపదలు అభివృద్ధి చెందుతాయి.

<u>బగళాముఖీమంత్రం :</u> ఓం హ్లీం బగళాముఖీ సర్వదుష్టానాం వాచం ముఖం పదం స్తంభయ, జిహ్వాం కీలయ బుద్ధిం వినాశయ, హ్లీం ఓం స్వాహా.

ఈమంత్ర జపం చేసే వారికి, ఆసనం, జపమాల ముఖ్యం. అవి పసుపు రంగులో ఉంటే ఫలితం బాగా ఉంటుంది. వాటిని పవిత్రంగా భావించి, జపానంతరం పవిత్రమైన చోట ఉంచాలి. జపం చేసుకునే మాల మెడలో వేసుకోరాదు. జపం చేసేందుకు వినియోగించే పట్టుబట్టలు, (పసుపుపచ్చ) దీక్షా వస్త్రాలతో భోజనం చేయరాదు. అలాచేస్తే ఉతికి ఆరేసుకుంటే తప్ప మరునాటి జపానికవి పనికిరావు. నియమంతో చేసిన మంత్రజపం సిద్ధిస్తుంది.

ఫలితం కనిపిస్తుంది. కలియుగంలో దేవతలు ప్రత్యక్షంగా కనపడరు. స్వప్నదర్శనమిచ్చి అనుగ్రహిస్తారు. వాక్కుకు, మనస్సుకు అందని ఆశక్తిని ఆరాధించటానికి ఏర్పరచిన ఈ నియమావళి, దేవి నామ రూపములు, సాధకుల మనోనిగ్రహానికి తోడ్పడతాయి. ఉపాసకుల అభిరుచిని, అభిమానాన్ని తెలియజేస్తాయి. పసుపురంగు శుభసూచకం.

పిలిస్తే పలికే తల్లి బండ్లమ్మ : పిల్లలు ఆడుకుంటున్నంతసేపు అమ్మ తన (ఇంటి, వంట) పని చేసుకుంటూ ఉంటుంది. ఏ పనిలో ఉన్నా పిల్లల పిలుపు (ఏడుపు) వినగానే పరుగెత్తుకొస్తుంది. నోరుతెరచి చెప్పలేక పోయినా, పక్కతడిసిందో, చీమకుట్టిందో, ఆకలేస్తోందో, కడుపులో నొప్పో పరిశీలించి, ఆదరణతో అక్కున చేర్చుకొని, ఒడిలో కూర్చోబెట్టుకొని కళ్ళుతుడిచి, అవసరాన్ని గుర్తించి ఆదుకుంటుంది. జగన్మాత మన బగళాముఖి కూడా అంతే, భక్తులను రక్షిస్తుంది.

ధనేషణ, దారేషణ, పుత్రేషణ అనేవి (కోరికలు) ఈషణత్రయం. వీటికోసం మానవులు పరుగులు తీస్తూ ఉంటారు. ఆ ప్రయత్నంలో ఎదురయ్యే సమస్యలు, కష్టాలు, తాపాలుగా చెప్పబడ్డాయి. ఆధిభౌతిక, ఆధ్యాత్మిక ఆధిదైవికములని తాపములు మూడు విధాలు. ఆ తాపాలను ఉపశమింపచేయగలిగింది, వెన్నెలవలే ఆనందాన్ని ఇవ్వగలిగింది, శ్రీమాత దివ్యానుగ్రహమే.

" తాపత్రయాగ్ని సంతప్త సమాహ్లాదన చంద్రికా". ఆ తల్లి భూమి రూపమున నుండి సమస్త జగత్తుకు ఆధార భూతమై యున్నది. జల స్వరూపమున జీవులందరికి తృప్తినొసగుచు పోషిస్తుంది. వాయువై ప్రాణములిస్తుంది. అగ్నియై వెలుగునిస్తుంది. ఈలోకమున అన్నీ ఆమెయే, ఆమె కానిది ఈ ప్రపంచంలో ఏమీ లేదు.

సమర్పణ : భక్తులు చేసిన జపం,హోమం మొదలైనవన్నీ "సర్వం శ్రీ బగళాముఖీ దేవి చరణారవిందార్పణమస్తు" అని ఆ తల్లికి నివేదిస్తునట్లు భావించి చేతిలో నీటిని తీసుకొని తమముందున్న పళ్ళెంలో విడిచిపెట్టాలి. మన యోగక్షేమములు

చూసే అమ్మకు వినయంతో సమర్పిస్తే అమె సంతోషించి మనకు మేలుచేస్తుంది. రాక్షసులు తమ తపోబలంతో గర్వించి అకృత్యాలు చేయటం వలన వినాశమయ్యారు. అత్మ నిగ్రహంలేక అనర్థపరంపరకు గురిఅయ్యారు. వివిధ పద్ధతులలో విద్యుత్తు ఉత్పత్తి చేసి, దాన్ని మొత్తం విద్యుత్ కేంద్రానికి పంపిస్తారు. అక్కడ నుండి ఎప్పుడు ఎవరికి ఎంతెంత కావాలో సక్రమంగా సరఫరా జరుగుతంది. ఆ నియంత్రణ లేనప్పుడు కాంతి ప్రసారాలలో ఎగుడు దిగుడులు వస్తాయి. మనమిప్పుడనుభవిస్తున్న సమస్త సంపదలు తల్లి ఇచ్చినవే. ఆ తల్లికి సమర్పించి అనుభవిస్తే అప్పుడది ప్రసాదమవుతుంది. అవి ప్రకృతి నుండి మనకు లభించే పూలు, పండ్లు, నీరు, ఆహార విశేషములు, వస్త్రములు, ఆభరణములు వివిధ లోహములు ప్రకృతి మాత మనకు ఇచ్చిన ఐశ్వర్యము లని తెలుసుకొని ఆమెకే నివేదించటం పెద్దలు నేర్పించినపద్ధతి. నిత్యము వినయముతో ఆభగవతికి నివేదించి తింటే తిన్న ఆహారము ఆరోగ్యాన్నిస్తుంది. మంచి ఆలోచనలు కల్పిస్తుంది. మనలను ధర్మంవైపు నడిపిస్తుంది.

ఇది నేను సంపాదించుకొన్నాను. ఎవరికీ లేనిదాన్ని నేను సాధించుకున్నాను అని భావిస్తే అవినయం పెచ్చుపెరుగుతుంది. అహంకారం మనస్సులో పొడచూపుతుంది. అజ్ఞానం పేరుకుపోతుంది. తప్పటడుగులు పడి, గోతిలో కూరుకుపోయే అవకాశం ఉంది. "యద్యత్కర్మకరోమి తత్తదఖిలంమాతా (శంభో) తవారాధనమ్!" అన్న శంకరుల మాట మనకనుసరణీయము.

అనగనగా ఒకఊళ్ళో ఒక పెద్దమ్మ. రాబోయే రోజు కృష్ణాష్టమికి దైవానికి నివేదించే ప్రసాదంగా పేలపిండికొట్టి బయట ఎండబెట్టింది. ఇంట్లో తానేదో పనిలో ఉండగా, అనుకోకుండా పెద్ద, గాలీదుమారం వచ్చి పేలపిండి నేలపాలై పోయింది. ఆ సన్నివేశం చూచినపెద్దమ్మ పంచభూతమయుడైన ఆ భగవంతుడిని తలచుకొని మట్టిరూపంలో ఉన్న దైవాన్ని ఉద్దేశించి, గాలికి పోయే పేలపిండి కృష్ణార్పణమని భావించింది. భావగ్రాహియైన ఆ జనార్దనుడు అందుకు

సంతోషించి, భూతత్వముతోదాన్ని గ్రహించి ఆమెకు జ్ఞాన వైరాగ్యముతో బాటు ఇహపర సుఖములన్నింటిని ప్రసాదించాడు. ఈ కథ మనలో సమర్పణ భావనను పెంపొందించేదిగా చెప్పబడింది. హరిదాసు, పండుగ రోజులలో మన ఇంటిముందుకు వచ్చి భక్తితో భగవత్కీర్తనలాలపించి, మనం పెట్టే పిడికెడు బియ్యం, కూరలు స్వీకరించి, మనం మర్చిపోతామేమో అని 'కృష్ణార్పణం' అని గుర్తుచేస్తాడు. నాకు పెడుతున్నామని అహంకరిస్తారేమో ఇది కృష్ణునికి ఇచ్చామని భావిస్తే మీకు యోగక్షేమములు కలుగుతాయని హెచ్చరిస్తాడు. మీరు కృష్ణుడికి ఇచ్చినపదార్థాన్ని, దైవప్రసాదంగా నేను స్వీకరిస్తానని ప్రకటిస్తాడు. ఇందులో అంత కథ ఉంది. ప్రీతికరంగా తినే మన ఆహారపదార్థాన్ని దైవానికి నివేదించి భుజించాలి. లేకపోతే దొంగ తిండి తిన్నట్లే అని గీతాశాస్త్రం చెప్తుంది. ఇతరుల వస్తువులు వాడుకునేటప్పుడు వారికి చెప్పి తీసుకుంటాం. ఆ విధంగానే ఆభగవతి ఇచ్చిన ఆహారం ఆ సర్వేశ్వరికి నివేదించి భుజించటం మన ధర్మం.

జ్ఞానముద్రా : అమ్మను 'దశముద్రా సమారాధ్యా' అని వ్యాసులవారు కీర్తించారు. అయనకావిషయం వశిన్యాది వాగ్దేవతలు సూచించారు. దేవతలను అర్చించేటప్పుడు ఈ దశముద్రలు పదివిధములైన హస్తవిన్యాసములు ఉపయోగిస్తారు. అందులో ఒక్కొక్క దానికి ఒక్కొక్క అర్థము ఉంటుంది. నాట్య ప్రదర్శనలో కూడా ఇటువంటి ముద్రలు ప్రదర్శిస్తారు. ఆ పదింటిలో అమ్మవారు 'జ్ఞానముద్రా' స్వరూపమని వర్ణింపబడింది. జ్ఞానమంటే తెలియజేసేది, విద్య అని అర్థం. జ్ఞేయమంటే తెలియదగినదని అర్థం. జ్ఞానము జ్ఞేయము అయినది ఆ జగజ్జనని. మనకున్న చేతివ్రేళ్ళు, ఐదు. అందులో (అంగుష్టము) బొటనవ్రేలు, (తర్జనీ) ఎదుటివారిని బెదిరించడానికి ఉపయోగించే రెండవ వ్రేలు. ఈ రెండింటి చివరలు ఒకదానితో ఒకటి కలిపి పట్టుకొని, తక్కిన 3 వ్రేళ్ళు, మధ్యవ్రేలు, ఆ ప్రక్కన ఉన్న అనామిక, చివరిది కనిష్ఠక చాచివుంచిన దానిని జ్ఞాన ముద్ర అంటారు. ఆ ముద్రా స్వరూపమే అమ్మవారని ఆ నామమునకు అర్థము.

చేతివ్రేళ్ళలో, అంగుష్ఠము, తక్కిన వ్రేళ్ళతో కలవకుండా ప్రత్యేకంగా ఉంటుంది. అది పరాత్పరియైన అమ్మకు ప్రతీక. తర్జనీ వ్రేలు జీవునికి గుర్తు. ఈ రెండూ కలిపివుంచితే జీవుడు, దేవునితో కలిసిన అద్వైత తత్త్వమును బోధిస్తుంది. ఇదియే తెలియదగినది. అందఱు చేరవలసినది. దీనినే జీవ బ్రహ్మైక స్థితి అంటారు.

తక్కిన 3 వ్రేళ్ళు త్రిగుణములకు, త్రివర్గములకు గుర్తు. జీవుడు (తర్జని) త్రిగుణములతో (సత్వ, రజస్తమములతో) కూడినప్పుడు ఈ ప్రపంచభావము విస్తరిస్తుంది. కామాక్రోధాదులు హృదయంలో చోటుచేసుకుంటాయి. సంసారబంధమేర్పడుతుంది. అప్పుడు జీవుడు పుట్టుచూ, చచ్చుచూ మోహావార్ధిలో తిరుగుచుండునే కాని ఎన్నటికి ఒక తీరము చేరజాలడు.

అమ్మ అనుగ్రహం కలవారికి అద్వైత భావము పెంపొంది, తానే,నేనను జ్ఞానము కలుగుతుంది. అభ్యాసాతిశయము చేత భక్తులు అమ్మను తెలుసుకొని, ఆ శివశక్త్యైక్య స్వరూపమును అనుభవింపగలుగుతారు.

వందారు జనవత్సలా : వినయంతో నమస్కరించే స్వభావం గలవారిని 'వందారు' అని అంటారు. అట్టి భక్తి భావముగల జనులయెడల వాత్సల్యము కలది అమ్మ. తల్లికి, బిడ్డలయందుండే ప్రేమను 'వాత్సల్యము' అని అంటారు. ఆ బిడ్డలకు తల్లియందుండే ప్రేమను, భక్తి అంటారు. తల్లీ బిడ్డల బంధమే సహజమగు సంబంధము.

పంచకోశాంతర స్థితా : 'కోశము' అంటే ధనాగారము అని లోక వ్యవహారంలో ఉన్నా, తత్త్వ విషయమున విభాగమని తెలియజేశారు పెద్దలు. మన పరమార్థిక శరీరాన్ని ఐదు విభాగములు చేశారు. అవి

1) అన్నమయకోశము 2) ప్రాణమయకోశము 3)మనోమయకోశము 4) విజ్ఞానమయకోశము 5) ఆనందమయకోశము.

'భృగువారుణీవిద్య' అనే పేరుతో ఉపనిషత్తులు ఈ విషయాన్నే కథా రూపములో వివరించాయి. చదువు చెప్పగలిగిన తండ్రి తన కుమారునికి విద్యనేర్పితే కుమారుడాయనను మహా గురువు అని గౌరవిస్తాడు.

ఒకనాడు జిజ్ఞాసువైన (తెలుసుకుందామనే కుతూహలంతో) కుమారుడు తండ్రివద్దకు వచ్చి సచ్చిదానందస్వరూపమగు 'బ్రహ్మము'ను గూర్చి చెప్పమని అడిగాడు. తక్కిన విద్యలవలె గురువు లేక తండ్రి చెప్పేది, శిష్యులు విని నేర్చుకొనేది కాదు, ఆ బ్రహ్మవిద్య. తపస్సుచేసి తెలుసుకోవలసిందే. స్థలమో, పొలమో, ధనమో, ధాన్యమో ఇచ్చినట్లు ఇచ్చేది కాదు. ఇతరులు పుచ్చుకునేది కాదు. స్వానుభవంలో మాత్రమే తెలియవస్తుందారహస్యం. ఆ విషయమే చెప్పి తపస్సు చేయమని ఆదేశించాడు తండ్రి. "తపసా బ్రహ్మవిజిజ్ఞాసస్వ". తెలుసుకోవాలనే తపనయే తపస్సు. అతడు శ్రద్ధగా కొంతకాలం తపస్సు చేసి తండ్రి దగ్గరకు వచ్చి ప్రపంచంలో ప్రాణులన్నింటికి అవసరమైన అన్నమే బ్రహ్మమని చెప్పి సత్యమేనా అని అడిగాడు. అది విన్న తండ్రి నవ్వి అది పాక్షిక సత్యమే. ఎందుకని, అన్నం ఒక్కపూట తింటే మరొకపూటకు ఏవిధంగా లభిస్తుందా, ఎవరు ఎప్పుడు పెడ్తారా, అని ఎదురుచూస్తాం. అన్నం తాత్కాలికమైన తృప్తినిచ్చినా శాశ్వతా నందాన్ని ఇవ్వలేదు. అందువల్ల శాశ్వత సత్యాన్ని (బ్రహ్మను) తెలుసుకునేందుకు మరికొంతకాలం తపస్సు చేయమన్నాడు.

అతడావిధంగా చేసి, అందరికి ప్రియమైనది, రక్షణీయమైనది అయిన 'ప్రాణమే' బ్రహ్మమని తనకు తెలిసిన విషయం చెప్పాడు. అది విన్నతండ్రి, ఇదీ పాక్షిక సత్యమే. ప్రాణము నిత్యమైనది కాదు. మరికొంత ప్రయత్నించమని ఉపదేశించాడు. ఆ తర్వాత, కొంతకాలం తపస్సు చేసి, ఆ కుమారుడు తండ్రితో ఈ ప్రపంచ వ్యవహారమంతా మనస్సు మీద ఆధారడి ఉంది. ఇంద్రియములు ప్రవర్తించడానికి కూడా మన మనస్సే కారణం. అందువలన మనస్సే 'బ్రహ్మమని' నేను తెలుసుకున్నానని చెప్పాడు. అది విని తండ్రి, మనస్సు చంచలమైనది.

సంకల్ప వికల్పములతో కూడి అవునూ, కాదు అంటూ సందిగ్ధములో పడత్రోస్తుంది. పొద్దున కలిగిన ఆలోచన, సాయంత్రానికి మారిపోతుంది. ఇప్పుడిక్కడున్న మనస్సు మరుక్షణంలో వేరొకచోట సంచరించడానికి పరుగెత్తుతుంది. ఇంకొంత ప్రయత్నించమని కుమారునితో చెప్పాడు. ఇంతవరకు చెప్పబడిన అన్నమయ, ప్రాణమయ, మనోమయకోశములు పశు, పక్ష్యాదులకు, మానవులకు సమానమే. ఇంతటితో సంతృప్తి చెందితే మానవులు కూడా ఆ కోవకే చెందుతారు.

ఈ సారి తపనతో ఎంతో ప్రయత్నం చేసి ఆ కుమారుడు విశ్వము నడవటానికి విజ్ఞానమే కారణము. అందువల్ల 'విజ్ఞానమే' బ్రహ్మమని, తనకు తోచిన అభిప్రాయం తండ్రితో చెప్పాడు. ఆ విజ్ఞానము ఎప్పటికప్పుడు పరిణతి చెందుతుంది. అణువును గుర్తించారు. ఆ తర్వాత, పరమాణువును తెలుసుకున్నారు. పరిశోధనల ద్వారా విశ్వ రహస్యాలను ఎన్నింటినో క్రొత్త క్రొత్తగా ఆవిష్కరిస్తున్నారు. నూతనములైన గ్రహ గతులను గమనిస్తున్నారు. అందువల్ల విజ్ఞానం ఎప్పటికి పరిపూర్ణం కాదు. ఇది సమగ్రము, ఇంతటితో పరిసమాప్తమన్నది దానికి లేదు. ప్రగతికి అదే మూలము. ఇంకొంత ప్రయత్నం చేయమన్న తండ్రి సందేశాన్ని అర్థంచేసుకొని ఆ కుమారుడు తిరిగి తపస్సు చేశాడు. అప్పుడతనికి ఆనందం కలిగింది.

ఆనందం, క్షణికానందము, మానుషానందము, దేవతానందము, బ్రహ్మానందము మొ॥ అనేక విధాలుగా ఉంటుంది. క్షణికానందము ఏదైనా ఒక వస్తువు కొన్నప్పుడో, ఒక వ్యక్తిని కలసినప్పుడో కలిగే ఆనందము అది కొద్దిసమయమే ఉంటుంది. ఇలాగే తక్కినవి, అంతకంటే అధికమైనది లభించినప్పుడు అప్పటికున్న ఆనందము విస్మరింపబడుతుంది.

ఉదా॥ వాహనము లేనివాడికి రెండు చక్రముల వాహనము(సైకిల్, బైక్) లభిస్తే ఆనందం కలుగుతుంది. నాలుగు చక్రముల వాహనము (కారు) లభించినప్పుడు

అంతకు ముందున్నది మరుగునపడిపోతుంది. దేవతానందము ఇంతకంటే గొప్పది. అన్నింటికంటే మించింది బ్రహ్మానందం. జగన్మాతకు గల ఆనంద అంతకంటే అధికమైనది. అమ్మనుగూర్చి చెప్తూ వాశిన్యాదివాగ్దేవతలు, 'స్వాత్మానందలవీభూత బ్రహ్మాద్యానంద సంతతి:' అని వర్ణించారు. అందువల్ల అమ్మను ఆశ్రయించిన వారికి ఆమె అనుగ్రహంతో అంతటి ఆనందస్థితి కలుగుతుందని అర్థము.

ఆ విధంగా ఆ ఋషి తనయుడు తండ్రిని చేరి శాశ్వతమైన ఆనందమే బ్రహ్మమని తనకు కలిగిన అనుభవాన్ని వివరించాడు. అప్పుడా తండ్రి తన ఆమోదాన్ని తెలియజేశాడు.

ఈ, పంచకోశములతో కూడిన, జీవుడు, అన్నంతో శరీరాన్ని పోషించుకుంటూ, ప్రాణాన్ని రక్షించుకుంటూ మనస్సుతో, చేరదగిన గొప్పలక్ష్యాన్ని (అమ్మచరణసన్నిధిని) నిర్ణయించుకొని, ఆధ్యాత్మ విజ్ఞానమును పెంచుకుంటూ శాశ్వతమైన ఆనందాన్ని అనుభవించాలని పెద్దలు ఆ విద్యద్వారా ఉపదేశించారు. అమ్మ భక్తులకు అది సిద్ధిస్తుంది. ప్రయత్నించటం జీవుల కర్తవ్యం. అనుగ్రహించటం అమ్మదయా స్వభావంగా గ్రహించాలి.

లోకంలోని ప్రాణులందరూ, నేను, నాది, నావారు అనే భ్రమలోపడి తిరగటం జరుగుతోంది. అయినవారు కాదుపొమ్మని ఛీ కొట్టినా, బలాత్కారంగా బయటకు పంపించినా, మమత్వ దోషంతో వారిని గూర్చే ఆలోచిస్తూ వారి బాగోగులను విచారిస్తూ "అయ్యో వారేమైపోతారో" అని దుఃఖించటం గమనిస్తాం. వారెంతద్రోహబుద్ధితో ప్రవర్తించినా వారి మేలు కోరుతూ మోహావిష్టులై ఉండటం అజ్ఞానమౌతుంది. తమకు తాము ప్రజ్ఞావంతులమనుకోనే వారు కూడా ఈ హృదయ దౌర్బల్యంతో కర్తవ్య విమూఢులవుతున్నారు. అట్టి సందిగ్ధావస్థలో సద్గురువు నాశ్రయించాలి. 'అజ్ఞాన తిమిరాంధస్య, జ్ఞానాంజన, శలాకయా చక్షురున్మీలితంయేనతస్మైశ్రీ గురవేనమ:' అజ్ఞానంతో కళ్ళు

మూసుకుపోయిన వారికి జ్ఞానాంజనముతో కళ్ళు తెరిపించేవాడు గురువు. అట్టి వివేక నిధికి నమస్కారమని పెద్దలు, గురువుల ప్రాధాన్యాన్ని వివరించారు. అంజనము = ఔషధవిశేషము అదియొక వైద్య ప్రక్రియ.

అర్జునునకు ఆత్మస్వరూపాన్ని నిరూపించి సత్యదర్శనం చేయించిన శ్రీకృష్ణుడు జగద్గురువుగా కీర్తింపబడుచున్నాడు. ఒకలక్షా ఇరువది ఐదువేల శ్లోకములతో విస్తృతమైన మహా భారత గ్రంథములో 700 శ్లోకములలో భగవద్గీత రత్నమై ప్రకాశిస్తోంది. అర్జునునకు మోహమును నశింపజేసి, స్మృతిని కల్గించటం, కర్తవ్యోన్ముఖుని చేయటంలో ప్రముఖపాత్ర వహించింది. సర్వోపనిషత్సారము గీతాశాస్త్రము.

వ్యాస భగవానుడు రచించిన అష్టాదశ పురాణములలో మార్కండేయ పురాణమొకటి. అందులో దేవీ మాహాత్మ్యమును వర్ణించిన చండీ(దుర్గా) సప్తశతి నిత్యపారాయణ గ్రంథము. మాయామోహములను దాటాలంటే మూలప్రకృతియైన అమ్మను ఆశ్రయించి, ఉపాసించాలి అన్నది దాని సారాంశము.

ద్రుమణుడనే వైశ్యసంపన్నుని కుమారుడు సమాధి. అతని భార్య, పుత్రులు ధనలోభముతో సమాధిని ఇంటినుండి వెడలగొట్టారు. సురథుడను రాజు స్వజనులు, మంత్రులు, సేనాపతుల ద్రోహబుద్ధితో, శత్రురాజుల చేతిలో ఓడిపోయాడు. ఒంటరిగా అరణ్యములో ఉన్న మేధాఋషి ఆశ్రమానికి చేరాడు. అక్కడ వీరిరువురు కలుసుకొని, ఋషిని ఆశ్రయించి ఆయన చెప్పిన దేవీ మహిమలను విని, మమత్వ దోషమును వీడి, దేవినిగూర్చి తపస్సు చేసి ఆ జగన్మాత దయతో, భోగ,మోక్షములను పొందారు. సమాధి మోక్షమును, సురథుడు రాజ్యభోగములను కోరుకున్నారు.

భోగమోక్షములు రెండూ భిన్నధ్రువాలు, భోగమున్న చోట మోక్షము లేదు, మోక్షమున్నచోట భోగమునకు తావులేదు. కానీ అమ్మవారిని ఉపాసించిన వారికి ఇహపరసుఖములైన భోగమోక్షములు రెండూ సిద్ధిస్తాయి.

యత్రాఽస్తి భోగో న చ తత్రమోక్షః
యత్రాఽస్తి మోక్షోనచతత్ర భోగః ।
శ్రీ సుందరీ సేవనతత్పరాణాం
భోగశ్చ, మోక్షశ్చకరస్థఏవ ॥

ఆత్రిపుర సుందరి అంశయే ఈ బగళాముఖీ అమ్మవారు. మెలకువ, నిద్ర, గాఢ నిద్రలు మూడింటిలోను (జాగ్రత్, స్వప్న సుషుప్తులు) చైతన్య స్వరూపంతో ప్రకాశించే ఆ తల్లి త్రిపుర సుందరి అయినది. స్థూల, సూక్ష్మ, కారణ శరీరములన్నింటిలో చొచ్చిఉండి జీవులను, చైతన్యవంతం చేస్తుంది ఆ త్రిపుర సుందరి.

శ్లో॥ హేమప్రఖ్యా మీదుఖండాత్తమౌళీం శంకారిష్టాభీత్రిహస్తాం త్వాం త్రినేత్రం ।
హేమాబ్జస్థాంపీతవర్ణాం ప్రసన్నాం దేవీం దుర్గాం దివ్యరూపాం నమామి ॥

<u>పీతవర్ణా :</u> పసుపుపచ్చని వర్ణం కలదని అమ్మవారిని గూర్చి లలితా సహస్ర నామంలో చెప్పబడింది. ఆ నామం 'బగళాముఖీ' అన్న అమ్మ అవతార విశేషాన్ని గూర్చి చెప్పేది. పచ్చని వస్త్రాలతో, పచ్చని పూలతో అలంకరింపబడి, పచ్చని మణులు పొదగిన ఆభరణాలతో పచ్చని పద్మాన్ని చేతపట్టుకొని మేలిమి బంగారంలా వెలిగిపోతూ సుధా సాగర మధ్యంలో హేమ సింహాసనంపై కూర్చొని ఉంటుంది. భక్త రక్షణకు అవసరాన్ని బట్టి భూమిపై అవతరించిన ఆ తల్లి, వివిధ రూపాలతో, నామాలతో విరాజిల్లుతుంది. బగళాముఖీ అమ్మవారు కొన్నిచోట్ల రౌద్రరూపముతో రెండు భుజములు కలదిగాను, మరికొన్ని చోట్ల నాలుగు చేతులతో, మూడు కన్నులతో చంద్రరేఖ ధరించి సౌమ్యరూపంతోనూ దర్శనమిస్తుంది.

శ్లో॥ ధ్యాయేత్ పద్మాసస్థాం, వికసితవదనాం, పద్మపత్రాయతాక్షీం,
హేమాభాం పీతవస్త్రాం కరకలితలసత్ హేమపద్మాంవరాంగీం ॥
సర్వాలంకారయుక్తాం, సకలమభదాం భక్త నమ్రాం భవానీం
శ్రీవిద్యాం, శాంత మూర్తిం సకల సురనుతాం సర్వసంపత్ప్రదాత్రీమ్ ॥

ఆ భవానీదేవి (బగళాముఖి) పద్మాసమునందున్నది. వికసించిన (నవ్వుతూ ఉన్న) ముఖము కలిగినది. బంగారపు రంగు శరీరము కలిగినది. పచ్చని వస్త్రములను ధరించినది. అందమైన బంగారు పద్మమును చేతిలో ధరించినది. శ్రేష్ఠమైన అవయువముల పొందిక కలిగినది. పచ్చని మణులు పొదిగిన సమస్త ఆభరణములతో కూడినది. అందరికి అభయమిచ్చునది. భక్తులకు అందుబాటులో ఉండునది. సౌమ్యమైన (ప్రసన్నమైన) రూపము కలది. దేవతలచే నుతింపబడుచున్నదై భక్తులకు సకల సంపదలను ఇచ్చుచున్న ఆశ్రీవిద్యను, నేను ధ్యానిస్తున్నాను. ప్రసిద్ధమైన ఈ వర్ణన 'బగళాముఖీ' అమ్మవారిని వర్ణించేదిగా ఉంది.

ఏ రూపంలో ఉన్నా, ఏ స్థితిలో ఉన్నా, ఎక్కడున్నా, ఎప్పుడైనా అమ్మ, అమ్మే. దేశానికి రాజైనా అతడు అమ్మకు బిడ్డడే అవుతాడన్నది పెద్దల మాట. ఆ చల్లని తల్లి దీవెనలే, అతనికాస్థాయిని తెచ్చిపెట్టాయన్నది మరువరాని సత్యం. బిడ్డకు అమ్మపేరుతో, రూపంతో పనిలేదు. చిన్నతనంలో మా అమ్మపేరు నాకు తెలియదు. ఎవరైనా అడిగితే చెప్పగలిగే వాడిని కాదు. కొంత ఊహ వచ్చిన తరువాత బంధువులో, ఇరుగుపొరుగు అమ్మలక్కలో ఆమెను పేరు పెట్టి పిలవగా విన్నాను. ఆ తరువాత పెద్దవాడినై తెలుసుకున్నాను. 'అమ్మ' అన్న బిరుదే ఆమెకు ఘనమైనది.

ప్రేమతో గర్భమున దాల్చి, జన్మనిచ్చి ఆకలి తీర్చి, ఆపదలో ఆదుకొనేది, అడిగినవి సమకూర్చి పెట్టేది, అనుక్షణం కంటికి రెప్పలా కాపాడేది, తప్పులను క్షమించేది, అపవాదులను భరించేది, అభివృద్ధిని ఆకాంక్షించేది భవిష్యత్తును గూర్చి ఆలోచించేది, బిడ్డకు బంగారు జీవితం లభించడం కోసం అహరహము ఆరాటపడేది అమ్మ. తండ్రికి చెప్పి ఒప్పించి మంచి విద్యాబుద్ధులు చెప్పించేది క్రమశిక్షణను అలవర్చునది అమ్మే. తోబుట్టువులతో కలహించడాన్ని, వారిపై ఆధిపత్యాన్ని వహించడాన్ని వారి హక్కులను హరించి, వారి స్థానాలను ఆక్రమించటాన్ని ఖండించేది అమ్మే. ఆ జగజ్జనని బిడ్డలకు ఏలోటు లేకుండా,

తన ప్రతినిధిగా కన్నతల్లిని ప్రతియింట నిలిపింది. అనురాగాన్ని పంచింది. మానవమాత్రురాలైన తల్లియే, ఇంత బాధ్యత వహిస్తే జగన్మాతయైన ఆ శ్రీదేవి, చేసేమేలును, చూపే మహిమను మాటలతో వర్ణించగలమా? చెప్పితే అది సమగ్రమవుతుందా? వశిన్యాది వాగ్దేవతలు కొంత ప్రయత్నించారు. అమ్మమెచ్చిన ఆ మాటలను లోకమును నుద్ధరించుటకు వ్యాస, మార్కండేయాది మహర్షుల నోట పలికించారు. లలితా సహస్ర నామాలలో చెప్పినట్లు ఆ శ్రీమాత

1.ప్రాణదా: ప్రాణరూపిణియైన అమ్మ, గర్భస్థ శిశువుకు ప్రాణంపోసి స్త్రీ, పురుష లింగ నిర్ధారణచేసి, మహిళాశిశువులకు, పుట్టబోయే సంతానానికి ఆకలి తీర్చడానికి కావలసిన పాలతిత్తులను కూడా ఏర్పాటుచేస్తుంది. ఏమి ఆ విశ్వరచనా సామర్థ్యము. అమ్మ ప్రాణరూపియై మనలో సంచరిస్తుంది. ఈ బ్రతుకమ్మ, బతుకమ్మగా తెలంగాణాలో పూజలందుకొంటోంది.

శ్లో॥ ప్రకాశమానే ప్రథమే ప్రయాణే
ప్రతి ప్రయాణే ప్యమృతాయమానః ।
అంత: పదవ్యామనుసంచరన్తీం
ఆనందరూపాం బగళాం నమామి ॥

2. అన్నదా : ఆకలితీర్చే, ఆహారాన్నిచ్చేది అమ్మ. అత్తీతి అన్నం అని వ్యుత్పత్తి. తినేదని దాని అర్థము. పసితనంలో పాలు, అన్నప్రాసన తరువాత గోరు ముద్దలు చేసి తినిపిస్తారు. పుట్టిన దగ్గర నుండి మరణించే దాక జీవులకు ఆధారమైన అన్నాన్ని సమృద్ధిగా ఇస్తుంది అమ్మ.

3.అభయదా: జీవితంలో అన్నీ భయాలే. రోగభయం, మృత్యుభయం, దారిద్ర్యభయం మొ॥ అమ్మ, తనను తలచి,కొలచిన వారికి అభయమును ప్రసాదిస్తుంది. దేవతలు "దుర్గే స్మృతాహరసిభీతి మశేషజంతోఃు, అని అమ్మను కీర్తించారు.

4.వరదా : తీర్చేవారుండాలి కానీ గొంతెమ్మ కోరికలకేమి కొరత. శ్రీమాత భక్తులు కోరిన కోరికలలో యోగ్యమైన కోరికలు తీరుస్తుంది. మన ఇళ్ళల్లో కూడా చిన్నపిల్లలు అడిగినవన్నీ ఇస్తాం. కొన్ని లేకపోతే, కొని తెచ్చి ఇస్తాం.

వంటింట్లో కత్తినో, కత్తిపీటనో అడిగితే దాచేసి కాకెత్తుకెళ్ళిందని చెప్పి ఆడుకునే బొమ్మలిచ్చి మాయచేసి, మరచిపోయేలాగా చేస్తాం. అమ్మ మనలను ఆవిధంగానే మాయచేస్తుంది. ఆమె 'విష్ణుమాయా' స్వరూపిణి.

వసుధా : 'వసు' అంటే బంగారం. దాన్ని కడుపులో ధరించేది కనుక, భూమిని 'వసుధా' అన్నారు. ఆ జగన్మాతభూమి రూపంతో మనలను భరిస్తోంది. భూమి నుండి మనకు అన్నీ లభిస్తాయి. లోకంలో కన్నతల్లిని, ఓర్పులో భూమితో పోలుస్తారు. మల మూత్రాదులను సహిస్తూ బిడ్డల్ని పోషించేది తల్లి. భూగర్భంలోనే అభ్రకంతో సహా అన్ని లోహాలు పాలరాయి, గ్రానేట్ రాయి, నవరత్నాలు దొరుకుతున్నాయి. అందుకే బ్రహ్మాండ పురాణంలో ఆ జగన్మాతను 'స్వర్ణగర్భ', 'రత్నగర్భ' అని వ్యాసులవారు కొనియాడారు. పత్రం, పుష్పం, ఫలం, తోయం(నీరు) కూరగాయలు సమస్తం భూమాత ప్రసాదమే. గృహ నిర్మాణంలో ఉపయోగడే ఇసుక, ఇటుక, ఇనుము, సిమెంటు మొ॥ భూమి నుండి పొందుతున్నాము. పండే పంటలు, మనకు కడుపునింపుతున్నాయి. ధనాన్ని చేకూర్చిపెడుతున్నాయి. 'పత్తి' మనం కట్టుకునే వస్త్రాన్నికి మూలం. భూమాత ఋణం తీర్చుకోలేము. ఉదయాన్నే లేచి పాదస్పర్శను క్షమించమని కోరుకొంటాం. జీవితావసరాలకు కావలసిన ధనం, ధాన్యం, వస్త్రం గృహం ఇస్తుంది. 'ధనం హెచ్చిన మదం హెచ్చును' అన్నట్లు సంపదలు గర్వాంధులను చేస్తాయి. అందువల్ల

జ్ఞానదా: మంచి, చెడులను విచారించేది జ్ఞానం. పశు, పాశ విమోచని అయిన అమ్మ, దయతో, భక్తులు బుద్ధిమంతులయ్యేందుకు ప్రయత్నిస్తుంది. జ్ఞాన విగ్రహయై ఆశ్రితులకు జ్ఞానాన్నిస్తుంది. జ్ఞానహీనులైన నరులు పశువులతో సమానమని పెద్దలు చెప్తారు.

శ్లో॥ ఆహార నిద్రాభయమైథునాని
సమానమేతత్పశుభిర్నరాణాం ।
జ్ఞానంహి తేషామధికో విశేషః
జ్ఞానేనహీనాః పశుభిఃసమానాః॥

శర్మదా : 'శర్మ'ము అంటే సుఖము, సంతోషము. సంపదలెన్ని ఉన్నా సుఖపడే యోగ్యతలేనప్పుడు అవి వ్యర్థములే అవుతాయి. అమ్మ తనను పూజించిన వారికి సంతోషముతో సుఖపడే యోగ్యతనిస్తుంది. అందుకే అమ్మను సుఖప్రదా అని కూడా కీర్తించారు.

యోగదా: జీవులు, అంతర్ముఖులై ఆత్మతత్వాన్ని తెలుసుకోవటానికి యోగాభ్యాస పరులైన వారికి సాధ్యపడుతుంది.

'వాంచితార్థప్రదాయిని'యైన జనని, తాను యోగిని కావున యోగ శక్తిని ప్రసాదిస్తుంది. 'సద్గతిప్రద'యై సాధకులకు 'అహం బ్రహ్మాఽస్మి' అన్న భావన దృఢపరుస్తుంది. బిసతంతు తనీయసియై మనుష్యుల వెన్నులో ఉన్నకుండలినీ శక్తిని మేలుకొల్పి యోగానందాన్ని కలుగజేస్తుంది.

శ్లో॥ బిసతంతు తనీయసి! మాతః ! షడాధార
పంకేరుహాం తర్విరాజత్సుషుమ్నాంత రాళేషు
తేజోలసంతీం, సుధామండలీం ద్రావయంతీం,
సుధామూర్తి మీడే, మహానందరూపామ్॥

పురుషార్థప్రదా : పురుషులు సాధించవలసిన ధర్మ, అర్థ, కామ, మోక్షములనే నాల్గింటిని, అమ్మ జగన్మాత భక్తులకు ఇస్తుందని అర్థము. ఇక్కడ పురుషులను చెప్పి, స్త్రీలను విస్మరించారన్న వివాదము తలెత్తుతుంది. ఇక్కడి పురుష వాచకము మానవ జాతి మొత్తాన్ని మనస్సులో పెట్టుకొని ప్రయోగింపబడింది. జాత్యేకవచనమని శాస్త్రము దాన్ని వివరించింది. పుట్టిన ప్రతిజీవి (స్త్రీ/పురుషులు) సాధించవలసినవని తాత్పర్యము. ఇందులో అర్థ, కామములు అందరూ కోరుకుంటారు. అవి ధర్మబద్ధములైనప్పుడు మోక్ష హేతువులవుతాయని పెద్దలు వివరించారు. అధర్మంతో సాధించిన అర్థ, కామములు అపకీర్తిని తెచ్చి పెడతాయి. తుదకు పతన హేతువులవుతాయి. రావణాదులందులకు ఉదాహరణములు.

ముక్తిదా: జనన మరణములతో కూడిన సంసారచక్రము నుండి బయటపడి మరల పుట్టకుండుటను 'ముక్తి' అంటారు. శ్రీ విద్యోపాసకులకు, తిరిగి జన్మింపవలసినపనిలేదని పెద్దలు చెప్తారు. 'చరమేజన్మని శ్రీవిద్యోపాసకోభవేత్' అన్నది, దానికి పెద్దలు చెప్పే ప్రమాణము వాక్యము. ఆ విశ్వజనని భక్తులకు జన్మమృత్యుజరాతప్త జన విశ్రాంతిదాయిని'గా కీర్తింపబడటం వింటున్నాం. ఆకృతి (రూపం) ఏదైనా, ప్రకృతిలో ఉన్న జీవులందురూ ముక్తికి అర్హులే. రమణ మహర్షి సన్నిధిలో వివిధ జంతురూపములలో ఉండి, సాధకులు ముక్తి పొందిన సంగతులు జగత్ప్రసిద్ధములే. అమ్మ, అనర్ఘకైవల్య పదదాయిని అని వ్యాసులవారు వివరించారు. శ్రీ, కాళ, హస్తి, ముక్తిపొంది, శ్రీకాళహస్తేశ్వరుడవటం ప్రసిద్ధమే.

అనుగ్రహదా: 'అనుగ్రహ'మంటే ఏ కొరత లేకుండగ తమ వారిని ఏలుకొనుట అని అర్థము. అవ్యాజ కరుణామూర్తి అయిన తల్లికి భక్తులను అనుగ్రహించుట పరిపాటి. దేవతలకు, రక్కసుల వలన కలిగిన ఆపదలనెన్నెంటినో తొలగించి అనుగ్రహించిన సందర్భములందామె పరాక్రమ వైభవములను బ్రహ్మోపేంద్ర మహేంద్రాదులు వేనోళ్ళ కీర్తించారు. భక్తరక్షణ దాక్షిణ్య కటాక్షము కలది అమ్మ.

సద్యఃప్రసాదినీ: ఎప్పుడో ఏదో అద్భుతం జరుగుతుంది. శరీరపతనానంతరం మోక్షం వస్తుంది. అంటే అంత సమయం, సహనంతో వేచివుండటం కష్టమవుతుంది. అమ్మ అడిగిన వెంటనే ఆకలి తీర్చడమో, అవసరాలు సమకూర్చటమో చూస్తూ ఉంటాం. ఆ విశ్వధాత్రి కూడా, ఐహికములైన సుఖములను వెంటనే ప్రసాదిస్తుంది. ఆ తరువాత ఆముష్మిక ములైన ఆనందమును కూడా అందిస్తుంది. అందుకే ఆవిడను క్షిప్రప్రసాదినీ అనికూడా కీర్తించారు. మనకు విశ్వాసాన్ని కలిగించటం కోసం అర్థం ఒకటే అయినా, సద్యఃప్రసాదినీ, క్షిప్రప్రసాదినీ అని చెప్పారు. విషయాన్ని ధృవపరచడం కోసం, తత్వాన్ని విశదపరచడంకోసం, ఒకటికి రెండుసార్లు చెప్పినా పునరుక్తి కాదని శాస్త్రాలు వివరించాయి.

మనోవాచామగోచారా : అనంతమై అఖండమై అంతటా నిండి ఉన్న చైతన్యమే ఆ దివ్యశక్తి. దానినే పరమాత్మ!, పరబ్రహ్మము అన్నారు. పరిమితమైన మనస్సుకు వాక్కుకు అందని ఆ పరబ్రహ్మము, అవసరాన్ని బట్టి మనలాగా కరచరణాద్యవయ వములు ధరించి ఒక నామముతో పిలువబడుతూ మనముందు ప్రత్యక్షమవటాన్ని అవతారమని అంటారు. ఇప్పుడా శక్తి మనస్సుకు, వాక్కుకు తెలియదగినదై కనులముందు గోచరిస్తుంది. సాధకుల అభిరుచిని బట్టి స్త్రీ,పురుష భేదము, ఆయుధవిశేషములు ఏర్పడ్డాయి. అవతారములన్నింటి ప్రయోజనము శిష్ట రక్షణము, దుష్ట శిక్షణము, ఉపాసకుల అభీష్టసిద్ధిగా తెలియబడుతుంది.

సర్వశక్తి సమన్వితమైన ఆ బ్రహ్మము నుండి తన సంకల్పమాత్రము చేత జగత్తు సర్వము ఉద్భవించింది, జగత్పరిపాలనకు ఆ బ్రహ్మమే తనశక్తిని వివిధ రూపాలుగా మలచింది. ఆ దివ్యశక్తి స్త్రీగా భావించినప్పుడది శక్తిసంబంధించిన విజ్ఞానమై 'శాక్తేయ' మని పిలువబడింది. అప్పుడా శక్తియే సృష్టి సమయమున బ్రహ్మగా వ్యక్తమయ్యింది.'సృష్టికర్త్రీ బ్రహ్మరూపా'. ఎవ్వరు అడిగినా వరము లివ్వటమే తన విధి. ఆక్రమములో రాక్షసులు తపస్సు చేసి బ్రహ్మనుండి వరములు పొందారు. రక్షణ సమయంలో విష్ణువుగా వ్యవహరించింది. గోప్త్రీ గోవింద రూపిణీ' ఈ సందర్భముగా శిష్టరక్షణ చేయడం కోసం దుష్ట శిక్షణ కూడా బాధ్యతగా చేపట్టడం జరిగింది. కాలం చెల్లిన సృష్టి, ఉపసంహా రింపబడాలి. దానిని తనలోనే విలీనం చేసుకుంటుంది. అప్పుడాదివ్యశక్తి రుద్రరూపంలో దర్శనమిస్తుంది. సంహారిణీ రుద్రరూపా. సర్వస్వరూపము లాశక్తిలో భాగములే. సకల లోకములకు ఆమెయే (ఈశ్వరి) అధికారిణి.

తననుండి వరములనందుకొన్న కొందరు గర్వంతో తన సృష్టికి భంగము కల్పిస్తే, చూస్తూ ఊరుకుంటుందా? ఆ దివ్యశక్తి. బ్రహ్మగా ఇచ్చిన తన వరములు, వరములుగానే, ఉండగా, ఇంకొక రూపంలో, ఇంకొక మార్గములో, దుష్టశిక్షణ, లోకధర్మరక్షణ చేస్తుంది. అప్పుడు ఈశ్వరి తానే, ఈశ్వరుడు తానే. అదే అర్ధనారీశ్వరతత్వము. శివ, శక్తుల రూపమే ఈ జగము.

నశివేన వినాదేవి, దేవ్యాచ నవినా శివః ।
ఉభయోరంతరంనాస్తి చంద్ర చంద్రికయోరివ ॥

దృష్టిని, జ్ఞానమయము చేసి, చూస్తే, జగమంతా ఆ పర బ్రహ్మమయము గానే దర్శనమిస్తుంది.

ఎవ్వనిచే జనించు జగ మెవ్వనిలోపలనుండు లీనమై
యెవ్వనియందుడిందు, పరమేశ్వరుడెవ్వడు, మూలకారణం
బెవ్వ, డనాది మధ్యలయుడెవ్వడు, సర్వము తానయైనవా
డెవ్వడు, వాని నాత్మభవు నీశ్వరునే శరణంబు వేడెదన్ ॥

ఆంధ్రమహాభాగవతము, పోతన.

<u>మానవుల శక్తి పరిమితం :</u> పంచభూతములతో నిర్మితమైన జీవుల (మానవుల) శక్తి పరిమితం. ఉదాహరణకు గోడ అవతల ఏమిజరుగుతుందో ఊహించు కోవటమే తప్ప, కన్నులతో చూడలేం. దూరంగా చెప్పుకొనే మాటలు చెవులతో వినలేం. విద్య, వివాహం, ధనం, సంతానం మొదలగు అన్నీ అనుకున్నవి అనుకున్నట్లు సాధించలేం. అదే సాధ్యమైతే దైవంతో పనియేమి ఉంటుంది అన్నాడొక కవి.

ఈ సందర్భములోనే మానవులు మనకంటే శక్తివంతమైన దైవం ఒకటి ఉందని, అది తలచినట్లే లోకయాత్ర జరుగుతుందని తెలుసుకొని దైవాన్ని శరణువేడటం జరిగింది. ఆధునిక శాస్త్రవేత్తలు కూడా భౌతిక ప్రపంచానికి అతీతమైన శక్తి ఏదోఒకటి ఉందని గ్రహించారు. అరికట్టలేని ప్రకృతి వైపరీత్యాలు, భూకంపాలు, జలప్రళయాలు అందుకు నిదర్శనాలుగా గమనించారు. ఈ విశ్వగమనానికి, పరిణామానికి మూలమైన ఆ చైతన్యాన్ని దైవంగా భావించారు. అన్వేషణ సాగించారు. ఆ శక్తి అంతటా నిండిఉన్నదన్న సత్యాన్ని గుర్తించారు. దర్శించటానికి ప్రయత్నం చేశారు. ఆయా సందర్భాలలో వ్యక్తమైన ఆ చైతన్య శక్తిని వివిధ నామరూపములతో అభివర్ణించి ఆరాధించారు. దైవం ఉన్నదనే

ఆస్తిక భావనయే దైవంయెడ భక్తి శ్రద్ధలను పెంపొందించింది. సంకల్ప సిద్ధికి ఆ విశ్వాసమే మూలమై ముందుకు నడిపించింది. ఆశావహ జీవితానికి పునాదిగా నిలిచింది. అన్ని రూపములు, ఆ మూలశక్తికి, ప్రతిరూపములు, అంశరూప ములుగా విరాజిల్లుతున్నాయి. సర్వము ఆ సృష్టిలో భాగమే.

బగళాముఖీ అమ్మవారుగా ప్రసిద్ధిచెందిన దేవీరూపము కొన్నిచోట్ల రెండుచేతులతోనూ, మఱికొన్నిచోట్ల నాలుగు చేతులు ఉన్నట్లు దర్శనమిస్తోంది. మూడు నేత్రములతో వివిధాయుధములు ధరించి సౌమ్యమూర్తిగా కనబడుతున్న ఆ దేవి ఆయుధములు, రాక్షససంహారానికి ఉపకరించేవిగాను, దుష్టులకు భయాన్ని కలిగించేవిగాను, దేవతలకు హితమును చేకూర్చేవి, భక్తులకు అభయాన్ని వరములను ప్రసాదించేవిగాను ఉన్నాయని దేవీ కవచంలో చెప్పబడింది. 'దైత్యానాం దేహనాశాయ, భక్తానా మభయాయచ ధారయం త్యాయుధానీత్థం, దేవానాంచహితాయవై. దేవీ మాహాత్యంలో దేవతలు దుర్గా దేవిని ఇలా ప్రస్తుతించారు.

ఏతత్తే వదనం సౌమ్యం లోచనత్రయ భూషితమ్ ।
పాతున:సర్వ భీతిభ్య: కాత్యాయని! నమోఽస్తు తే ॥
జ్వాలా కరాళ మత్యుగ్ర మశేషాసుర సూదనమ్ ।
త్రిశూలం పాతునో, భీతే, భద్రకాళి! నమోఽస్తు తే ॥

అమ్మవారు ప్రసన్నురాలైతే, వరదా భయముల నొసంగి, తుదకు ముక్తిని కూడా ఇస్తుంది. ఆమెయే మాయారూపమున అజ్ఞానులకు సంసార బంధమునకు కారణమవుతోంది. అని మేధాఋషి తనను ఆశ్రయించిన సురథునకు, సమాధికి వివరించాడు.

సైషా ప్రసన్నా వరదా నృణాం భవతిముక్తయే
సావిద్యాపరమాముక్తే ర్హేతుభూతా సనాతని ।
సంసారబంధ హేతుశ్చసైవ సర్వేశ్వరేశ్వరీ ॥

వ్యక్తా వ్యక్త స్వరూపిణీ :

శ్లో॥ అర్చన కాలేరూపగతా, సంస్తుతికాలే శబ్దగతా ।
చింతనకాలే ప్రాణగతా, తత్త్వవిచారే సర్వగతా ॥

పూజించేటప్పుడు స్థూలరూపం, స్తోత్రం చేసేటప్పుడు శబ్దరూపం, చింతన చేసేటప్పుడు సూక్ష్మమైన ప్రాణరూపం తత్త్వమును గూర్చి విచారించునప్పుడు సర్వత్ర, సర్వగతమైన పరరూపం గాను తల్లిని దర్శించగలుగుతాం. చైతన్యానికి ఒకరూపమంటూ ఉండదు. అది అవ్యక్తరూపం. సృష్టికి ఆధారమై అన్నింటికి ముందున్నరూపం. సృష్టి (పంచభూతాలు) వ్యక్తరూపం.

అవసరాన్ని బట్టి ఒకే వస్తువు అనేకంగా వ్యక్తమవుతుంది. 'బహురూప' యైన ఆ దేవి, మాతృగణం నిశుంభుని సంహరించేటప్పుడు తాను సృష్టించిన దేవతలలో బ్రహ్మ నుండి బ్రహ్మాణి, (కమండల జలము) మహేశ్వరుని నుండి మహేశ్వరి, (త్రిశూలము) విష్ణువు నుండి వైష్ణవి, (చక్రము) కుమారస్వామి నుండి కౌమారి, (శక్తి,ఆయుధము) ఇంద్రుని నుండి ఐంద్రీ, (వజ్రాయుధము) వరాహమూర్తి నుండి వారాహి, (చక్రతుండము, ఆయుధము) నరసింహుని నుండి (నఖాయుధము)నారసింహి ఉద్భవించారు. ఇంకను శివదూతియైన చండిక (శాపాయుధము) నుండి దివ్యశక్తి ఉద్భవించి, రాక్షసులను సంహరించారు. అదిచూసి మిగిలిన రాక్షస సైన్యము వివిధ ఉపాయములతో పలాయనము చిత్తగించారు.

పరిస్థితిని గమనించిన రక్తబీజుడు, యుద్ధానికి వచ్చాడు. అతని శరీరమునుండి స్రవించిన ప్రతి రక్తము బొట్టు నుండి, అంతటి రాక్షసుడుద్భవించి దేవీ సైన్యమును చికాకుపరచాడు. అతని రక్తపు బొట్టు మరియొక రాక్షసుడు పుట్టుటకు కారణమగుచున్నది. కావున అతడు రక్తబీజుడని ప్రసిద్ధుడయ్యాడు.

రక్తబీజుని అంతమొందించుటకు, బ్రహ్మీ, మహేశ్వరి, వైష్ణవి మొదలైన వారు ప్రయత్నించారు. వారి ప్రయత్నం ఫలింపక పోగా రక్తబీజుని నుండి పుట్టిన రాక్షస సైన్యము వృద్ధిపొందటం జరిగింది. నిరాశతో ఉన్నవారిని చూచి అప్పుడా చండికా పరమేశ్వరి, కాళిని తన నాలుకతో రక్తబీజుడి నుండి వెలువడిన రక్తమును త్రాగివేయుమని ఆదేశించింది. కాళీ తన, నాలుకను నేలపై పరచి క్రిందపడిన రక్తము నంతను పీల్చివేసింది. చివరకు రాక్షసుడు రక్తమును కోల్పోయి, నీరక్తుడైనాడు. అప్పుడాదేవి అతనిని సులభంగా సంహరించింది. మాతృగణము సంతోషముతో నృత్యము చేసింది.

రక్తబీజుని మరణముతో కోపించిన శుంభ నిశుంభులు, తమ తమ సేనలతో యుద్ధరంగానికి వచ్చారు. ఘోరయుద్ధం జరిగింది. అందులో దేవి నిశుంభుని క్రిందపడద్రోసి, శూలంతో గుండెలోపొడిచి, ఖడ్గంతో అతనిశిరస్సు ఖండించింది.

అమ్మ సర్వదేవతా స్వరూపము: శ్రీమాత బ్రహ్మాదులను తాను సృష్టించి, కొన్ని బాధ్యతలు అప్పగించి, వారిచే లోక వ్యవహారమును నిర్వహింపచేస్తుంది. మహిషాసురాది రాక్షస సంహార సమయములో తమ బాధ్యతగా అమ్మకు తోడుగా ఉందేందుకు ఆయా దేవతలు తమతమ శక్తులతో, వాహనములతో రణరంగం లో ప్రవేశించారు. అప్పటికి వారు శక్తిసేనలో భాగంగా స్త్రీమూర్తులై గోచరించారు.

దేవత	శక్తి	వాహనము	ఆయుధము
బ్రాహ్మి	బ్రహ్మశక్తి	హంసవాహనము	దర్భతోకూడిన మంత్రజలము ఆయుధము
వైష్ణవి	వైష్ణవీశక్తి	గరుడాసనము	శంఖచక్రగదా శార్ఙ్గము ఆయుధములు
మహేశ్వరి	మాహేశ్వరీశక్తి	వృషభవాహనము	త్రిశూలము ఆయుధము
వారాహీ	వారాహీశక్తి	మహిషాసనము	సుదర్శనచక్రము ఆయుధము
ఐంద్రీ	ఐంద్రీశక్తి	ఐరావత గజవాహనము	వజ్రాయుధము
కౌమారీ	కౌమారీశక్తి	శిఖి(నెమలి)వాహనము	శక్తి ఆయుధము
లక్ష్మి	లక్ష్మీశక్తి	పద్మాసనము	పద్మము ఆయుధము
నారసింహి	నారసింహీశక్తి		నఖాయుధములు
కౌశికీదేవి	శివదూతి	వృషవాహనము	తీవ్రకంఠధ్వని

నిశుంభుని మృతికి కోపగించిన శుంభాసురుడు దేవితో యుద్ధానికి వచ్చాడు. "ఇతర స్త్రీల సహాయంతో యుద్ధంచేసి అవినీతితో విజయాన్ని సాధించానని గర్వపడకుమని" దేవిని ఎగతాళి చేశాడు.

అప్పుడాదేవి, నేను 'ఏకాకిని'. లోకంలో ఉన్నది, నేనొక్కదాన్నే ఇతరులెవ్వరూ లేరు. వారందఱూ, నా విభూతులే, అయా రూపములతో దర్శనమిచ్చే వారిప్పుడు నాలో ఐక్యమవుతారు చూడుమని, బ్రహ్మీ, వైష్ణవీ మొదలగు శక్తులను తనలో లీనం చేసుకొంది. అప్పుడా దేవి యొక్కతయేమిగిలింది. ఆమె శుంభుని ఎదిరించి, యుద్ధములో సంహరించింది. లోకములన్నీ ఆనందమును పొందాయి.

శ్లో॥ తతః సమస్తాస్తాదేవ్యో బ్రహ్మాణీ ప్రముఖా లయమ్ ।
తస్యా దేవ్యాఃతనౌ జగ్మురేకా వాసీత్త దాంబికా ॥ సప్తశతి 10/6శ్లో

ఈ సన్నివేశమును బట్టి లోకములో ఉన్న శక్తులన్నీ ఒకటే. ఉపాసకులు వారి వారి అభిరుచులను బట్టి సేవించి తరించారు. ఆ శక్తులన్నింటికి మూలశక్తి అయిన అమ్మవారి రూపాంతరములే అవి, అని తెలుస్తుంది. లోక నిర్వహణ కొరకు ఒకప్పుడామె తన శక్తిని బహురూపములతో ప్రకటిస్తుంది.

శ్లో॥ సర్వస్వరూపే సర్వేశే, సర్వశక్తి సమన్వితే ।
భయేభ్యః త్రాహినోదేవి, దుర్గే దేవి నమోస్తుతే ॥

అని దేవతలు అమెను స్తోత్రం చేశారు.

వైష్ణవి : ప్రకృతిలో ఏర్పడిన ఉపద్రవమును, ఉపశమింపచేసి, సృష్టిని కాపాడమని శ్రీమాత, లలితాంబను గూర్చి తపస్సు చేసిన విష్ణువు యొక్క ప్రార్థనను మన్నించి, అవతరించిన ఈ స్తంభన శక్తిని, బగళాముఖిని వైష్ణవి అని కూడా పిలుస్తారు. విష్ణు సంబంధం కలది వైష్ణవి అని అర్థము.

ఈ బగళాముఖీ మహావిద్యను ఉపాసించే విధానాన్ని బ్రహ్మ సనకస నందనాదులకు, వారు నారదునకు, నారదుని వలన సాంఖ్యాయన మహర్షి

గ్రహించి, ఆయన తన సాధనల ద్వారా తెలుసుకొన్న ఆ దేవియొక్క పూర్తి వివరాలు 36 పటలములు గల బగళాతంత్రమనే పేరుతో ఒక బృహద్గ్రంథాన్ని ప్రకటించాడు.

ఈ విద్యను బ్రహ్మ దేవుని నుండి విష్ణు భగవానుడు, ఆయన వలన పరశురాముడు ఆ సద్గురువు నుండి ద్రోణాచార్యుల వారు గ్రహించి, లోకంలో ప్రచారం చేశారు. త్రిపుర సుందరీ దేవి సృష్టించే మాయను దరి చేరనీయకుండా బగళాముఖీ అమ్మవారు తాను కవచమై ఉండి ఉపాసకులను రక్షిస్తుంది.

<u>జపతోనాస్తి పాతక:</u> జపం చేసే వారికి పాతకములు (పాపములు) ఉండవు. అంటే నశించిపోతాయి. 'జపం' అంటే జన్మ పరంపరను అరికట్టేది. పాపములను పరిహరించేది అని అర్థం చెప్పారు పెద్దలు.

శ్లో॥ జకారో జన్మవిచ్ఛేదః, పకారః పాపనాశకః ।
జన్మపాప వినాశిత్వా జ్ఞప ఇత్యభిధీయతే ॥

<u>యజ్ఞాప్రియా</u> : ఏ మంత్రమైనా సిద్ధించాలనుకొంటే ముందుగా ఆ మంత్రాన్ని నియమిత సంఖ్యలో జపం చేయ్యాలి. జప దశాంశము, తర్పణ చేయ్యాలి. తర్పణ దశాంశము హోమము చేయాలి. మార్జన సంతర్పణల వలన సమగ్ర సిద్ధి కలుగుతుంది. దేవతలు యజ్ఞప్రియులు. కావున హోమం చేయ్యాలి. వారు మనమిచ్చే ఆహుతులను అగ్ని ముఖంగా గ్రహించి యజ్ఞకర్తలను, యజమానులను రక్షిస్తారు. వాంఛితార్థములను ప్రసాదిస్తారు.

జప హోమార్చనా విధులందు మధ్యలో మాట్లాడరాదు. లేచి (ఆసనం విడచి) అటూ, ఇటూ తిరుగరాదు. అని 'రుద్రయామళతంత్రం'లో చెప్పారు.

నిత్యం జపం చేసేవారికి దేవతలు ప్రసన్నులై అనుగ్రహం కలిగి ఉంటారు. ఐహికాముష్మికములైన భోగ, మోక్షములను ప్రసాదిస్తారు. ఆ భక్తులను చూసి దుష్టగ్రహాలు, భయపడి దూరంగా జరిగిపోతాయి.

బ్ర.వే.తాడేపల్లి రాఘవనారాయణ శాస్త్రిగారు ఒకసారి నరసరావుపేటలో పరిచయమున్న వారింటికి వెళ్ళారు. అందఱూ సంతోషంగా స్వాగత సత్కారాలు

చేశారు. ఒకస్త్రీ మాత్రం దూరంనుండి నమస్కరించి లోపలికి వెళ్ళింది. ఇంట్లోవారి అభ్యర్థనతో గ్రహపీడితురాలైన ఆమెను పరిశీలించి, అమ్మవారి జపంచేసి, ధారపోసి ఆమె ఆరోగ్యం బాగుపడే విధంగా చేశారు. తిరిగి ఆగ్రహం, ఆ గృహం దరిదాపులకు రాకుండా తరిమివేశారు. అది వారి తపశ్శక్తికి నిదర్శనం. మంత్రమహిమకు తార్కాణం. దేవీ వైభవానికి నిరూపణ స్థానంగా భావింపవచ్చు.

<u>త్రికరణశుద్ధి:</u> చేసే ఏపనియైనా మనస్సు, వాక్కు, శరీరము ఏకంచేసి దీక్షతోచేసినప్పుడే అది సిద్ధిస్తుంది. మహాత్ముల స్వభావాన్ని త్రికరణశుద్ధి కలదిగా వర్ణించారు. ఒకదానికొకటి పొంతన లేకుండా చేసేవారు దురాత్ములు. వారికేదీ సిద్ధించదు.

శ్లో॥ మనస్యేకం, వచస్యేకం, కర్మణ్యేకం మహాత్మానాం ।
మనస్యన్యత్ వచస్యన్యత్, కర్మణ్యన్యత్ దురాత్మనామ్ ॥

నియమ, నిష్ఠలు పాటిస్తూ, మనస్సులో అమ్మవారి రూపం ధ్యానిస్తూ, నోటితో మంత్రాన్ని ఉచ్చరిస్తూ, చేత్తో (జపమాల త్రిప్పుతూ) పూజ చేస్తూ ఏకాగ్ర చిత్తంతో, నేను చేస్తున్నాననే అహంకారం లేకుండా ఉపాసన చేయాలి. అప్పుడే అమ్మవారు అనుగ్రహిస్తుంది. నిబద్ధత లేనప్పుడు నెత్తి అణుస్తుంది.

బగళాముఖీ అమ్మవారు, చేతులలో ముద్గరము, పాశము, వజ్రము, శత్రువుయొక్క నాలుకను ధరించి ఉంటుంది. శిరస్సున చంద్రకళ గల కిరీటము, మెడలో చంపక పుష్పమాల కలిగి పచ్చని పసుపురంగు వస్త్రములు ధరించి, త్రినేత్రములతో, వివిధాభరణములతో, బంగారు కాంతితో ప్రకాశిస్తూ, బంగారు సింహాసం మీద కూర్చోని ఉంటుంది. ముల్లోకములను స్తంభింపచేయగల శక్తిగా, ఆమెను ధ్యానిస్తూ, భక్తితో నమస్కరించాలి.

శ్లో॥ సౌవర్ణాసన సంస్థితాం, త్రినయానాం, పీతాంశుకోల్లాసినీం
హేమాభాంగ రుచిం, శశాంకమకుటాం, సచ్చంపకస్రగ్యుతామ్ ।
హస్తై:ముద్గర పాశ, వజ్ర రశనా: సంభిభ్రతీం, భూషణై:
వ్యాప్తాంగీం, బగళాముఖీం, త్రిజగతాం సంస్తంభినీం చింతయేత్ ॥

జగన్మాత సృష్టికి కారణభూతమైనది కావున ప్రకృతి అని పిలువబడుతోంది. కళ్యాణకారిణి అగుటచే భద్ర అనియు, స్వయం ప్రకాశ శక్తి కలది. కావున దేవి అని, బ్రహ్మాది దేవతలను ప్రకాశింపజేయునది కావున మహాదేవి అని, ఆనందస్వరూపిణి కావున 'శివా' అనియు మార్కండేయ పురాణమున దేవతలచే ఆమె కీర్తింపబడింది.

శ్లో॥ నమో దేవ్యై మహాదేవ్యై శివాయై సతతం నమః ।
నమః ప్రకృత్యై భద్రాయై నియతాః ప్రణతాః స్మతామ్ ॥

గౌరి దుష్టరాక్షసులను సంహరించు వేళ, క్రోధావేశమున నుండును కావున, శత్రువులకు ఆమె రౌద్రియైతోస్తుంది. భూత,భవిష్యత్, వర్తమానములైన మూడు కాలములందుండునది యగుట 'నిత్యగాను, విశ్వమంతయును ధరించి యుండుటచే ధాత్రియనియు, ప్రసన్నురాలైనప్పుడు వెన్నెలవలె చల్లని దైయుండుటచే 'జ్యోత్స్న'యనియు, ఆహ్లాదమును కల్గించు ఆ తల్లి 'ఇందు రూపిణి'గాను, భక్తులకు అనుగ్రహపూర్వకముగా సుఖము నిచ్చునదగుట 'సుఖ'యనియు పేర్కొనబడింది.

శ్లో॥ రౌద్రాయై నమో నిత్యాయై గౌర్యై ధాత్ర్యై నమో నమః ।
జ్యోత్స్నాయై చేందు రూపిణ్యై సుఖాయై సతతం నమః ॥

విశ్వమునందంతట అధికమైన ఆమె తేజమే వ్యాపించి ప్రకాశిస్తోంది. జీవులందఱియందు చిత్తవృత్తిగా, బుద్ధిగా, నిద్రగా, ఆకలిగా, ఆశగా, ఆత్మజ్ఞానశక్తిగా, ఓర్పుగా, జాతి (పుట్టుక)గా, లజ్జగా, శాంతిగా, శ్రద్ధగా, ప్రతిబింబంగా, కాంతిగా, లక్ష్మిగా, వృత్తిగా (జీవనోపాయము) స్మృతి(గుర్తు)గా, దయాస్వభావంగా, సంతృప్తి (సంతోషం)గా, తల్లితనం (మాతృత్వం)గా, భ్రాంతిగా కొలువైఉంది. లోకంలో ఆమె కానిది లేదు. ఆమె లేని చోటులేదు.

చరాచరమైనదీజగత్తు: చరము -కదిలేది. ఆచరము-కదలనిది. నదులు ప్రవహిస్తాయి. పవిత్రతకు అది గుర్తు. పర్వతములు స్థిరంగా ఉంటాయి. అందుకే వాటిని అచలములు అన్నారు. హిమాచలము, వెంకటాచలము మొ॥

కదిలే గడియారం కదలకపోతే ఏదో ఇబ్బందివచ్చిందని బాగుచేయిస్తాం. కదలరాని ఇంటి దూలం, కదిలితే మీదపడుతుందని భయపడి క్రొత్తది ఏర్పాటు చేస్తాం. దేని అవసరం దానిదే. దేనిధర్మం అది పాటించాల్సిందే. ఆ ధర్మమే అమ్మస్వరూపం. బ్రహ్మాండ పురాణంలో వ్యాసుల వారు "చిచ్ఛక్తిశ్చేతనారూపా, జడ శక్తి ర్జడాత్మికా" అని అమ్మను వర్ణించారు.

1960 ప్రాంతంలో చందోలులోగల పండితులు బ్ర.వే. శ్రీపరిమి సుబ్రహ్మణ్య శాస్త్రిగారు, శ్రీబగళాముఖీ అమ్మవారిని గూర్చి భక్తితో "బగళామాతా" అన్న మకుటంతో ఒక శతకంవ్రాసి అమ్మకు సమర్పించారు.

కవితా నీరాజనము

డాక్టర్. తూములూరు శ్రీ దక్షిణామూర్తి శాస్త్రి

దుష్టుడౌ దుర్గమున్‌జంపి దుర్గవైతి ,
వమ్మరో ! ముగ్గురమ్మల కమ్మవీవె
నిన్ను గొలిచిన, తిరిగి జన్మింపరెవ్వరు,
ముక్తి రూపిణీ ! శ్రీమాత ! మ్రొక్కులిడుదు.

భక్త సౌభాగ్య దాయినీ భద్రమిడుము,
శ్రీమహారాజ్ఞి ! నీయాజ్ఞ శిరమున నిడి,
అర్థవంతంబుగాగ నామామృతంబు,
నుడివి, జన్మసార్థక్యంబు బడయువాడ.

జగము సృష్టించి, రక్షించి, సంహరించి,
కనుమఱుగుజేయుచు సదను గ్రహము జూపు
పంచకృత్య పరాయణా ! వరములిమ్ము,
భక్త రక్షణ దాక్షిణ్య భావమెలయ.

అనుభవైక వేద్యమగు నీయాత్మతత్త్వ
మండ, పిండాది సకల బ్రహ్మాండములను
నిండి, విశ్వజననివన్న నిజము దెలుపు,
లీలజేయు దీవె భువన జాలమెల్ల

చావు పుట్టుక లడరు సంసార పంక
మున, నిమగ్ను కౌ భక్తుల, నెనరు తోడ
నుద్ధరింపగ జాలు ప్రబుద్ధురాల
వీవె, కొలుతు నీ చరణముల్, బ్రోవరావె !

జన్మమృత్యుజరాతప్త జనములకును
బ్రీతి, శాంతి, సౌఖ్యంబు గూర్చి, దరిచేర్చి
సచ్చిదానందమున్నతినిచ్చిప్రోచు
సాంద్రకరుణాధురీణా ! ప్రసన్న వగుము.

తల్లి! తాపత్రయాగ్ని సంతప్తులైన
జనులకున్ సమాహ్లాదన చంద్రికవయి
ప్రబలు మోహాంధకారంబుఁ బాయజేయు,
జ్ఞానదీపంబుగావెల్గు సదయహృదయ!

ఇచ్ఛయును, జ్ఞానమునుక్రియలెన్న నీవె;
శాంతినిచ్చు దైవమునీవె; సకలమీవె;
భయముదీర్చి, కాపాడుమోభద్రమూర్తి!
భేదభావంబులెడలించిమోదమెసఁగ

నామరూపవిసర్జితా! ప్రేమరూప।
సాధకుల నిమిత్తము విశిష్టంబులైన
నామరూపములు ధరించినావు! భక్తి,
నిన్ను, విశ్వభ్రమణకారిణిన్ భజింతు

మెలకువను, నిద్రను సుషుప్తి చెలగుచుండు
నిత్యచైతన్య సంపద నెగడునట్టి
చిన్మయీ! నిన్ను గొలుతు రక్షింపుమనుచు
శ్రుతులలో సంస్తుతింగన్న సుమతివీవె

మాటలెల్ల నుతులు, మంత్రంబులైసాగు
కృతులునీకెసఁగు బహుకృతులుగా ఁగ
జీవితంబు నీదు సేవలో ధన్యమై
నెగడువరము నిమ్ము బగళమాత!

కవినిగాను, వక్తనుగాను, గణనకెక్కు
కావ్యముల్ విమర్శనజేయగాప్రసిద్ధ
సాహితీవేత్తనేగాను! జనని; నీదు
పదములాశ్రయింతును భవబంధమెడల!

శ్రీ ధనుంజయకృత దుర్గా స్తోత్రం

నమస్తే సిద్ధసేనాని ఆర్యే మందార వాసిని ।

కుమారి, కాలి, కాపాలి, కపిలే, కృష్ణపింగళే ॥

భద్రకాళి నమస్తుభ్యం, మహాకాలినమోఽస్తుతే ।

చండముండే నమస్తుభ్యం, తారణి, వరవర్ణిని ॥

కాత్యాయనీ, మహాభాగే, కరాలి, విజయే, జయే ।

శిఖిపించ ధ్వజధరే, నానా భరణ భూషితే ॥

అట్టశూల ప్రహరణే, ఖడ్గ, ఖేటక, ధారిణీ ।

గోపేంద్ర స్యానుజే, జ్యేష్ఠే, నందగోపకులోద్భవే ॥

మహిషాసృక్ ప్రియే, నిత్యం కౌశికీ పీతవాసిని ।

అట్టహాసే, కోకముఖే, నమస్తేఽస్తు రణప్రియే ॥

ఉమే, శాకంభరీ, శ్వేతే, కృష్ణే, కైటభనాశినీ ।

హిరణ్యాక్షి, విరూపాక్షి, సుధూమ్రాక్షి, నమోఽస్తుతే ॥

వేదశ్రుతి మహాపుణ్యే, బ్రహ్మణ్యే, జాతవేదసి ।

జంబూ కటకచైత్యేషు, నిత్యం సన్నిహితాలయే ॥

త్వం బ్రహ్మవిద్యా, విద్యానాం ! మహానిద్రాచదేహినామ్ ।

స్కంద మాతర్భగవతీ ! దుర్గే, కాంతారవాసినీ ॥

స్వాహాకారః స్వధాచైవ కలా కాష్ఠా సరస్వతీ ।

సావిత్రీ వేదమాతాచ ! తథా వేదాంత ఉచ్యతే ॥

స్తుతాఽసి త్వం మహాదేవి ! విశుద్ధేనాంతరాత్మనా ।

జయేభవతుమే నిత్యం, త్వత్ప్రసాదా ద్రణాజిరే ॥

కాంతారభయదుర్గేషు, భక్తానాంపాలనేషుచ ।

నిత్యం వససి పాతాలే, యుద్ధే జయసిదానవాన్ ॥

త్వం భంజనీ, మోహినీచ, మాయాహ్రీం శ్రీఃతథైవచ ।

సంధ్యాప్రభావతీ చైవ సావిత్రీ జననీ తథా ॥

తుష్టిః పుష్టిః ధృతిఃదీప్తిః, చంద్రాదిత్యవివర్ధినీ ।

భూతిర్భూతిమతాం సంఖ్యే, వీక్ష్యసే సిద్ధ చారణైః ॥

అనుబంధము

శ్రీ బగళాముఖీ హృదయము

ఓం అస్య శ్రీ బగళాముఖీ హృదయమాలా మంత్రస్య నారద ఋషిః అనుష్టుప్ ఛందః శ్రీ బగళాముఖీ దేవతా హ్లీం బీజం క్లీం శక్తిః ఐం కీలకం శ్రీ బగళాముఖీ ప్రసాద సిద్ధ్యర్థే జపే వినియోగః

ఋషిన్యాసం:

ఓం నారదఋషయే నమః శిరసి ఓం అనుష్టుప్ ఛందసే నమః ముఖే ఓం శ్రీబగళాముఖ్యై దేవతాయై నమః హృదయే ఓం హ్లీం బీజాయ నమః గుహ్యే ఓం క్లీం శక్తయేనమః పాదయోః ఓం ఐం హ్లీం కీలకాయనమః సర్వాంగే.

కరన్యాసం, హృదయన్యాసం :

ఓం హ్లీం అంగుష్టాభ్యాం నమః ఓం క్లీం తర్జనీభ్యాం నమః ఓం ఐం మధ్యమాభ్యాం నమః ఓం హ్లీం అనామికాభ్యాం నమః ఓం క్లీం కనిష్టికాభ్యాం నమః ఓం ఐం కరతలకరపృష్ఠాభ్యాం నమః ఓం హ్లీం హృదయాయనమః ఓం క్లీం శిరసే స్వాహా ఓం ఐం శిఖాయైవషట్ ఓం హ్లీం కవచాయ హుం, ఓం క్లీం కవచాయ హుం ఓం క్లీం నేత్రత్రయాయవౌషట్ ఓం ఐం అస్త్రాయ ఫట్ ఓం హ్లీం క్లీం ఐం భూర్భువస్సురోమితి దిగ్బంధః

ధ్యానం :

పీతాంబరాం పీతమాల్యాం పీతాభరణభూషితామ్
పీతకంజ పదద్వంద్వాం బగళాం చింతయే ఽనిశమ్
ఇతిధ్యాత్వా పంచముద్రయా సంపూజ్య
పీత శంఖగదా హస్తే పీతచందనచర్చితే
బగలే మే వరందేహి శత్రుసంఘవిదారిణీ

ఓం హ్లీం క్లీం ఐం బగళాముఖ్యై గదాధారిణై ప్రేతాసనాధ్యాసిన్యైస్వాహా ఇతి మంత్రం జపిత్వా పునః పూర్వవత్ హృదయాది షడంగన్యాసం కృత్వా స్తోత్రం పఠేత్

వందేహం బగళాం దేవీం పీతభూషణ భూషితాం
తేజోరూపమయీం దేవీం పీత తేజస్వరూపిణీమ్ ॥
గదాభ్రమణ భిన్నాభ్రం భ్రుకుటీభీషణాననాం
భీషయంతీం భీమశత్రూన్ భజే భక్తస్య భవ్యదామ్ ॥
పూర్ణచంద్రసమానాస్యాం పీతగంధానులేపనాం
పీతాంబర పరీధానాం పవిత్రా మాశ్రయామ్యహమ్ ॥
పాలయంతీ మనుపదం ప్రసమీక్ష్యావనీతలే
పీతాచారరతాం భక్తాం తాం భవానీం భజామ్యహమ్ ॥
పీత పద్మ పదద్వంద్వాం చంపకారణ్యవాసినీం
పీతావతంసాం పరమాం వందే పద్మజవందితామ్ ॥
లసచ్చారు శింజత్సుమంజీర పాదాం
చలత్ స్వర్ణ కర్ణావతంసాంచితాస్యాం
వలత్సీత చంద్రాననాం చంద్ర వంద్యాం
భజే పద్మజద్వైర్లసత్పాద పద్మామ్ ॥
సుపీతాభయామాలాయా పూతమంత్రం
పరంతే జపంతో జయం సంలభంతే
రణే రాగరోషాప్లుతానాం రిపూణాం
వివాదే బలాద్వైరకృద్వామ మాతః ॥
భజేపీత భాస్వత్ప్రభా ఽహస్కరాభాం
గదాశింజితా ఽమిత్రగర్వం గరిష్ఠామ్
గరీయోగుణాగార గాత్రం గుణాఢ్యాం
గణేశాది గమ్యాంశ్రయే నిర్గుణాఢ్యామ్ ॥

జనా యే జపంత్యుగ్ర బీజం జగత్సు
పరం ప్రత్యహం తే స్మరంతః స్వరూపం
భవేద్వాదినాం వాఙ్ముఖస్తంభ ఆద్యే
జయోజాయతే జల్పతామాశు తేషామ్ ॥

తవ ధ్యాననిష్ఠా ప్రతిష్ఠాత్మప్రజ్ఞా
వతాంపాదపద్మార్చనే ప్రేమయుక్తాః
ప్రపన్నానృపాః ప్రాకృతాః పండితావా
పురాణాదిగాథాసు తుల్యాభవంతి ॥

నమామస్తే మాతః కనక కమనీయాంఘ్రి జలజం
వలద్విద్యుద్వరాం ఘనతిమిర విధ్వంస కరణం
భవాబ్ధౌ మగ్నానాం తరణకరణం సర్వశరణం
ప్రసన్నానాం మాతర్ణగతి బగళే దుఃఖదమనమ్ ॥

జ్వల జ్యోత్స్నారత్నాకర మణి విషకాంఘ్రి భవనం
స్మరామస్తేధామ స్మరహర హరీంద్రేందు ప్రముఖ్యైః
అహోరాత్రం ప్రాతః ప్రణయ నవనీయం సువిశదం
పరం పీతాకారం పరిచిత మణిద్వీపవసనమ్ ॥

వదామస్తే మాతశ్రుతిముఖకరం నామలలితం
లసన్మాత్రావర్ణం జగతి బగళేతి ప్రచరితం
చలంతస్తిష్ఠంతో ఽవయముపవిశంతో ఽపిశయనే
భజామోయ త్ర్యేయో దివిదురవలభ్యం దివిషదామ్ ॥

పదార్చాయాం ప్రీతిః ప్రతిదినమపూర్వా ప్రభవతు
యధాతే ప్రాసన్నం ప్రతిఫలమపేక్ష్య ప్రణమతాం
అనల్పం తన్మాతః భవతి బృతభక్ష్య భవతు నో
దిశాతస్సద్భ క్తిం భువి భగవతాం భూరి భవదామ్ ॥

మమ సకలరిపూణాం వాఙ్ముఖే స్తంభయాశు
భగవతి రిపుజిహ్వాం కీలయప్రస్థతుల్యాం
వ్యవసిత ఖలబుద్ధిం నాశయాశు ప్రగాల్భాం
మామ కురుబహుకార్యం సత్ర్కుపేఽమ్బ ప్రసీద ॥

వ్రజతు మామ రిపూణాం సద్మని ప్రేతసంస్థా
కరధృత గదయాతాం ఘాతయిత్వాశురోషాత్
సధన వసన ధాన్యం పద్మతేషాం ప్రదహ్య
పునరపి బగళే త్వం స్వస్థతాం యాహి శ్రీఘ్రమ్ ॥

కరధృత రిపుజిహ్వా పీడనస్య గ్రహస్తాం
పునరపిగదయా తాం స్తాడయంతీం సుతంత్రాం
ప్రణత సురగణానాం పాలికాం పీతవస్త్రాం
బహుమలబగళాం తాం పీతవస్త్రాం నమామః ॥

హృదయ వచనకాయైః కుర్వతాం భక్తిపుంజం
ప్రకటిత కరుణార్ద్రాం ప్రీణతీ జల్పతీతి
ధన మథ బహుధాన్యం పుత్ర పౌత్రాది వృద్ధిం
సకలమపి కిమేభ్యో దేయమేవం త్వవశ్యమ్ ॥

తవ చరణ సరోజం సర్వదా సేవ్యమానం
ద్రుహిణహరి హరాద్యై ర్దేవబృందై శ్శరణ్యం
మృదుమపి శరణం తే శర్మదం సూరిసేవ్యం
వయమిహ కరవామో మాతరేతద్విధేయమ్ ॥

బగళా హృదయసోత్ర మిదం భక్తి సమన్వితః
పఠేద్యో బగళాతస్య ప్రసన్నా భక్తితో భవేత్.
పీతధ్యాన పరోభక్తో యః శృణోత్యవికల్పతః
నిష్కల్మషోభవేన్మర్త్యో మృతోమోక్షమవాప్నుయాత్ ॥

ఆశ్వీజస్య సితేపక్షే మహాష్టమ్యా॒దివానిశం
యస్త్విదం పఠతే ప్రేమ్ణా బగళా ప్రీతిమేతిహి ॥

దేవ్యాలయే పఠన్మ ర్తో బగళాం ధ్యాయతీశ్వరీం
పీతవస్త్రావృతో యస్తు తస్యవశ్యంతి శత్రవః ॥

పీతాచారరతో నిత్యం పీతభూషాం విచింతయన్
బగళాయాః పఠేన్నిత్యం హృదయస్తోత్ర ముత్తమమ్ ॥

నకించి ద్దుర్లభం తస్యదృశ్యతే జగతీతలే
శత్రవో గ్లానిమాయాంతి తస్య దర్శనమాత్రతః ॥

ఇతి శ్రీ విద్ధేశ్వరతంత్రే ఉత్తరఖండే శ్రీబగళాపటలే
శ్రీబగళా హృదయ స్తోత్రం సమాప్తం.

బగళాముఖీ స్తోత్రమ్

ఓం అస్య శ్రీ బగళాముఖీస్తోత్రస్య నారదఋషిః శ్రీ బగళాముఖీ దేవతా మమ సన్నిహితానాం విరోధినాం వాఙ్ముఖ పదబుద్ధీనాం స్తంభనార్థే స్తోత్రపాఠే వినియోగః

మధ్యేసుధాబ్ధి మణిమంటప రత్నవేది
సింహాసనోపరిగతాం పరిపీతవర్ణాం
పీతాంబరాభరణ మాల్యవిభూషితాంగీం
దేవీంభజామి ధృత ముద్గరవైరిజిహ్వాం ॥

జిహ్వాగ్రమాదాయ కరేణ దేవీం వామేన శత్రూన్ పరిపీడయంతీం
గదాభిఘాతేన చ దక్షిణేన పీతాంబరాఢ్యాం ద్విభుజాం భజామి ॥

చలత్కనకకుండలోల్లసితచారుగండ స్థలాం
లసత్కనకచంపక ద్యుతిమదిందుబింబాననాం
గదాహత విపక్షకాం కలితలోలజిహ్వాంచలాం
స్మరామి బగళాముఖీం విముఖవాఙ్మనస్తమ్భినీమ్ ॥

పీయూషో దధిమధ్యచారు విలసద్రత్నోత్పలే మంటపే
సత్సింహాసన మౌళిపాతిత రిపుం ప్రేతాసనాధ్యాసినీం
స్వర్ణాభాం కరపీడితారి రసనాం భ్రామ్యద్గదాం విభ్రమాం
ఇత్థం ధ్యాయతి యాంతి తస్య విలయం సద్యోఘ సర్వాపదః ॥

దేవిత్వచ్చరణాంబుజార్చనకృతేయః పీత పుష్పాంజలీన్
భక్త్యా వామకరే నిధాయ చ మనుం మన్త్రీ మనోజ్ఞాక్షరం
పీతధ్యానపరోఽథ కుంభకవశాద్బీజం స్మరేత్పార్థివ
స్తస్యామిత్ర ముఖస్యవాచిహృదయేజాడ్యం భవేత్తక్షణాత్ ॥

వాదీమూకతి కంకతి క్షితిపతి ర్వైశ్వానరశ్సీతితి
క్రోధీశామ్యతి దుర్జనస్సుజనతి క్షిప్తానుగః ఖంజతి
గర్వీ ఖర్వతి సర్వవిచ్చ జడతి త్వద్యంత్రణా యంత్రితః
శ్రీనిత్యే బగళాముఖీ ప్రతిదినం కల్యాణి తుభ్యం నమః ॥

మంత్రస్తావదయం విపక్షదలన స్తోత్రం పవిత్రంచ తే
యంత్రం వాదినియంత్రణం త్రిజగతాం జైత్రంచ చిత్రంచ తే
మాతశ్రీ శ్రీబగళేతి నామ లలితం యస్యాస్తి జంతోర్ముఖే
త్వన్నామగ్రహణేన సంసది ముఖస్తంభో భవేద్వాదినామ్ ॥

దుష్ట స్తంభన ముగ్రవిఘ్నశమనం దారిద్ర్యవిద్రావణం
భూభృ ద్భీశమనం చలన్మృగదృశాం చేతస్సమాకర్షణం
సౌభాగ్యైక నికేతనం సమదృశః కారుణ్యపూర్ణామృతం
మృత్యో ర్మారణ మావిరస్తు పురతో మాతస్త్వదీయం వపుః ॥

మాతర్భంజయమే విపక్షవదనాం జిహ్వాంచ సంకీలయ
బ్రాహ్మీంముద్రయ నాశయాశు ధిషణాముగ్రాం గతిం స్తంభయ
శత్రుం శ్చూర్ణయ దేవి తీక్ష్ణ గదయా గౌరాంగి పీతాంబరే
విఘ్నాఘుం బగళే హర ప్రణమతాం కారుణ్యపూర్ణేక్షణే ॥

మాతర్భైరవి భద్రకాళివిజయే వారాహివిశ్వాశ్రయే
శ్రీవిద్యే సమయేమహేశి బగళే కామేశి రామే రమే
మాతంగీత్రిపురే పరాత్పరతరే స్వర్గాపవర్గప్రదే
దాసోఽహం శరణాగతః కరుణయా విశ్వేశ్వరి త్రాహిమామ్ ॥

సంరంభే సారసంఘే ప్రహరణసమయే బంధనే వారిమధ్యే
విద్యావాదే వివాదే ప్రతికృతినృపతౌ దివ్యకాలే నిశాయామ్
వశ్యేవా స్తంభనేవా రిపువధసమయే నిర్ఘనేవా వనేవా
గచ్ఛం స్తేష్టం స్త్రికాలం యదిపఠతి శివం ప్రాప్నుయాదాశుధీరః ॥

నిత్యం స్త్రోత్రమిదం పవిత్ర మిహయోదేవ్యాః పఠత్యాదరాత్
ధృత్వాయంత్రమిదం తధైవ సమరే బాహూ కరేవా గళే
రాజానోప్యరయో మదాంధకరిణ స్సర్వా మృగేంద్రాదికాః
తేవైయాంతి విమోహితా రిపుగణా లక్ష్మీ స్థిరా స్సిద్ధయః ॥

త్వం విద్యా పరమా త్రిలోకజననీ విఘ్నౌఘసంఛేదినీ
యోషాకర్షణకారిణీ త్రిజగతామానంద సంవర్థినీ
యస్పోటోచ్చాటనకారిణీ జనమనస్సంమోహ సంధాయినీ
జిహ్వాకీలనభైరవీ విజయతే బ్రహ్మాస్త్ర మంత్రో యథా ॥

విద్యాలక్ష్మీ స్సర్వసౌభాగ్యమాయుః
పుత్రైః పౌత్రైః సర్వసామ్రాజ్యసిద్ధిః
మానం భోగో వన్యమారోగ్య సౌఖ్యం
ప్రాప్తం తత్తద్భూతలేఽస్మిన్నరేణ ॥

యత్కించ జపం హోమం గదితం పరమేశ్వరి
దుష్టానాం నిగ్రహార్థాయ తద్గృహాణ నమోఽస్తుతే ॥

బ్రహ్మాస్త్రమితి విఖ్యాతం త్రిషులోకేషు విశ్రుతం
గురుభక్తాయ దాతవ్యం నదేయం యస్యకస్యచిత్ ॥

పీతాంబరాం తాం ద్విభుజాం త్రినేత్రాం గాత్రగోజ్జ్వలాం
శిలాముద్గరహస్తాం చ స్మరేత్తాం బగళాముఖీమ్ ॥

ఇతి శ్రీ మద్రుద్రయామళే బగళాముఖీ స్తోత్రమ్ సమాప్తం.

శ్రీ బగళాముఖీ మహావిద్యా కవచం

శిరో మే బగళా పాతు హృదయమేకాక్షరీ పరా
ఓం హ్రీం ఓం మే లలాటే చ బగళా వైరి నాశినీ ॥

గదాహస్తా సదా పాతు ముఖం మే మోక్ష దాయినీ
వైరిజిహ్వాధరా పాతు కంఠం మే బగళాముఖీ ॥

ఉదరం నాభి దేశం చ పాతు నిత్యం పరాత్పరీ
పరాత్పరీ పాతు మే గుహ్యం పాతు సురేశ్వరీ ॥

హస్తా చైవ తథా పాతు పార్వతీ పరిపాతు మే
వివాదే విషమే ఘోరే సంగ్రామే రిపు సంకటే ॥

పీతాంబరధరా పాతు సర్వాంగా శివ నర్తకీ
శ్రీ విద్యా సమయం పాతు మాతంగీ పూరితా శివా ॥

పాతు పుత్రం సుతాశ్చైవ కళత్రం కాళికా మమ
పాతు నిత్యం భ్రాతరం మే పితరం శూలినీ సదా ॥

భారంధ్రే హి బగళా దేవ్యాః కవచం మన్ముఖోదితమ్
నవై దేయ మముఖ్యాయ సర్వసిద్ధి ప్రదాయకమ్ ॥

బగళా పూర్వతో రక్షేత్ ఆగ్నేయంచ గదాధరీ
పీతాంబరా దక్షిణే చ స్తంభినీ చైవ నైరృతే ॥

జిహ్వా కీలిన్యతో రక్షేత్ పశ్చిమే సర్వదా హి మామ్
వాయవ్యే చ మదోన్మత్తా కౌబేర్యాం చ త్రిశూలినీ ॥

బ్రహ్మాస్త్ర దేవతా పాతు ఐశాన్యాం సతతం మమ
సంరక్షే న్మాంతు సతతం పాతాళే స్తబ్ద మాతృకా ॥

ఊర్ధ్వం రక్షే న్మహాకాళీ జిహ్వాస్తంభన కారిణీ
ఏవం దశదిశో రక్షేత్ బగళా సర్వ సిద్ధిదా ॥

శ్రీ బగళాముఖీస్తుతి

సౌవర్ణాసన సంస్థితాం త్రినయనాం పీతాంశుకోల్లాసినీమ్
హేమాభాంగరుచిం శశాంకముకుటాం సచ్చంపక స్రగ్యుతాం ॥
హస్తై ర్ముద్గరపాశవజ్రరసనాః సంబిభ్రతీం భీషణ్యైః
వ్యాప్తంగీ బగళాముఖీం త్రిజగతామ్ సంస్తంభినీం చింతయే ॥
పీయూషోదధి మధ్య చారువిలసద్రత్నోజ్వలే మండపే
తత్సింహాసన మూలపాతిత రిపుం ప్రేతాసనాధ్యాసినీమ్
స్వర్ణాభాం కరపీడితారి రసనాం భ్రామ్యద్గదాం విభ్రమామ్
యస్యాం ధ్యాయతి యాంతి తస్య విలయం సద్యోహి సర్వాపదః ॥
దేవీ త్వచ్చరణాంబుజార్చన కృతేయః పీత పుష్పాంజలిమ్
ముద్రం వామకరే నిధాయ చ పునర్మంత్రీ మనోజ్ఞాక్షరీం
పీత ధ్యాన పరోఽధకుంభకవశాత్ బీజం స్మరేత్ పార్థివమ్
తస్యామిత్ర ముఖస్య వాచి హృదయే జాడ్యం భవేత్ తక్షణాత్
మాతర్భంజయ మద్విపక్షవదనం జిహ్వాం చ సంకీలయ
బ్రాహ్మీ యంత్రయ ముద్రయా మదివనా ముగ్రాంగతి స్తంభయ
శత్రుంశ్చూర్ణయ చూర్ణయాశుగదయా గౌరంగి పీతాంబరీ
విఘ్నౌఘం బగళే హరప్రణమతాం కారుణ్య పూర్ణేక్షణే
మాత ర్భైరవి భద్రకాళి విజయే వారాహి విశ్వాశ్రయే
శ్రీవిద్యే సమయే మహేశి బగళే కామేశి వామే రమే
మాతంగీ త్రిపురే పరాత్పరతరే స్వర్గాపవర్గ ప్రదే
దాసోఽహం శరణాం గతో,ఽస్మి కృపయా విశ్వేశ్వరి త్రాహిమాం ॥
పీతాంబరాంచ ద్విభుజం త్రినేత్రాం గాత్రకోజ్జ్వలాం
శిలా ముద్గర హస్తాం చ సమరే త్తాం బగళాముఖీం ॥

శ్రీ బగళాముఖీ అష్టోత్తర శతనామ స్తోత్రము

(పారాయణ నిమిత్తము)

బ్రహ్మాస్త్ర స్వరూపిణీ దేవీ మాతా శ్రీ బగళాముఖీ ।
చిచ్ఛక్తిః జ్ఞానరూపా చ బ్రహ్మానంద ప్రదాయినీ ॥

మహావిద్యా మహాలక్ష్మీ శ్రీమత్త్రిపురసుందరీ ।
భువనేశీ జగన్మాతా పార్వతీ సర్వమంగళా ॥

లలితా భైరవీ శాంతా అన్నపూర్ణా కులేశ్వరీ ।
వారాహీ ఛిన్నమస్తా తారా కాళీ సరస్వతీ ॥

జగత్పుజ్యా మహామాయా కామేశీ భగమాలినీ ।
దక్షపుత్రీ శివాంకస్థా శివరూపా శివప్రియా ॥

సర్వసంపత్కరీదేవి సర్వలోకవశంకరీ
వేదవిద్యా మహాపూజ్యా యా భక్తద్వేషీ భయంకరీ ॥

స్తంభరూపా స్తంభినీ చ దుష్టస్తంభన కారిణీ ।
భక్తప్రియా మహాభోగా శ్రీవిద్యాలలితాంబికా ॥

మైనాపుత్రీ శివానందా మాతంగీ భువనేశ్వరీ
నారసింహీ నరేంద్రా చ నృపారాధ్యా నరోత్తమా ॥

నాగినీ నాగపుత్రీ చ నగరాజసుతా ఉమా ।
పీతంబా పీతపుష్పా చ పీతవస్త్ర ప్రియా శుభా ॥

పీతగంధప్రియా రామా పీతరత్నార్చితా శివా ।
అర్ధచంద్రధరీ దేవీ గదాముద్గర ధారిణీ ॥

సావిత్రీ త్రిపదా శుద్ధా సద్యోరాగ వివర్ధినీ ।
విష్ణురూపా జగన్మోహా బ్రహ్మరూపా హరిప్రియా ॥

రుద్ర రూపా రుద్రశక్తిశ్చిన్మయీ భక్తవత్సలా ।
లోకమాతా శివా సంధ్యా శివపూజనతత్పరా ॥

ధనాధ్యక్షా ధనేశీచ ధర్మదా ధనదా ధనా ।
చండదర్పహరీ దేవీ శుంభాసుర నిబర్హిణీ ॥

రాజరాజేశ్వరీ దేవీ మహిషాసుర మర్దినీ ।
మధుకైటభహంత్రీ చ రక్తబీజవినాశినీ ॥

ధూమ్రాక్షదైత్యహంత్రీ చ భండాసుర వినాశినీ ॥
రేణుపుత్రీ మహామాయా భ్రమరీ భ్రమరాంబికా ॥

జ్వాలాముఖీ భద్రకాళీ బగళా శత్రునాశినీ ।
ఇంద్రాణీ ఇంద్ర పూజ్యా చ గుహమాతా గుణేశ్వరీ ॥

వజ్రపాశధరా దేవీ జిహ్వాముద్గర ధారిణీ ।
భక్తానందకరీ దేవీ బగళా పరమేశ్వరీ ॥

అష్టోత్తర శతం నామ్నాం బగళాయాస్తు యః పఠేత్ ।
రిపుబాధా వినిర్ముక్తః లక్ష్మీ స్థైర్యమవాప్నుయాత్ ॥

భూతప్రేతపిశాచాశ్చ గ్రహపీడానివారణమ్ ।
రాజానోవశమాయాంతి సర్వైశ్వర్యం చవిందతి ॥

నానావిద్యాం చ లభతే రాజ్యం ప్రాప్నోతి నిశ్చితం ।
భుక్తిముక్తి మవాప్నోతి సాక్షాత్ శివసమోభవేత్ ॥

ఇతిరుద్ర యామిళే సర్వసిద్ధి ప్రద బగళాష్టోత్తర శతనామస్తోత్రమ్.

శ్రీ బగళాముఖీ - యంత్రార్చన

ఉత్తరం

అన్యశ్రీ బగళాముఖీ మంత్రస్య నారద ఋషిః బృహతీఛందః బగళాముఖీ దేవతా శత్రూణాం స్తంభనార్థే మమాభీష్ట సిద్ధయే జపే వినియోగః

కరన్యాసము	**అంగన్యాసము**
ఓం హ్లీం అంగుష్ఠాభ్యాం నమః	హృదయాయ నమః
ఓం బగళాముఖీ తర్జనీభ్యాం నమః	శిరసే స్వాహా
ఓం సర్వదుష్టానాం మధ్యమాభ్యాం నమః	శిఖాయ వషట్
ఓం వాచంముఖం పదం స్తంభయ అనామికాభ్యాం నమః	కవచాయ హోం
ఓం జిహ్వాం కీలయ కనిష్ఠికాభ్యాం నమః	నేత్రత్రయాయ వౌషట్
ఓం బుద్ధిం వినాశాయ కరతలకర పృష్ఠాభ్యాం నమః	అస్త్రాయ ఫట్

హ్లీం ఓం స్వాహా ఓం భూర్భువస్సురోమితి దిగ్బంధః

ఓం మం మండూకాది పరతత్వాంత పీఠదేవతాభ్యో నమః

ప్రథమ ఆవరణ (ఈశాన్యం నుండి)

1. ఓం సం సత్త్వాయ నమః
2. .. రం రజసే నమః
3. .. తం తమసే నమః

ద్వితీయ ఆవరణ

1.	ఓం హ్లీం హృదయాయ నమః	ఆగ్నేయం
2.	ఓం బగళాముఖీ శిరసే స్వాహా నమః	ఈశాన్యం
3.	ఓం సర్వదుష్టానాం శిఖాయై వషట్	నైఋతి
4.	ఓం వాచంముఖం పదం స్తంభయకవచాయహోం	వాయవ్యం
5.	ఓం జిహ్వాం కీలయ నేత్రత్రయాయ వౌషట్	తూర్పు
6.	ఓం బుద్ధిం వినాశాయ హ్రీం ఓం స్వాహా అస్త్రాయ ఫట్	పశ్చిమం

తృతీయ ఆవరణ - అష్టదళమందు తూర్పు నుండి

1. ఓం బ్రహ్మ్యై నమః
2. ఓం మాహేశ్వర్యై నమః
3. ఓం కౌమార్యై నమః
4. ఓం వైష్ణవ్యై నమః
5. ఓం వారాహ్యై నమః
6. ఓం ఇంద్రధ్యై నమః
7. ఓం చాముండాయై నమః
8. ఓం మహాలక్ష్మ్యై నమః

అష్టదళమందు - అష్టమాతృకల సమీపమున

1. ఓం అసితాంగ భైరవాయ నమః
2. ఓం రురు భైరవాయ నమః
3. ఓం చండ భైరవాయ నమః
4. ఓం క్రోధ భైరవాయ నమః
5. ఓం ఉన్మత్త భైరవాయ నమః
6. ఓం కపాల భైరవాయ నమః
7. ఓం భీషణ భైరవాయ నమః
8. ఓం సంహార భైరవాయ నమః

చతుర్థావరణము - షోడశదళమందు

1. ఓం మంగళాయై నమః
2. ఓం స్తంభిన్యై నమః
3. ఓం జృంభిన్యై నమః
4. ఓం మోహిన్యై నమః
5. ఓం వశ్యాయై నమః
6. ఓం బలాకాయై నమః
7. ఓం అచలాయై నమః
8. ఓం భూధరాయై నమః
9. ఓం కల్మ షాయై నమః

10. ఓం ధాత్రై నమః

11. ఓం కలనాయై నమః

12. ఓం కళాకర్షిణ్యై నమః

13. ఓం భ్రామికాయై నమః

14. ఓం మందగమనాయై నమః

15. ఓం భోగస్థాయై నమః

16. ఓం భావికాయై నమః

పంచమావరణం భూపుర ద్వారముల యందు

1. ఓం గణపతయే నమః

2. ఓం వటుకాయ నమః

3. ఓం యోగినీభ్యో నమః

4. ఓం క్షేత్రపాలాయ నమః

చతుర్థావరణము - చతురస్రము వెలుపల

1. ఓం లం ఇంద్రాయై నమః
2. ఓం రం అగ్నయే నమః
3. ఓం మం యమాయ నమః
4. ఓం క్షం నిరుతయే నమః
5. ఓం వం వరుణాయ నమః
6. ఓం యం వాయవే నమః
7. ఓం సం సోమాయ నమః
8. ఓం హం ఈశానాయ నమః
9. ఓం ఆం బ్రహ్మణే నమః
10. ఓం హ్రీం అనంతాయ నమః

1. ఓం వం వజ్రాయ నమః
2. ఓం శం శక్తయే నమః
3. ఓం దం దండాయ నమః
4. ఓం ఖం ఖడ్గాయ నమః
5. ఓం పాం పాశాయ నమః
6. ఓం అం అంకుశాయ నమః
7. ఓం గం గదాయ నమః
8. ఓం త్రిం త్రిశూలాయ నమః
9. ఓం పం పద్మాయ నమః
10. ఓం చం చక్రాయ నమః

శ్రీ బగళా అష్టోత్తర శతనామావళి

(పూజా నిమిత్తము)

ఓం బ్రహ్మాస్త్రస్వరూపిణ్యై నమః
.. దేవ్యై నమః
.. మాతాయై నమః
.. శ్రీ బగళాముఖ్యై నమః
.. చిచ్ఛక్తి జ్ఞానరూపాయై నమః
.. బ్రహ్మానంద ప్రదాయిన్యై నమః
.. మహావిద్యాయై నమః
.. మహాలక్ష్మ్యై నమః
.. శ్రీమత్రిపురసుందర్యై నమః
.. భువనేశ్యై నమః
.. జగన్మాతాయై నమః
.. పార్వత్యై నమః
.. సర్వమంగళాయై నమః
.. లలితాయై నమః
.. భైరవ్యై నమః
.. శాంతాయై నమః
.. అన్నపూర్ణాయై నమః
.. కులేశ్వర్యై నమః
.. వారాహ్యై నమః
.. ఛిన్నమస్తాయై నమః
.. తారాయై నమః

ఓం సరస్వత్యై నమః
.. జగత్ పూజ్యాయై నమః
.. మహామాయాయై నమః
.. కామేశ్యై నమః
.. భగమాలిన్యై నమః
.. దక్షపుత్ర్యై నమః
.. శివాంకస్థాయై నమః
.. శివరూపాయై నమః
.. శివప్రియాయై నమః
.. సర్వసంపత్కర్యై నమః
.. సర్వలోకవశంకర్యై నమః
.. దేవేశ్యై నమః
.. వేదవిద్యాయై నమః
.. మహాపూజ్యాయై నమః
.. భక్తిప్రియాయై నమః
.. భయంకర్యై నమః
.. స్తంభరూపాయై నమః
.. స్తంభిన్యై నమః
.. దుష్టస్తంభనకారిణ్యై నమః
.. మహాభోగాయై నమః
.. శ్రీవిద్యాయై నమః

.. కాళ్యై నమః

.. మైనాపుత్ర్యై నమః

.. శివానందాయై నమః

.. మాతంగ్యై నమః

.. భువనేశ్వర్యై నమః

.. నారసింహ్యై నమః

.. నరేంద్ర్యై నమః

.. నృపారాధ్యాయై నమః

.. నరోత్తమాయై నమః

.. నాగిన్యై నమః

ఓం నాగపుత్ర్యై నమః

.. నగరాజసుతాయై నమః

.. ఉమాయై నమః

.. పీతాంబాయై నమః

.. పీతపుష్పాయై నమః

.. పీతవస్త్రప్రియాయై నమః

.. శుభాయై నమః

.. పీతగంధప్రియాయై నమః

.. రామాయై నమః

.. పీతరత్నార్చితాయై నమః

.. శివాయై నమః

.. అర్థచంద్రధర్యై నమః

.. లలితాంబికాయై నమః

.. త్రిపదాయై నమః

.. శుద్ధాయై నమః

.. సద్యోరాగాయై నమః

.. విష్ణు రూపిణ్యై నమః

.. జగన్మోహిన్యై నమః

.. బ్రహ్మరూపిణ్యై నమః

.. హరిప్రియాయై నమః

.. రుద్రరూపిణ్యై నమః

.. రుద్రశక్తి చిన్మయై నమః

ఓం భక్తవత్సలాయై నమః

.. త్రిపదాయై నమః

.. సంధ్యాయై నమః

.. శివపూజన తత్పరాయై నమః

.. ధనాధ్యక్షాయై నమః

.. ధనేశ్యై నమః

.. ధర్మదాయై నమః

.. ధనదాయై నమః

.. ధనాయై నమః

.. చండదర్పహర్యై నమః

.. శుంభాసుర వినాశిన్యై నమః

.. రాజరాజేశ్వర్యై నమః

.. గదాధారిణ్యై నమ ః

.. ముద్గర ధారిన్యై నమః

.. సావిత్ర్యై నమః

.. ధూమ్రాక్షనాశిన్యై నమః

.. దైత్యహంత్ర్యై నమః

.. భండాసుర వినాశిన్యై నమః

.. రేణుపుత్ర్యై నమః

.. భ్రామర్యై నమః

.. భ్రమరాంబికాయై నమః

.. జ్వాలాముఖ్యై నమః

.. భద్రకాళై నమః

.. మహిషాసుర మర్దిన్యై నమః

.. మధుకైటభహంత్ర్యై నమః

.. రక్తబీజ వినాశిన్యై నమః

.. శత్రునాశిన్యై నమః

.. ఇంద్రాణ్యై నమః

.. ఇంద్రపూజ్యాయై నమః

.. గుహమాతాయై నమః

.. గుణేశ్వర్యై నమః

.. వజ్రపాశధరాయై నమః

.. భక్తానందకర్యై నమః

.. బగళా పరమేశ్వర్యై నమః

ఇతి బగళా అష్టోత్తర శతనామావళి సమాప్తం



శ్రీ బగళా దేవీ దండకము

ఓం నమస్తే దేవి కల్యాణి ! బగళాముఖీ! జోహారమ్మ! ధాత్రీ ! జోహారమ్మ! కర్త్రీ జోహరులమ్మా! మముం గన్నయమ్మా! జగంబెల్ల సంసార చక్రంబునం ద్రిప్పుచున్, జంతుకోటిం భ్రమింపంగ నీవిట్లు సేయంగ లోకంబులెల్లం, దగం బంతులై వింతగా డొల్లుచుండంగ, కూటస్థవై, శక్తివై యుందువు, హృల్లేఖవున్ నీవె సర్వంబు నీవే యటంచున్, సదాకారమున్నీవ కావే, చిదాకారమున్నీవ కావే, మహానందమున్నీవ కావే, అసద్రూపమున్నీవ కావే, మహాకామేశ్వరున్ దివ్యసంపూరుషున్, వశ్యగావించుకొన్నావు, కల్పంబు నందీవ, ఏకాంత భావంబునుం బొంది, సాక్షి స్వరూపంబవై యున్నావు. తల్లీ ! నిన్ను ధాతృండె రుంగండు, విష్ణుండెరుంగండు శర్వుండెరుంగండు, జడుండన్ నేను నిన్నెట్లు తెలియంగ నేర్తున్, జగానన్ మరెవ్వరింక జ్ఞానుల్, భవచ్ఛక్తి నెన్నంగలారీశ్వరీ! నిన్ను యాచింతు నమ్మా! కృపన్ నీపాద సేవల్ ప్రసాదింపు మమ్మా! సదా నాచిత్తమందుండు మమ్మా! నీవల్లనే బ్రహ్మలోకాల సృష్టించు, విష్ణుండు పోషించు, ఈశుండు గిట్టించు, సూర్యుండు చంద్రుండు తారాగణంబుల్ వీతిహోత్రుండు నీవల్లనే, వెల్గుచున్నారు మాతా! జగన్మాతవౌ నీదు నిత్యత్వ మెన్నంగ నే నేరనమ్మా శాంతియున్ దాంతియున్ క్రాంతియున్ కీర్తియున్ రక్తియున్ ముక్తియున్ శక్తియున్ యుక్తియున్నీవె బుద్ధియున్ వృద్ధియున్ సిద్ధియున్ నీవకావే, ననుంబ్రోవుమమ్మా! కృపం జూడుమమ్మా! నామొరాలింపవమ్మా! భవాబ్ధిం తరింపంగ పోతంబవై యుండుమమ్మా! నినున్ నమ్మి నానమ్మ! నీవాడనమ్మా! జ్ఞానంబు నాకిచ్చి మన్నించుమమ్మా! నినున్ వీడనమ్మా! ననున్ జూడుమమ్మా! దయాదృష్టి వీక్షించి నన్నీయెదన్ నిల్పుకొమ్మా! ఓ మహాశక్తి ఓ దేవి! పరాశక్తి రూపా! పరంజ్యోతి రూపా! మహాదేవి మాతా! నమస్తే నమస్తే నమస్తే నమః శ్రీ బగళాముఖీ మాతకు జై.

అమ్మవారికి కంఠాభరణంగా చేయించి అలంకరిద్దామని అనుకున్న కాసుల పేరులో ఉండేపేర్లు

1.	శ్రీవిద్యా	21.	స్వాహా	41.	బృహతీ
2.	శ్రీమాతా	22.	స్వధా	42.	బ్రాహ్మణీ
3.	భవానీ	23.	మేధా	43.	బ్రాహ్మీ
4.	శాంభవీ	24.	దేవేశీ	44.	శుభకరీ
5.	శర్వాణీ	25.	త్రిపురా	45.	సావిత్రీ
6.	శాంకరీ	26.	వంద్యా	46.	శోభనా
7.	శ్రీకరీ	27.	కళాత్మికా	47.	సర్వగా
8.	శాంతా	28.	ఉమా	48.	మధుమతి
9.	నిస్తులా	29.	గౌరీ	49.	సరస్వతీ
10.	మనోన్మనీ	30.	ఆదిశక్తి:	50.	గుహాంబా
11.	పార్వతీ	31.	పరమా	51.	సాధ్వీ
12.	చిన్మయీ	32.	గురుమూర్తి:	52.	గణాంబా
13.	రక్షాకరీ	33.	త్ర్యక్షరీ	53.	ప్రియంకరీ
14.	వరదా	34.	జ్ఞానదా	54.	చిత్కళా
15.	విజయా	35.	అదృశ్యా	55.	ముక్తిదా
16.	విమలా	36.	యోగినీ	56.	మహేశ్వరీ
17.	జయా	37.	యోగదా	57.	అపర్ణా
18.	నిత్యా	38.	సర్వధారి	58.	చండికా
19.	గాయత్రీ	39.	నిర్ధ్వైతా	59.	త్ర్యంబకా
20.	నందినీ	40.	అన్నదా	60.	మహతీ

61. ప్రాణదా
62. కపర్దినీ
63. కళానిధిః
64. రసజ్ఞా
65. పూజ్యా
66. నిత్యతృప్తా
67. భావజ్ఞా
68. అజా
69. త్రయీ
70. వైష్ణవీ
71. మనస్వినీ
72. మహేశీ
73. ప్రగల్భా
74. మనోమయీ
75. శాశ్వతీ
76. శర్మదా
77. శ్రీశివా
78. ధీరా
79. సుఖకరీ
80. సువాసినీ
81. బాలా
82. ధన్యా
83. ధర్మిణీ
84. ధర్మవర్ధినీ
85. సుమంగళీ
86. లాస్యప్రియా
87. నటేశ్వరీ
88. శుద్ధమానసా
89. గంభీరా
90. త్రిపురేశీ
91. సుభగా
92. దుర్గా
93. గుణనిధిః
94. అనఘా
95. చండికా
96. కళానాథా
97. దీక్షితా
98. సుముఖీ
99. శివప్రియా
100. ప్రభావతీ
101. ప్రసిద్ధా
102. కుశలా
103. శివంకరీ
104. నిరుపమా
105. రమ్యా
106. రాజ్ఞీ
107. కల్యాణీ
108. హ్రీంకారీ
109. సర్వజ్ఞా
110. మహాదేవీ
111. మృడప్రియా
112. యజ్ఞరూపా
113. ద్యుతిధరా
114. సత్యవ్రతా
115. సౌమ్యా
116. నందినీ

రచయిత :

భాషాప్రవీణ, విద్యాప్రవీణ
డాక్టర్ తూములూరు శ్రీదక్షిణామూర్తి శాస్త్రి M.A. Ph.D

శాస్త్రిగారి ఇతర రచనలు - ప్రచురణలు

ముద్రితములు

1. శ్రీ రామకథాఽమృతము - సమగ్ర సమీక్ష
   ఆంధ్రా యూనివర్సిటీ వారిచే *Ph.D.*
   పొందిన పరిశోధన నిబంధము.
2. రామాయణం-సమాజ దర్పణం 1వ భాగము
3. రామాయణం-సమాజ దర్పణం 2వ భాగము
4. శ్రీరామ వాణి
5. వాల్మీకి వాణి
6. హనుమద్వాణి
7. పావనీ శతకము
8. మహాభారత పారిజాతము (సంకలనము)
   శ్రీలలితాసహస్రనామ వివరణము (అముద్రితము)
9. మాటలంటే మాటలా ?
10. మిగుసుసాలివారి వంశ చరిత్ర
11. తెలుగు వ్యాకరణము
12. భావదేవిశతకము
13. శ్రీ వీరాంజనేయి శతకము
14. శ్రీ సత్యనారాయణ శతకము
15. శ్రీ కపోతేశ్వర శతకము
16. శ్రీ రాజరాజేశ్వరి శతకము
17. శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్రము
    ప్రతిపదార్థసహితము
18. శ్రీ త్రికూటేశ్వర త్రిశతి
19. యోగవైభవము.
20. విష్ణు వింశతి శతకము